గురువారం
13-3-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 171
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

# అభివృద్ధి, ప్రగతి వైపు అడుగులు

- రాష్ట్రానికి రైతులే ఆత్మ... 23.35 లక్షల మందికి ప్రయోజనం
- ఘనమైన సంస్కృతికి నిలయం తెలంగాణ
- అసెంబ్లీలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



**విశాలాంధ్ర–హైదరాబాద్:** తెలంగాణ ప్రజల కలల సాకారమయ్యేలా బడ్జెట్ ఉండబోతోందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పేర్కొన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 27 వరకు జరగనున్నాయి. ఉభయ సభలనుద్దేశించి అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగించారు. ప్రజలే కేంద్రంగా పాలన సాగుతోందని అన్నారు. ఎన్నికల హామీలపై ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. ఘనమైన సంస్కృతి నిలయం తెలంగాణ అని అన్నారు. ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి కట్టుబడి ఉంది. అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యమన్నారు. రైతులు, మహిళలు, యువతకు అన్నివిధాలా సహకారం అందిస్తామన్నారు. రైతుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఘనమైన సంస్కృతికి నిలయం తెలంగాణ. ప్రజల కోసం గద్దర్, అంజయ్య వంటి ఎందరో కృషి చేశారు. జననీ జయకేతనం రాష్ట్ర గీతంగా చేసుకున్నాం. సామాజిక న్యాయం, అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరించుకున్నాం. అభివృద్ధి, ప్రగతి వైపు ప్రభుత్వం అడుగులు వేస్తోందని అన్నారు. రాష్ట్రానికి రైతులే ఆత్మ... వారి అభివృద్ధికి కృషి చేస్తున్నాం. ప్రజల కోసం నిరంతరం శ్రమించే వాళ్లే అన్నదాతలు. రాష్ట్ర అభివృద్ధిలో రైతుల భాగస్వామ్యం ఉంది. దేశంలో అత్యధికంగా ధాన్యం పండిస్తున్న రాష్ట్రం తెలంగాణ. అన్నదాతలకు రుణమాఫీ చేశాం... ఇదే మా ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం అని పేర్కొన్నారు. 23.35 లక్షల మంది కర్షకులకు ప్రయోజనం కల్పించాం. రైతు భరోసా కింద ఎకరానికి రూ.12 వేల చొప్పున వారికి అందిస్తున్నాం. రైతు నేస్తం అమలు చేస్తున్నాం. వరి పంటకు రూ.500 చొప్పున బోనస్ ఇస్తున్నాం. అన్నదాతల కోసం వ్యవసాయ కమిషన్ ఏర్పాటు చేశాం. మహాలక్ష్మి పథకం అమలు చేస్తున్నాం. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నాం. మహిళలకు 149.63 కోట్ల ఉచిత బస్సు ట్రిప్పులను కల్పించాం. ఈ పథకం ద్వారా మహిళలకు రూ.5005.95 కోట్లు ఆదా అయింది. ఇందిరా మహిళాశక్తి మిషన్ పాలసీ ద్వారా రూ.లక్ష కోట్ల ఆర్థిక సహాయం చేయడమే లక్ష్యం. యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీ ఏర్పాటు ద్వారా యువతకు సాధికారత లభిస్తోంది. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా అగ్రశ్రేణి శిక్షణ అందుతోంది. సివిల్ సర్వీసు పరీక్షల ఆశావహుల కోసం రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం పథకం తెచ్చాం. గతేడాది 55 వేల మందిగా పైగా యువత ప్రభుత్వోద్యోగాలు పొందారు. ఆరోగ్యశ్రీ పథకం రూ.10 లక్షల వరకు పెంచాం. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు బిల్లు ప్రతిపాదించాం. ఎస్సీ ఉపవర్గీకరణ కోసం బిల్లును ప్రవేశపెట్టనున్నాం అని జిష్ణుదేవ్ వర్మ అన్నారు. గవర్నర్ ప్రసంగం అనంతరం శాసనసభ గురువారానికి వాయిదా పడింది. తొలుత శాసనసభకు వచిన గవర్నర్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా మంత్రులు, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ స్వాగతం పలికారు.

**పచ్చి అబద్ధాలు చెప్పించారు: కేటీఆర్**

అసెంబ్లీలో గవర్నర్ బడ్జెట్ ప్రసంగంపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర అసంతృప్తి

- మిగతా 2 లో

## 19న బడ్జెట్...21, 22న చర్చ

తెలంగాణ బడ్జెట్‌ను ఈ నెల 19న ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన బీఏసీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, శాసనసభ వ్యవహారాల ఇంచార్జ్ మంత్రి శ్రీధర్ బాబు, సీపీఐ శాసన పక్ష నేత కూనంనేని సాంబశివ రావు, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్ రావు, వేముల ప్రశాంత్ రెడ్డి, బీజేపీ నుంచి ఏలేటి మహేశ్వర్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. సభను ఈ నెల 27వ తేది వరకు నిర్వహించాలని నిర్ణయించారు. 13న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ, 14న హోలీ సందర్భంగా అసెంబ్లీకి సెలవు ప్రకటించారు. 17, 18 తేదీల్లో బీసీ రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ బిల్లులు ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఈ నెల 27 వరకు బడ్జెట్ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. 21 నుంచి 26 వరకు పద్దులపై చర్చ జరుగుతుంది.

# 24 గంటలే గడువు

### ఆలోగా ఖైదీలను వదలకపోతే బందీలందరినీ చంపేస్తాం

- ఇప్పటికే 50 మంది హతం: బీఎల్‌ఏ స్పష్టీకరణ
- 190 మంది క్షేమం
- 30 మంది వేర్పాటువాదులు ఖతం: పాక్

**క్వెట్టా:** పాకిస్థాన్‌లో బలూచిస్థాన్ ప్రావిన్సులో జాఫర్ ఎక్స్‌ప్రెస్ హైజాక్ సంచలనంగా మారింది. 190 మంది ప్రయాణికులను కాపాడామని, 30 మంది వేర్పాటువాదులను మట్టు పెట్టామని పాకిస్థాన్ భద్రతా దళాలు ప్రకటించాయి. బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్‌ఏ), పాకిస్థాన్ సైన్యం మధ్య భీకర పోరు కొనసాగుతోంది. సైన్యం జోక్యంతో బీఎల్‌ఏ మరింతగా రెచ్చిపోయింది. 50 మంది బందీలను హతమార్చింది. ఈ మేరకు బుధవారం బీఎల్‌ఏ ఓ ప్రకటన విడుదల చేసింది. మంగళవారం రాత్రి పాకిస్థాన్ డ్రోన్ దాడికి ప్రతిగా తొలుత 10 మందిని చంపేసింది. రెండవ రోజు కొనసాగిన పోరులో మరో 10 మంది పాకిస్థానీ సైనికులను బీఎల్‌ఏ హతమార్చింది. అలాగే తాము కోరినట్లు ఖైదీలను 24 గంటల్లోగా అప్పగించకపోతే బందీలను బలూచ్ నేషనల్ కోర్టులో హాజరు పరుస్తామని తెలిపింది. బలూచిస్థాన్‌లో దురాగతాలు, మారణహోమం, దోపిడీ, యుద్ధనేరాల కింద వారికి బలూచిస్థాన్ చట్టాల ప్రకారం శిక్షలు పడతాయని బీఎల్‌ఏ ప్రతినిధి జీయాండ్ హెచ్చరించారు. కాగా, ఐదు వేర్వేరు ప్రాంతాల్లో 200 మందిని బీఎల్‌ఏ బంధించినట్లు పాకిస్థాన్ ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. వేర్పాటువాదులు చిన్న బృందాలుగా విడిపోవడంతో తమ ఆపరేషన్ కష్టతరమైనట్లు తెలిపాయి. అఫ్ఘానిస్థాన్‌లోని కీలక నాయకుడితో బీఎల్‌ఏ వేర్పాటువాదులు సంప్రదింపులు జరుపుతున్నట్లు పాక్ అంతర్గత వ్యవహారాల సహాయ మంత్రి వెల్లడించారు. హైజాక్‌లో 70–80 మంది వేర్పాటువాదులు పాల్గొన్నారన్నారు. సైన్యం అదుపులోని రాజకీయ ఖైదీలు, ఉద్యమకారులను ఇచ్చిన గడువులోగా

- మిగతా 2 లో

## ముగ్గురు ఐపీఎస్‌ల సస్పెన్షన్ పొడిగింపు

**విశాలాంధ్ర బ్యూరో– అమరావతి:** సినీనటి కాదంబరీ జత్వానీ కేసులో రాష్ట్రానికి సంబంధించిన ముగ్గురు సీనియర్ ఐపీఎస్ అధికారులపై గతంలో విధించిన సస్పెన్షన్‌ను ప్రభుత్వం మరో ఆరు నెలలు పొడిగించింది. ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ పీఎస్‌ఆర్ ఆంజనేయులు, విజయవాడ మాజీ సీపీ కాంతిరాణా టాటా, ఐపీఎస్ అధికారి విశాల్ గున్నిని గతంలో సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ గడువు ముగియడంతో సస్పెన్షన్‌ను సెప్టెంబరు 25 వరకు పొడిగిస్తున్నట్టు ప్రభుత్వం

- మిగతా 2 లో

## ఎల్‌జీపై కేసులు వెనక్కి

### ఢిల్లీ ప్రభుత్వం నిర్ణయం

**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో కీలక పరిణామాలు చోటు చేసుకొంటున్నాయి. గతంలో లెఫ్టినెంట్ గవర్నర్, ఢిల్లీ ప్రభుత్వం మధ్య అనేక విషయాల్లో వివాదాల కారణంగా నమోదైన కేసులు ఉపసంహరణపై సీఎం రేఖా గుప్తా నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం యోచిస్తోంది. ఈ మేరకు సంబంధింత వర్గాలు వెల్లడించాయి. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధికారంలో ఉన్నప్పుడు లెఫ్టినెంట్ గవర్నర్లు నజీబ్ జంగ్, అనిల్ బైజల్, వీకే సక్సేనా మధ్య కొన్ని అంశాలపై అభిప్రాయాలు

- మిగతా 2 లో

## పోసానికి హైకోర్టులో చుక్కెదురు

**విశాలాంధ్ర బ్యూరో – అమరావతి:** సినీ నటుడు పోసాని కృష్ణమురళి లంచ్ మోషన్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. సీఐడీ పోలీసులు దాఖలు చేసిన పీటీ వారెంట్‌ను కొట్టివేయాలంటూ (క్వాష్) పోసాని హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. సీఐడీ పోలీసులు పీటీ వారెంట్ అమలు చేసి పోసానిని కర్నూలులో అదుపులోకి తీసుకున్నారని పీపీ కోర్టుకు తెలిపారు. మంగళగిరిలోని మేజిస్ట్రేట్ వద్ద హాజరుపరిచేందుకు తీసుకొస్తున్నారని ప్రభుత్వ న్యాయవాది హైకోర్టుకు నివేదించారు. దీంతో సీఐడీ పీటీ వారెంట్‌ను సవాల్ చేస్తూ పోసాని

- మిగతా 2 లో

# 'తెలంగాణ సాధనలో యువత పాత్ర కీలకం'

- నిరుద్యోగులపై చిత్తశుద్ధి చూపని బీఆర్‌ఎస్
- కేసీఆర్ వారసత్వంగా ఇచ్చింది అప్పులు
- పదోన్నతులు, బదిలీలతో విద్యాశాఖ ప్రక్షాళన
- అధ్యాపకులు రాష్ట్రాన్ని అభివృద్ధివైపు నడిపించాలి
- నియామకపత్రాల అందజేతలో సీఎం రేవంత్

**విశాలాంధ్ర–హైదరాబాద్:** నిరుద్యోగ సమస్య తెలంగాణ ఉద్యమానికి ఊపిరిపోసిందని, రాష్ట్ర సాధనలో యువత క్రియాశీల పాత్ర పోషించారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రవీంద్రభారతిలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో... జూనియర్ అధ్యాపకులు, పాలిటెక్నిక్ లెక్చరర్ల ఉద్యోగాలకు ఎంపికైన 1,532 మందికి సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. అనంతరం సీఎం మాట్లాడుతూ... గత ప్రభుత్వం నిరుద్యోగుల విషయంలో చిత్తశుద్ధి చూపలేదన్నారు. గత ప్రభుత్వ పెద్దల ఉద్యోగాలు తీస్తేనే నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయని తాను చెప్పినట్లు గుర్తు చేశారు. కొత్త అధ్యాపకులు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంవైపు నడిపించాలన్నారు. 'అధికారంలోకి వచ్చాక మొదటి ఏడాదిలోనే 55,163 ఉద్యోగ నియామకాలు చేపట్టాం. ఉద్యోగ నియామకాలకు సంబంధించి కోర్టుల్లో ఉన్న చిక్కుముళ్లు విప్పుతూ సమస్యలు పరిష్కరించాం. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న టీచర్ల బదిలీలు, పదోన్నతుల సమస్యను పరిష్కరించి విద్యాశాఖను ప్రక్షాళన చేశామని తెలిపారు. గతంలో సంతలో సరకులా ప్రశ్నపత్రాలు అమ్మారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో ఉందని పెద్దలు చెప్పారు. 30వేల ప్రభుత్వ పాఠశాలల్లో 25లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. 11వేల ప్రైవేటు పాఠశాలల్లో 36.7లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. ప్రభుత్వం కంటే ప్రైవేటు పాఠశాలలు గొప్పవా... ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు రూ.25వేల వరకు ఖర్చవుతుంటే.. ప్రభుత్వ బడుల్లో రూ.లక్ష వరకు ఖర్చవుతోంది. విద్యార్థుల భవిష్యత్‌ను విద్యాశాఖ తీర్చిదిద్దాలి. గతంలో విద్యాశాఖ నిర్లక్ష్యానికి గురైంది. దానిని ప్రక్షాళన చేసి

- మిగతా 2 లో

# ప్రైవేటీకరణతో అనర్థాలు

### రాజ్యసభలో ప్రతిపక్షాల విమర్శ

**న్యూఢిల్లీ:** కేంద్రప్రభుత్వం రైల్వేకి సంబంధించి వివిధ కార్యకలాపాలను ప్రైవేటీకరించడం భద్రతకు విఘాతం కలిగించిందని, దీనివల్ల ప్రమాదాలు జరిగి అనేక మంది ప్రయాణికులు మరణించారని రాజ్యసభలో బుధవారం ప్రతిపక్ష సభ్యులు ఆక్షేపించారు. రైల్వే మంత్రిత్వ శాఖ పనితీరుపై చర్చ సందర్భంగా, ఎన్ ఆర్ ఇలంగో (డీఎంకే) మాట్లాడుతూ... రైల్వేలలో కాంట్రాక్టలైజేషన్, వర్క్‌ఫోర్స్ అవుట్‌సోర్సింగ్ ద్వారా 20 లక్షల ఉద్యోగాలను తగ్గించారన్నారు. కేంద్రంల బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2015లో నీతి ఆయోగ్ కమిటీ భారతదేశ విస్తృత రైల్వే నెట్‌వర్క్‌లోని ప్రధాన విభాగాలను ప్రైవేటీకరించడానికి రెండు దశాబ్దాల దార్శనికతను ప్రతిపాదించింది. అప్పటి నుండి ప్రభుత్వం బహుళ విధానాల ద్వారా వివిధ ప్రైవేటీకరణ చర్యలను అమలు చేసిందని ఆయన అన్నారు. "2018-2021 మధ్య సున్నా మరణాలతో పోలిస్తే... గత మూడు నాలుగు సంవత్సరాలలో రైలు ప్రమాదాల కారణంగా 400 మంది ప్రయాణికుల విలువైన ప్రాణాలను కోల్పోయాము. ఉద్యోగుల ప్రైవేటీకరణ కారణంగా ఇది జరుగుతోంది" అని విమర్శించారు. ప్రభుత్వం 'లైన్ నిర్వహణ, మౌలిక సదుపాయాల నిర్వహణతో సహా ప్రతిదీ కాంట్రాక్టర్లకు ఇస్తోందని ఇలంగో పేర్కొన్నారు. ప్రభుత్వం కాంట్రాక్టర్లకు పనులు అప్పగిస్తే... వారు సబ్-కాంట్రాక్ట్ ఇస్తారు. ఆ సబ్-కాంట్రాక్టర్ ఉద్యోగులు వ్యవస్థను స్వంతం చేసుకోరు. అందుకే ఈ రకమైన ప్రమాదాలు జరుగుతాయి. దానికి

- మిగతా 2 లో

# వాటాలు ఏవిధంగా తీసుకున్నారు?

- విజయసాయిరెడ్డిపై సీఐడీ ప్రశ్నల వర్షం
- కాకినాడ సీపోర్టు వ్యవహారంలో విచారణ

**విశాలాంధ్ర బ్యూరో–అమరావతి:** మాజీ ఎంపీ విజయసాయిరెడ్డిపై మంగళగిరి సీఐడీ పోలీసులు ప్రశ్నల వర్షం కురిపించారు. కాకినాడ సీపోర్టు ప్రైవేటు లిమిటెడ్ అధిపతి కేవీ రావు నుంచి అక్రమంగా వాటాలను బదిలీ చేసుకున్నారన్న ఆరోపణలపై ఆయనను బుధవారం ప్రశ్నించారు. వాటాలు ఏ విధంగా తీసుకున్నారు, బలవంతంగా లాక్కున్నారా, బలవంతంగా తీసుకుంటే ఇందులో ఎవరెవరి పాత్ర ఎంతనే విషయాలను విజయసాయిరెడ్డి నుంచి సీఐడీ అధికారులు రాబట్టే ప్రయత్నం చేశారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 3.30 గంటలపాటు అధికారులు ఆయనను ప్రశ్నించారు. కేవీ రావు ఫిర్యాదు మేరకు విక్రాంత్ రెడ్డి, విజయసాయిరెడ్డి, శరత్ చంద్రారెడ్డి, శ్రీధర్, అరబిందో రియాల్టీ ఇన్ఫ్రాపై కేసు నమోదైంది. విచారణకు హాజరుకావాలంటూ

- మిగతా 2 లో

### రాష్ట్రాభివృద్ధికి హైదరాబాద్

# తలమానికం

- భారీ పరిశ్రమలకు దశలవారీ ప్రోత్సాహం
- వలసలకు అనుగుణంగా మౌలికవసతులు
- డిమాండ్‌కు తగ్గట్టు విద్యుత్ ప్రణాళిక: భట్టి

**విశాలాంధ్ర – హైదరాబాద్:** రాష్ట్రాభివృద్ధికి హైదరాబాద్ తలమానికమని, ఐటీ, పరిశ్రమల శాఖ ఏడాదికాలంగా అనేక సదస్సులు నిర్వహించి భారీగా పెట్టుబడులు సాధించి రాష్ట్ర గొప్పదనాన్ని పెంచిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ప్రజాభవన్‌లో బుధవారం ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్, పట్టణాభివృద్ధి, ఇంధన శాఖ ప్రీ బడ్జెట్ సమావేశాలు జరిగాయి. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి డిప్యూటీ సీఎం మాట్లాడారు. రాష్ట్ర

- మిగతా 2 లో

### కొరవడిన వ్యక్తిగత... వృత్తిగత సమతుల్యత

# ఒత్తిడిలో 52 శాతం ఉద్యోగులు

**న్యూఢిల్లీ:** వ్యక్తిగత, వృత్తిగత జీవితాన్ని సమతుల్యం చేయలేక 52 శాతం మంది ఉద్యోగులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని న్యూయార్క్ కేంద్రంగా నడుస్తోన్న వర్టెక్స్ గ్రూప్ వెల్లడించింది. ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, కర్నాటక, పంజాబ్, ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 1500 మందిపై ఈ సర్వే నిర్వహించి ఫలితాలు వెల్లడించింది. 'వర్క్-లైఫ్ బ్యాలెన్స్ అత్యావశ్యకం. ఐటీ సెక్టార్‌లో ఇది మరీ ముఖ్యం. ఉద్యోగుల అంచనాలను సంస్థలు పరిగణనలోకి తీసుకోవాలి. వారాంతాల్లో పనిభారం మోపకూడదు. కొత్తవారానికి రీఛార్జి అయి వచ్చేందుకు వారాంతాల్లో సమయం ఉండాలి. అత్యవసరమైతే తప్ప ఈ సమయంలో పని అప్పగించకూడదు' అని వర్టెక్స్ గ్రూప్ వ్యవస్థాపకులు గగన్ అరోడా వెల్లడించారు. 23 శాతం మంది ఉద్యోగులు సాధారణ పనిగంటలకు మించి పనిచేస్తున్నట్లు సర్వేలో వెల్లడైంది. ఉద్యోగుల మానసిక ఆరోగ్యం సంస్థ వృద్ధికి కీలకమని పేర్కొంది. వృత్తి సంబంధిత ఒత్తిడి కారణంగా వ్యాపారవేత్తలు, ఉద్యోగుల అకాల మరణాలు అత్యంత ఒత్తిడితో కూడిన వృత్తుల్లో ఆరోగ్యానికి ఇవ్వాల్సిన ప్రాధాన్యతను గుర్తుచేస్తున్నాయని తెలిపింది. 8, 9 గంటల షిఫ్ట్‌లో 20 శాతం మంది సిబ్బంది 2.5 గంటల నుంచి 3.5 గంటలు మాత్రమే సరిగ్గా పనిచేస్తున్నారని, పనిగంటలు పెంచడం వల్ల వారిలో ఉత్పాదకత, సృజన దెబ్బతింటోందని సర్వే పేర్కొంది. 'ఈ సాంకేతిక యుగంలో వర్క్-లైఫ్ బ్యాలెన్స్ సరిగా లేకపోవడం వల్ల రోబోలుగా మారుతున్నారు. ఒక్కోసారి మరణాలు సంభవిస్తున్నాయి. పనిగంటలు పెంచే బదులు నైపుణ్యాలు, ఉత్పాదకత పెంచడానికి సాంకేతికతను ఉపయోగించుకోవడం ముఖ్యం' అని గగన్ అభిప్రాయపడ్డారు. గతంలో ఇదే అంశంపై ప్రముఖ జాబ్‌సైట్ ఇండీడ్ 'ఫ్యూచర్ కెరీర్ రిజల్యూషన్ రిపోర్ట్‌ను' విడుదల చేసింది. సర్వేలో పాల్గొన్న భారతీయుల్లో ఐదుగురిలో నలుగురు (78 శాతం) కుటుంబ బంధాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు

- మిగతా 2 లో

## ఇదీ లోకం!

నేనేటి చెయ్యాలి బాబూ? దాంతో కలిసి అడుక్కోమంటారేటి?

## భారత స్వాతంత్ర్య పతాకం ఎరుపు

భారత జాతీయ పతాకం రూపు రేఖలు ఏమిటో కొత్తగా చెప్పక్కర్లేదు. కానీ చరిత్రలో మరుగున పడిపోయిన ప్రధానమైన అంశం ఒకటుంది. 1929వ సంవత్సరం ముగిసి 1930 ఆరంభం అవుతున్న అర్ధ రాత్రి భారత స్వాతంత్ర్య పతాకం ఆవిష్కృతం అయింది. అదీ మువ్వన్నెల పతాకమే. ఆ పతాకంలో పైన ఎరుపు, మధ్యలో తెలుపు, అడుగున ఆకుపచ్చ రంగులు ఉండేవి.

ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో

# కమ్యూనిస్టు వ్యతిరేకత నశించాలి

## కేకేఈ, కేఎన్ఈ

**ఏథెన్స్:** ఉక్రెయిన్, రష్యా దేశాల్లో కమ్యూనిస్టు వ్యతిరేకత, ప్రజాస్వామ్య వ్యతిరేకత నశించాలని గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కేకేఈ), కమ్యూనిస్టు యూత్ ఆఫ్ గ్రీస్ (కేఎన్ఈ) పిలుపునిచ్చాయి. కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారాన్ని తీవ్రంగా ఖండించాయి. అప్రజాస్వామిక విధానాలు, చట్టాల రద్దునకు డిమాండ్ చేశాయి. ఇదే క్రమంలో కేఎన్ఈ అధ్వర్యంలో గ్రీస్ రాజధాని ఏథెన్స్‌లోని ఉక్రెయిన్ రాయబార కార్యాలయం ముట్టడి జరిగింది. నిరసన లేఖను కార్యాలయం తలుపునకు కేకేఈ, కేఎన్ఈ ప్రతినిధి బృందం అతికించింది. వినూత్నంగా నిరసన తెలిపింది. ఉక్రెయిన్ కమ్యూనిస్ట్ యూత్ లీగ్ సభ్యులు మిఖాయిల్, అలగ్జాండర్ కొనోనోవిచ్ అరెస్టు, నిర్బంధంలో వేధింపులు, ఖైదు కొనసాగింపును ప్రతినిధులు ఖండించారు. తప్పుడు ఆరోపణలతో కమ్యూనిస్టు నేతలను వేధిస్తున్నారని దుయ్యబట్టారు. కొనోనోవిచ్ సోదరులపై కేసులు కొట్టివేసి, వారిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వారి భద్రత ఉక్రెయిన్ అధికారుల బాధ్యతని నొక్కిచెప్పారు. కమ్యూనిస్టు వ్యతిరేక, ప్రజాస్వామ్య వ్యతిరేక చట్టాల రద్దునకూ డిమాండ్ చేశారు. అదే సమయంలో ఏథెన్స్‌లోని రష్యా రాయబార కార్యాలయానికి ఓ లేఖ పంపారు. మార్క్సిస్టు బోరిస్ కగార్లిట్సీని ఐదేళ్లుగా నిర్బంధంలో ఉంచి వేధిస్తుంటంపై ఆవేదన వ్యక్తంచేశారు. బోరిస్ ప్రాణానికి హాని ఉన్నదని పేర్కొన్నారు.

బోరిస్‌పై ఉన్న తప్పుడు కేసులను కొట్టివేసి ఆయనను తక్షణమే విడుదల చేయాలని కేకేఈ, కేఎన్ఈ ప్రతినిధులు డిమాండ్ చేశారు. బోరిస్ భద్రత రష్యా అధికారులే బాధ్యత వహించాలన్నారు. అప్రజాస్వామిక చట్టాల రద్దునకు గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ డిమాండ్ చేసింది. బోల్షెవిక్స్, వీఐ లెనిన్, సోవియట్ వ్యతిరేక ప్రచారం ఆమోదయోగ్యం కాదని, ఇది నశించాలని తన లేఖలో కేకేఈ స్పష్టంచేసింది.

# ఏప్రిల్ నుంచి అమెరికాపై ఈయూ ప్రతీకార సుంకాలు

**బ్రసెల్స్:** అమెరికా వాణిజ్య యుద్ధానికి కాలుదువ్వుతున్న వేళ ప్రతీకార సుంకాల అమలునకు యూరోపియన్ యూనియన్ సిద్ధమైంది. స్టీల్, అల్యూమినియంపై అమెరికా విధించిన సుంకాలకు ప్రతీకారంగా వాషింగ్టన్‌కు చెందిన 28.33 బిలియన్ డాలర్ల విలువ చేసే వస్తువులపై ప్రతీకార సుంకాలు విధించాలని నిర్ణయించింది. ఏప్రిల్ 1వ తేదీ నుంచి కొత్త సుంకాలు అమల్లోకి వస్తాయని ఈయూ ప్రకటించింది. అమెరికా ఉత్పత్తులపై ఇప్పటివరకు ఇచ్చిన మినహాయింపులన్నీ రద్దు చేస్తున్నట్లు వెల్లడించింది. 'ఏప్రిల్ 1న మొదలై... 13వ తేదీ నాటికి రెండు దశల్లో సుంకాలు పూర్తి స్థాయిలో అమల్లోకి వస్తాయి' అని ఈయూ తెలిపింది. అమెరికాపై అర్థవంతమైన చర్చలు తీసుకునే బాధ్యతను ట్రేడ్ కమిషనర్ మారోస్ సెఫ్కోవిక్‌కు అప్పగించానని యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డెర్ లెయెన్ అన్నారు. వినియోగదారులు, వ్యాపారుల రక్షణకు ఈయూ కట్టుబడి ఉన్నదని చెప్పారు. ఇందుకోసం అమెరికాతో చర్చలకూ సానుకూలంగా ఉన్నట్లు తెలిపారు.

# గ్రీన్‌ల్యాండ్‌లో డెమొక్రటిక్ పార్టీ గెలుపు

**నూక్:** గ్రీన్‌ల్యాండ్ సార్వత్రిక ఎన్నికల్లో సెంటర్ రైట్ డెమొక్రటిక్ పార్టీ సత్తా చాటింది. గ్రీన్‌ల్యాండ్‌ను వశపర్చుకోవడం కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా యత్నిస్తున్న వేళ అనూహ్య ఫలితం వెలువడింది. చాలా ఏళ్లుగా గ్రీన్‌ల్యాండ్‌ను పాలించిన పార్టీలను డెమొక్రాటిక్స్ ఓడించడాన్ని బట్టి ఇక్కడి ప్రజలు ఆరోగ్య సంరక్షణ, విద్య, సాంస్కృతిక వారసత్వం, ఇతర సామాజిక విధానాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని స్పష్టమవుతోంది. డెమొక్రాటిక్‌ల గెలుపుపై ఆ పార్టీ నేత జెన్స్ ఫ్రెడ్రిక్ నీల్సన్ హర్షం వ్యక్తం చేశారు. ఇది గ్రీన్‌ల్యాండ్ రాజకీయ చరిత్రలోనే చారిత్రక ఫలితమన్నారు. గ్రీన్‌ల్యాండ్‌కు భవిష్యత్‌పై రాజకీయంగా ఏ విధంగా ముందుకెళ్లాలన్న దానిపై అన్ని పార్టీలతో చర్చిస్తామని నీల్సన్ చెప్పినట్లు డానిష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ నివేదించింది. 'ఇలాంటి ఫలితం ఊహించలేదు. చాలా సంతోషంగా ఉంది. బాహ్య ఒత్తిళ్లు-సవాళ్ల క్రమంలో గ్రీన్‌ల్యాండ్ ఐక్యంగా ఉండాలి' అని నీల్సన్ అన్నట్లు కేఎన్ఆర్ టీవీ పేర్కొంది. గ్రీన్‌ల్యాండ్ మునుపెన్నడూ అనుభవిస్తున్న క్లిష్టపరిస్థితుల దృష్ట్యా ఐక్యత కీలకమంటూ ఫిబ్రవరిలో ముందస్తు ఎన్నికలను ప్రధాని మ్యుటే బౌరుప్ ఎగెడె ప్రకటించారు. ఫలితాలు బుధవారం (మార్చి 12న) వెలువడ్డాయి. ఈ సందర్భంగా ఓటర్లందరికీ ప్రధాని కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేసేలా చర్యలకు పార్టీలు సానుకూలంగా ఉన్నాయన్నారు.

# అభివృద్ధి, ప్రగతి వైపు అడుగులు

(మొదటిపేజీ తరువాయి)

వ్యక్తం చేశారు. గవర్నర్ ప్రసంగం గాంధీభవన్‌లో కాంగ్రెస్ నేతల విలేకరుల సమావేశంలా ఉందని ఎద్దేవా చేశారు. గవర్నర్‌తో పచ్చి అబద్ధాలు చెప్పించారని విమర్శించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద కేటీఆర్ మాట్లాడుతూ... 'గవర్నర్ ప్రసంగంలో రైతులకు భరోసా ఇస్తారని భావించాం. 20 నుంచి 30 శాతానికి మించి రైతులకు రుణమాఫీ జరగలేదు. కానీ... పూర్తిగా చేసినట్లు గవర్నర్‌తో అబద్ధాలు చెప్పించి ఆయన స్థాయిని దిగజార్చారన్నారు. సాగునీటి సంక్షోభం, రైతుల ఆత్మహత్యలపై గవర్నర్ ఒక్క మాట కూడా మాట్లాడలేదు. కాంగ్రెస్ చేసిన అప్పుల గురించి ప్రస్తావన లేదు' అని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ వైఫల్యంతో రైతులు ఆరిగోసలు పడుతున్నా రని, పంటలు ఎండిపోతున్నాయని, 480 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నప్పటికీ గవర్నర్ ప్రసంగంలో ఆ కుటుంబాలకు భరోసా ఇచ్చే ఒక్క మాట కూడా లేదని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. లక్షలాది రైతులు సంతోషంగా ఉన్నారని అబద్ధాలు చెప్పించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు రుణమాఫీ, పెట్టుబడి సాయం అందక ఆగమాగుతుంటే, రైతు బంధు అందిందని, కూలీలకు సంవత్సరానికి రూ.12,000 ఇస్తున్నామని గవర్నర్ నోటి ద్వారా అసత్యాలు చెప్పించారని విమర్శించారు.

**అసెంబ్లీకి కేసీఆర్...**

బడ్జెట్ సమావేశాలు ప్రారంభమైన నేపథ్యంలో బీఆర్ఎస్ అధినేత, శాసనసభ ప్రతిపక్ష నేత కేసీఆర్ సభకు హాజరయ్యారు. ఉదయం నంది హిల్స్ లోని ఆయన స్వగృహం నుంచి నేరుగా శాసనసభకు వచ్చారు. గవర్నర్ ప్రసంగిస్తున్నంత సేపు అక్కడే ఉన్న కేసీఆర్ ... ప్రసంగం అయిన వెంటనే సభ నుంచి వెళ్లిపోయారు. అయితే గవర్నర్ ప్రసంగం సాగుతున్న క్రమంలోనే ప్రభుత్వం గవర్నర్ చేత పచ్చి అబద్ధాలు మాట్లాడిస్తున్నారని బీఆరెస్ సభ్యులు నినాదాలు చేయడంతో సభలో గందర గోళం నెలకొంది. అయినా గవర్నర్ తన ప్రసంగాన్ని కొనసాగించారు. అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహంపై కేసీఆర్ తమ ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేసినట్లు సమాచారం.

# 'తెలంగాణ సాధనలో యువత పాత్ర కీలకం'

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం అండగా ఉంది. విద్యకు ప్రాధాన్యం ఇచ్చి విద్యాశాఖకు రూ.21,650 కోట్లు కేటాయించాం' అని సీఎం వివరించారు. ప్రభుత్వ స్కూళ్లలో విద్యాప్రమాణాలు పెంచేందుకే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ను నిర్మించబోతున్నామని పేర్కొన్నారు. ఇటీవలే 55 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ కోసం రూ.11 వేల కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. విద్యార్థి, నిరుద్యోగుల్లో నైపుణ్యాన్ని పెంచేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామన్నారు. వచ్చే ఒలంపిక్స్ లక్ష్యంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీతో పాటు, యంగ్ ఇండియా స్పోర్ట్స్ అథారిటీని ఏర్పాటు చేసుకుంటున్నామని వివరించారు. క్రీడల్లో రాణించిన వారికి ప్రభుత్వం ప్రోత్సాహం కల్పిస్తోందని, క్రికెట్ లో రాణించిన సిరాజ్ కోసం నిబంధనలు సడలించి ఉద్యోగం ఇచ్చాం, బాక్సింగ్ లో రాణించిన నిఖత్ జరీన్ కు డీఎస్పీ ఉద్యోగం కల్పించామని, పారాలింపిక్స్ లో రాణించిన దీప్తి జీవాంజీకి ఇంటి స్థలంతో పాటు ఉద్యోగం ఇచ్చామని అన్నారు. కేసీఆర్ మాకు వారసత్వంగా ఇచ్చింది అప్పులు, తప్పులు మాత్రమే అంటూ ధ్వజమెత్తారు. నేను వాస్తవాలు చెబుతుంటే, దిగిపో దిగిపో అని మాట్లాడుతున్నారని, కేసీఆర్ కుటుంబం మొత్తం ఫ్యామిలీ ప్యాకేజ్ లా అబద్ధాలు మాట్లాడుతున్నారన్నారు. తెలంగాణలో భావితరాల భవిష్యత్ నిర్మాణానికి మీ సహకారం అవసరమన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, జీహెచ్ ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేటీకరణతో అనర్థాలు

(మొదటిపేజీ తరువాయి)

బదులుగా మీరు రైల్వేలలో వ్యక్తులను నియమించుకుంటే, వారు వ్యవస్థను స్వంతం చేసుకుంటారు. ప్రమాదాలు చాలా తక్కువ స్థాయికి తగ్గుతాయి" అని ఇలంగో అన్నారు. చర్చలో పాల్గొన్న సంజయ్ యాదవ్ (ఆర్జేడీ) ఇటీవలి కాలంలో జరిగిన భారీ రైలు ప్రమాద ఘటనల్ని ఉదహరించారు. భద్రతా వ్యవస్థ 'కవచ్'ను పూర్తిగా అమలు చేయలేదని... దీని కోసం ఎదురుచూస్తు ఇంకా ఎందరు ప్రాణాలు కోల్పోవా లోనని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. రైలు పట్టాలు తప్పడం, రైళ్లు, స్టేషన్లలో టాయిలెట్ల శుభ్రత, జనసమూహాన్ని అదుపు చేయలేకపోవడం వంటి అనేక అంశాలను ఎత్తి చూపుతూ... భారతదేశంలో రైలు ప్రయాణాలు బాధాకరంగా మారాయన్నారు. 'రైలు భారతదేశానికి జీవనాడి. కానీ ఈ ప్రభుత్వం దానిని నిర్జీవ స్థితిలోకి నెట్టింది' అని యాదవ్ విమర్శించారు. రైల్వేలను ఆధునీకరిం చేటప్పుడు ప్రభుత్వం పేదల దుస్థితిని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. మాజీ ప్రధాన మంత్రి హెచ్‌డి దేవెగౌడ (జెడీఎస్) మాట్లాడుతూ...గత 60 ఏళ్లలో చేసిన పనితో పోల్చితే... ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పష్టమైన దార్శనికత, భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనే ఆయన ఆశయం కారణంగా రైల్వేలు గత పదేళ్లలో గొప్ప పురోగతి సాధించాయని తెలిపారు. అయోధ్య రామి రెడ్డి (వైసీపీ) మాట్లాడుతూ... రైల్వేలను ఆధునీకరిం చడానికి ప్రభుత్వం తీసుకున్న వివిధ చర్యలను అభినందించారు. అయితే ప్రస్తుత వేగం, దార్శనికత సరిపోద న్నారు. రైల్వేల మొత్తం ఆదాయంలో రాష్ట్రం అందించే వాటా చాలా తక్కువగా ఉందని పేర్కొంటూ కేంద్రం ఒడిశాను నిర్లక్ష్యం చేస్తోందని సుభాశిష్ ఖుంటియా (బీజేడీ) ఆరోపించారు.

# ముగ్గురు ఐపీఎస్‌ల సస్పెన్షన్ పొడిగింపు

(మొదటిపేజీ తరువాయి)

ఉత్తర్వుల్లో పేర్కొంది. తప్పుడు కేసులో ముంబై సినీనటి కాదంబరీ జత్వానీని అరెస్టు చేసి... ఇబ్బందులకు గురిచేసిన వ్యవహారంలో ఈ ముగ్గురిపై అభియోగాలున్నాయి. ముగ్గురూ అఖిలభారత సర్వీసు నిబంధనలు ఉల్లంఘించారన్న ఆరోపణలపై రివ్యూ కమిటీ సిఫారసు తర్వాత సస్పెన్షన్ పొడిగిస్తున్నట్టు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

# మహిళా సాధికారతతోనే సుస్థిరాభివృద్ధి

**విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:** మహిళా సాధికారతతోనే సుస్థిరాభివృద్ధి సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలో మహిళా సాధికారత టీడీపీతోనే ప్రారంభమైందన్నారు. నిన్న, నేడు, రేపు ఎప్పుడూ మహిళల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించారు. నాడు ఎన్టీఆర్ పురుషులతో సమానంగా మహిళలకు ఆస్తి హక్కు కల్పించారని, తాను డ్వాక్రా స్థాపించి వారి ఆర్థిక ప్రగతికి బాటలు వేశానని చెప్పారు. తాజాగా ఏడాదిలో లక్షా 75 వేలమంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చంద్రబాబు వెల్లడించారు. మహిళా సాధికారతపై శాసనసభలో ముఖ్యమంత్రి సుదీర్ఘ ప్రసంగం చేశారు. 'మన జనాభాలో 50 శాతం మహిళలు ఉన్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా ప్రపంచమంతా నాగరికత వైపు పయనిస్తున్నా ఇంకా మహిళల పట్ల వివక్ష కొనసాగుతుండటం బాధాకరం. అందువల్లే కేంద్రం, రాష్ట్రంలోని ఎన్డీఏ ప్రభుత్వాలు ఆడబిడ్డల గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. మహిళలను విద్యాపరంగా ప్రోత్సహించేందుకు 1983లో ఎన్టీఆర్ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఏర్పాటు చేశారు. 1995లో నేను సీఎం అయ్యాక విద్యా, ఉద్యోగాలు, రాజకీయాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు పెట్టాలని నిర్ణయించాను. ఆడబిడ్డ పుడితే మహాలక్ష్మిగా భావించి రూ.5 వేలు బ్యాంకులో డిపాజిట్ చేసి 18 ఏళ్ల తర్వాత ఆ డబ్బులు కానుకగా ఇచ్చాను. 8, 9, 10 తరగతి విద్యార్థినులకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేశాం. దీపం పథకం అమలు చేశాం. దేశంలో అత్యధికంగా 65 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఇచ్చాం. ఇప్పుడు దీపం-2 కింద మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తున్నాం. పసుపు కుంకుమ కింద ఒక్కో డ్వాక్రా మహిళకు రూ.10 వేల చొప్పున రూ.9,689 అందించాం. స్త్రీ నిధి కింద రూ.4,440 కోట్ల ఆర్థిక సాయం చేశాం. తల్లీబిడ్డా ఎక్స్ ప్రెస్, ఎన్టీఆర్ బేబీ కిట్స్, తల్లికి వందనం, అన్న అమృత హస్తం, బాలామృతం, బాలికలకు రక్ష, పెళ్లికానుక, గిరి గోరుముద్ద, ఫుడ్ బాస్కెట్, మహిళలకు 11 రకాల ఉచిత వైద్య పరీక్షలు, మహిళల గౌరవాన్ని కాపాడేందుకు మరుగుదొడ్లు, సామూహిక శ్రీమంతాలు నిర్వహించాం. మొత్తం 37 లక్షల 39 వేల 522 మంది మహిళలు పెన్షన్లు అందుకుంటున్నారు. ఒక్క మహిళలకే పెన్షన్ల కింద నెలకు రూ.1,543 కోట్లు ఖర్చు చేస్తున్నాం. ఇలా మహిళల ఆరోగ్యం, భద్రత కోసం 9 నెలల వ్యవధిలోనే అనేక కార్యక్రమాలు తెచ్చాం' అని సీఎం వివరించారు.

**ఆస్తి కోసం తల్లిచెల్లిని గెంటిన వారా మాపై విమర్శలు?**

1986లో ఎన్టీఆర్ మహిళలకు ఆస్తిలో హక్కు కల్పించారని చంద్రబాబు గుర్తుచేశారు. 2005లో కేంద్రం దీన్ని చట్టం చేసింది. అయితే మన రాష్ట్రంలో తల్లికి, చెల్లికి ఆస్తిలో వాటా ఇవ్వని వ్యక్తి నిన్నటి వరకూ సభలో ముఖ్య మంత్రిగా ఉన్నాడని జగన్‌ను ఉద్దేశించి విమర్శించారు. ఆస్తిలో వాటా ఇవ్వాల్సి వస్తుందని తల్లినీ, చెల్లినీ గెంటేసిన వారి వల్ల రాష్ట్రానికి, ముఖ్యంగా మహిళలకు ఒనగూరేదేమీ లేదన్నారు. ఆస్తి ఇవ్వనని కోర్టుకు పోయిన వ్యక్తికి మహిళలపై మాట్లాడే హక్కు ఎక్కడిదని ప్రశ్నించారు. రాజకీయాల్లో మనం ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. మనం ఆదర్శంగా ఉండి ప్రజలకు స్ఫూర్తిగా నిలవాలి. అమరావతి ఇవాళ బతికిందంటే రాజధాని మహిళలు చూపిన చొరవే కారణమన్నారు. మహిళలను చదువుల దిశగా ప్రోత్సహించేందుకు అనేక చర్యలు తీసుకున్నాం. స్పీకర్‌గా ప్రతిభా భారతికి అవకాశం ఇచ్చి మహిళలందరినీ గౌరవించాం. నేడు రాష్ట్రపతి, కేంద్ర ఆర్థికమంత్రి మహిళలే. మన ప్రభుత్వంలో ముగ్గురు మహిళా మంత్రులు ఉన్నారు. 175 ఎమ్మెల్యే స్థానాల్లో 21 మంది మహిళా ఎమ్మెల్యేలు ఉన్నారు. ఎన్టీఆర్ 8 శాతంతో మొదలుపెట్టిన మహిళా రిజర్వేషన్లను తాను 33 శాతానికి చేర్చాను. ఇటీవల మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ల బిల్లుకు ఆమోదం లభించింది. రిజర్వేషన్లు అమలైతే చట్టసభలో 75 మంది మహిళా ఎమ్మెల్యేలు ఉంటారని తెలిపారు.

**ఆడబిడ్డల జోలికొస్తే ఎక్కడున్నా వదలం**

మహిళా భద్రతకు 13 రకాల ఫీచర్స్‌తో శక్తి యాప్ తెచ్చామని ముఖ్యమంత్రి చెప్పారు. 164 శక్తి టీమ్స్ ఏర్పాటు చేశాం. డ్రగ్స్, గంజాయి లేని రాష్ట్రంగా ఏపీని తయారుచేస్తాం. మహిళా భద్రత, హక్కులు, గౌరవానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తాం. మారుమూల పల్లెల్లో ఉండే ఆడబిడ్డ పట్టణాలకు వచ్చి గౌరవంగా ఉద్యోగం చేసుకునేలా చేస్తాం. సోషల్ మీడియాలో ఇష్టానుసారం మాట్లాడితే ప్రపంచంలో ఎక్కడున్నా పట్టుకొచ్చి శిక్షిస్తామని హెచ్చరించారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తయారుచేసేందుకు 24 సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నాం. వ్యవసాయ, వ్యవసాయేతర ఉత్పత్తులపై డ్వాక్రా మహిళలకు శిక్షణ ఇవ్వడానికి ఒప్పందం జరిగినట్లు తెలిపారు. అలాగే పేదరిక నిర్మూలన, ఆర్థిక అసమానతలు తగ్గించేందుకు పీ4 తెస్తున్నాం. ఆర్థికంగా ఉన్నతిలో ఉన్న 10 శాతం మంది... కింద ఉన్న 20 శాతం మందిని దత్తత తీసుకుని అండగా నిలవాలి. ప్రతి ఎమ్మెల్యే తన నియోజకవర్గంలో ఒక వెయ్యిమంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తయారుచేయాలి. ఇది బాధ్యతగా తీసుకోవాలి. ప్రభుత్వం ఇచ్చే చేయూతను అందిపుచ్చుకుని డ్వాక్రా సభ్యులు ముందుకెళ్లాలి. సంపద, ఆరోగ్యం, ఆనందం లక్ష్యంగా ముందుకెళ్తున్నామని సీఎం చంద్రబాబు అన్నారు.

# రాష్ట్రాభివృద్ధికి హైదరాబాద్ తలమానికం

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్వహణ బాధ్యతలు కార్పొరేట్ సంస్థలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్వహణ బాధ్యతను ఒక్కో కార్పొరేట్ కంపెనీకి అప్పగిస్తామని పరిశ్రమల శాఖ అధికారులు డిప్యూటీ సీఎంకు వివరించారు. భారీ పరిశ్రమలకు ఇవ్వాల్సిన ప్రోత్సాకాలను దశలవారీగా విడుదల చేస్తామని డిప్యూటీ సీఎం ఈ సందర్భంగా వెల్లడించారు. మెగా లెదర్ పార్కులు, మినీ లెదర్ పార్కుల ప్రగతిని సమీక్షించారు. లెదర్ పార్కులకు కేటాయించిన స్థలాలు ఆక్రమణలకు గురి కాకుండా విలువైన స్థలాలను కాపాడాలని అధికారులను మంత్రులు ఆదేశించారు. మూడవ శ్రేణి పట్టణాలకు ఐటీ టవర్స్ విస్తరణ వేగవంతం చేయాలని అన్నారు. రాష్ట్రానికి హైదరాబాద్ తలమానికం అందుకు అనుగుణంగా మహానగరం అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసుకుని, ప్రగతిలో ఉన్న పనులను వేగంగా పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం అన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి ప్రతి ఏటా వలసలు పెరుగుతున్నాయని, అందుకు అనుగుణంగా రహదారులు, విద్యుత్, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించడంపై దృష్టి పెట్టాలని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో మున్సిపల్, పట్టణ అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చి ఆ మేరకు నిధులు కేటాయిస్తామని తెలిపారు. రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు చేపట్టాలని తెలిపారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తామని పేర్కొన్నారు. గ్రీన్ పవర్‌కు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని అన్నారు. సప్లై కాస్ట్ తగ్గించుకోవాలని, విద్యుత్ అంతరాయం లేకుండా చూసుకోవాలి, నిత్యం పర్యవేక్షణ చేయాలని అధికారులకు సూచించారు. విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అన్నారు. ఇంధన శాఖకు బడ్జెట్లో కేటాయింపులు ఉంటాయని చెప్పారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీలు రామకృష్ణారావు, జయేష్ రంజన్, మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్, ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ మార్ సుల్తాన్య, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్, పరిశ్రమల శాఖ అధికారులు విష్ణువర్ధన్ రెడ్డి, మెట్రో వాటర్ వర్క్స్ ఎండీ అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

# త్వరలో అఖిలపక్ష సమావేశం

**విశాలాంధ్ర - హైదరాబాద్:** క్యాబినెట్లో తీసుకున్న నిర్ణయం ప్రకారం నియోజక వర్గాల పునర్విభజనపై త్వరలో అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. జనాభా ప్రాతిపదికన చేపట్టబోయే నియోజకవర్గాల పునర్విభజనతో రాష్ట్రానికి ప్రమాదం పొంచి ఉంది. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా ఏర్పాటు చేస్తున్న ఈ సమావేశానికి అన్ని పార్టీలు హాజరుకావాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి సంయుక్తంగా బుధవారం బహిరంగ లేఖ విడుదల చేశారు. ప్రతి పార్టీని ప్రత్యేకంగా ఆహ్వానిస్తామని లేఖలో పేర్కొన్నారు. త్వరలోనే తేదీ, వేదిక ప్రకటిస్తామని స్పష్టం చేశారు.

# వాటాలు ఏవిధంగా తీసుకున్నారు?

(మొదటిపేజీ తరువాయి)

ఆయనకు సీఐడీ నోటీసులు జారీ చేశారు. ఈ మేరకు మాజీ ఎంపీ విచారణకు హాజరయ్యారు. విచారణ అనంతరం మీడియాతో విజయసాయిరెడ్డి మాట్లాడుతూ... కేవీరావు ఫిర్యాదులో పేర్కొన్న అంశాల ఆధారంగా సీఐడీ అధికారులు ప్రశ్నించారన్నారు. మొదటగా కేవీ రావు మీకు తెలుసా అంటూ ప్రశ్నించారని, ముఖ పరిచయం, అలాగే ఏదైనా సోషల్ ఫంక్షన్లలో నమస్కారం అంటే నమస్కారమని చెప్పడం మినహా... అతడికి, నాకూ ఏ విధమైన సామాజిక, ఆర్థిక, రాజకీయ సంబంధాలు లేవని చెప్పానన్నారు. అరబిందో సంస్థ నుంచి కేవీ రావుకు దాదాపు రూ.500 కోట్లు బదిలీ అయిన విషయంపై ప్రశ్నించారు. ఆ విషయం నాకు సంబంధం లేదని, అసలు నిధులు బదిలీ అయిన సంగతి తెలియదని వివరించానన్నారు. అరబిందో వ్యాపార విషయాల్లో నేనెప్పుడూ జోక్యం చేసుకోలేదని స్పష్టం చేశా. నా కుమార్తెను వారికివ్వడం తప్ప, అరబిందో సంస్థతో నాకు ఆర్థిక సంబంధాలు లేవని పునరుద్ఘాటించారు. విక్రాంత్‌రెడ్డి గురించి అడిగితే...వైవీ సుబ్బారెడ్డి కుమారుడిగా తెలుసని చెప్పానన్నారు. రూ.500 కోట్ల లావాదేవీలకు సంబంధించి విక్రాంత్ రెడ్డే చేశారని, చాలా మంది సాక్షులు చెప్పినట్లు సీఐడీ అధికారులు అడిగారని తెలిపారు. జగన్ మోహన్ రెడ్డిని కాపాడేందుకే మీరు, విక్రాంత్ రెడ్డి కలిసే నగదు బదిలీ చేశారా అని ప్రశ్నించారని, ఈ డీల్ విషయం జగన్‌కు తెలియదని చెప్పానని వివరించారు. దానికి నాకూ ఎలాంటి సంబంధం లేదని సీఐడీ అధికారులకు మరోసారి స్పష్టం చేశానని విజయసాయిరెడ్డి అన్నారు. నన్ను ఉద్దేశపూర్వకంగానే ఈ కేసులో ఇరికించారని, గతంలో ఏ-2గా ఉన్నా కాబట్టి ఈ కేసులోనూ ఏ-2గా చేర్చారన్నారు. కేవీ రావు ఆప్త మిత్రులతో మాట్లాడితే నా పేరు ఇరికించినట్లు చెప్పారని, రాజకీయ బ్రోకర్ కేవీ రావు, అతనంటే నాకు అసహ్యమని మండిపడ్డారు. లిక్కర్ స్కామ్‌లో కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి కీలకపాత్ర అని విజయసాయిరెడ్డి తెలిపారు.

**జగన్ మనస్సులో స్థానం లేకే దూరమయ్యా: విజయసాయిరెడ్డి**

వైసీపీకి రాజీనామా చేయడంపై విజయసాయిరెడ్డి తొలిసారిగా సంచల వ్యాఖ్యలు చేశారు. మాజీ సీఎం జగన్ చుట్టూ కోటరీ ఉందని, దానివల్లే నేను ఆయనకు దూరమయ్యాయని మీడియా ఎదుట స్పష్టంచేశారు. జగన్‌కు, నాకూ మధ్య ద్వితీయ శ్రేణి నాయకులు గ్యాప్ తెచ్చారని, మూడున్నరేళ్లపాటు అవమానాలకు గురయ్యాయని అన్నారు. నేను దిగిన ప్రతి మెట్టూ ఇంకొకరు పైకి ఎక్కడానికి ఉపయోగపడిందన్నారు. చాలా మంది సూత్రధారులు, పాత్రధారులు ఉన్నారని, వైసీపీ నుంచి వెళ్లిపోయినందుకుగాను తాను ఏ మాత్రం నష్టపోలేదని తెలిపారు. పార్టీ కోసం చిత్తశుద్ధితో పనిచేశానని, ఇప్పటికీ జగన్ బాగుండాలని ఆకాంక్షించారు. జగన్ మనసులో నాకు స్థానం లేదని తెలిసి...నా మనస్సు విరిగిందని, అందుకే పార్టీ నుంచి వెళ్లిపోతున్నానని జగన్‌కు చెప్పాన్నట్లు గుర్తుచేశారు. ఇప్పటికైనా కోటరీ నుంచి జగన్ బయటపడాలని, భవిష్యత్‌లోను ప్రజలకు జగన్ సేవ చేయాలని, అప్పుడే జగన్‌కు భవిష్యత్ ఉంటుందని సూచించారు. కొందరు నేతలు జగన్ చుట్టూ కోటరీగా ఏర్పడ్డారని, జగన్‌ను ఎవరికైనా పరిచయం చేయాలంటే ఈ కోటరీకి లాభం చేకూర్చాల్సి ఉంటుందన్నారు. ఆ చుట్టూ ఉన్న వాళ్ల మాటలు వినవద్దని, మీకు నిజాలు, అబద్ధాలు ఎవరు చెబుతున్నారో పూర్తిగా అర్థం చేసుకుని నిర్ణయం తీసుకోవాలని సూచించారు. నాయకుడు చెప్పుడు మాటలు వినకూడదని, వాటిని నమ్మితే నాయకుడు, పార్టీ, ప్రజలు నష్టపోతారని చెప్పారు. తాను తిరిగి వైసీపీలోకి వచ్చే అవకాశంగానీ, ఏ పార్టీలోనూ చేరే ఉద్దేశ్యం లేదని స్పష్టంచేశారు. ఘర్ వాపసీ నాకు అప్లయ్ కాదని, నేను ఇప్పుడు వ్యవసాయం చేసుకుంటున్నానని అన్నారు.

# ఉపరాష్ట్రపతి డిశ్చార్జ్

**న్యూదిల్లీ:** అకస్మాత్తుగా ఛాతీలో నొప్పి రావడంతో ఎయిమ్స్‌లో చేరి చికిత్స పొందుతున్న ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ (73) బుధవారం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. గుండె సంబంధిత సమస్యల కారణంగా ఈ నెల తొమ్మిదో తేదీన ఎయిమ్స్‌లో చేరిన ఆయన యాంజియోప్లాస్టీ చికిత్స తర్వాత స్పెషలిస్ట్ కార్డియాలజిస్టుల పర్యవేక్షణలో ఉన్నారు. ఎయిమ్స్ వివరాల ప్రకారం... ఉపరాష్ట్రపతి ఆరోగ్యం మెరుగుపడినట్లు తెలుస్తోంది. ఆయన ఆరోగ్యాన్ని నిశితంగా పరిశీలించిన అనంతరం మరికొన్ని రోజులు తగినంత విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. చికిత్స తర్వాత నాలుగు రోజుల ఆసుపత్రిలోనే ఉన్నారు. ముందు జాగ్రత్త చర్యగా కొద్ది రోజులు తగినంత విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు ఉపరాష్ట్రపతికి సూచించారు. ధన్కర్ ... ఆగస్టు 11, 2022న 14వ ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు స్వీకరించారు. జూలై 18, 1951న రాజస్థాన్‌లోని హనుమాన్‌గఢ్ జిల్లా కాలిబంగాలో జన్మించారు. బీజేపీతో అనుబంధం కలిగి ఉన్నారు. ఉపరాష్ట్రపతి కావడానికి ముందు ఆయన పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా పదవీ బాధ్యతలు నిర్వహించారు. పంజాబ్ విశ్వవిద్యాలయంలో న్యాయ పట్టా పొందిన ధన్కర్ అనుభవజ్ఞుడైన న్యాయవాది, సామాజిక కార్యకర్త. అనేక సంవత్సరాలు పార్లమెంటు సభ్యుడిగా కూడా పనిచేశారు.

# ఒత్తిడిలో 52 శాతం ఉద్యోగులు

(మొదటిపేజీ తరువాయి)

ఇండీడ్ తెలిపింది. 2025లో కెరీర్‌లో రాణించడం కంటే భార్యాపిల్లలు, తల్లిదండ్రులతో గడపడానికే అధిక ప్రాధాన్యమిస్తామని పేర్కొన్నారు. తక్కువ పని ఒత్తిడి ఉండేలా చూసుకోవడంతో పాటు మానసిక ఆరోగ్యంపైనా దృష్టి పెట్టాలనుకుంటున్నట్లు ఉద్యోగులు తెలిపారు. భారతీయ ఉద్యోగుల్లో పని, వ్యక్తిగత జీవితానికి మధ్య సమతూకం కోరుకునే వారి సంఖ్య పెరుగుతోందని ఇండీడ్ మార్కెటింగ్ డైరెక్టర్ రాచెల్ టౌన్స్‌లీ పేర్కొన్నారు. ఎక్కువ సంపాదించడం ముఖ్యమే అయినా అదే జీవితం కాదని చాలామంది భావిస్తున్నట్లు చెప్పారు. భద్రత, పనికి సరైన వేతనం, ఇతర ప్రయోజనాలు వంటివి చూస్తున్నారని తెలిపారు.

# 24 గంటలే గడువు

(మొదటిపేజీ తరువాయి)

విడుదల చేయకపోతే బందీలందరినీ చంపేస్తామని, రైలును ధ్వంసం చేస్తామని బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ హెచ్చరించింది. సొంత సైనికులకు రక్షణ కల్పించే చిత్తశుద్ధి పాకిస్థాన్‌కు లేదని దుయ్యబట్టింది. సంప్రదింపులకు సమయం మించిపోతోందని, గడువులోగా చెప్పింది చేయాలని బీఎల్ఏ బెదిరించింది.

**చైనా ఖండన:** జాఫర్ ఎక్స్‌ప్రెస్ రైలు హైజాక్ ఘటనను చైనా తీవ్రంగా ఖండించింది. ఉగ్రవాదాన్ని ఉపేక్షించేది లేదని తేల్చిచెప్పింది. ఇస్లామాబాద్‌తో కలిసి ఉగ్రవాద వ్యతిరేక చర్యలను తీవ్రతరం చేసేందుకు చైనా కట్టుబడి ఉన్నట్లు ఆ దేశ విదేశాంగ శాఖ ప్రతినిధి మావో నింగ్ ఒక ప్రకటన చేశారు.

# ఎల్‌జీపై కేసులు వెనక్కి

(మొదటిపేజీ తరువాయి)

కుదరలేదు. విభేదాలతో న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దిల్లీ విద్యుత్ నియంత్రణ కమిషన్ చైర్మన్, దిల్లీ జల బోర్డు నిధులు, అల్లర్ల కేసులో న్యాయవాదుల నియామకం, విదేశాల్లో ఉపాధ్యాయ శిక్షణ, యమునా నది కాలుష్యంపై ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు తదితర విషయాల్లో గవర్నర్లు, ప్రభుత్వం మధ్య వివాదాలు తలెత్తాయి. గవర్నర్ ప్రభుత్వ కార్యక్రమాలకు ఉద్దేశపూర్వకంగా ఆటంకం కలిగిస్తున్నారని నాడు సీఎంగా ఉన్న అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. వారికి వ్యతిరేకంగా ఫిర్యాదులు చేశారు. ఆతిశీ హయాంలోనూ ఇదే జరిగింది. ఆప్ ప్రభుత్వం తమకు సహకరించడం లేదని గవర్నర్లు ఆరోపించిన సందర్భాలు ఉన్నాయి. దీంతో గవర్నర్లకు వ్యతిరేకంగా కేసులు నమోదయ్యాయి. వారికి వ్యతిరేకంగా ఉన్న కేసులు, న్యాయపరమైన ఆటంకాలు తొలగించాలని బీజేపీ ప్రభుత్వం యోచిస్తోంది. కేసులు ఉపసంహరించేందుకు సిద్ధమవుతున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి.

# పోసానికి హైకోర్టులో చుక్కెదురు

(మొదటిపేజీ తరువాయి)

వేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. అదే సమయంలో కర్నూలు జిల్లా జైలు నుంచి పోసానిని గుంటూరుకు సీఐడీ అధికారులు తరలిస్తున్నారు. కర్నూలు జిల్లా ఆదోనిలో నమోదైన కేసులో పోసానికి మంగళవారం మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. పోసానిపై నమోదైన కేసుల్లో బెయిల్ లభించడంతో ఇక జైలు నుంచి విడుదల కావడమే అన్న తరుణంలో సీఐడీ పోలీసులు పిటీ వారెంట్‌తో అదుపులోకి తీసుకోవడంతో విడుదలకు బ్రేక్ పడింది. పోసానిపై రాష్ట్ర వ్యాప్తంగా 17 కేసులు నమోదు కాగా, నాలుగు కేసుల్లో అరెస్టు చేశారు. తాజాగా బాపట్లలో మరో కేసు నమోదైంది.

## సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి : కలెక్టర్

**విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో :** మండల కేంద్రంలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు సాగితే అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని, గ్రామాలలో సమస్యలు ఉంటే వాటి పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. బుధవారం వాజేడు మండల కేంద్రంలో ఐటీడీఏ పీవో చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్లు మహేందర్ జి, సంపత్‌రావులతో కలిసి మండల స్థాయి అధికారుల సమీక్ష సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ ఫలాలను నిజమైన అర్హులను గుర్తించి అందజేయడానికి చోరువ చూపాలని, మండల కేంద్రాలలోని ఎంపీడీవో, ఎంపీవో కీలకపాత్ర పోషించాలని అన్నారు. వేసవికాలంలో గ్రామాలలో మంచినీటి ఎద్దడి ఏర్పడకుండా స్థానికంగా ఉన్న నీటి వనరులను వినియోగించుకోవాలని, అవసరమైన పక్షంలో వ్యవసాయ బోర్లను అద్దెకు తీసుకొని మంచినీటి సమస్యను పరిష్కరించాలని సూచించారు. మండలంలో మొక్కజొన్న పంట వేసి నష్టపోయిన రైతుల వివరాలను ఇప్పటికే సేకరించడం జరిగిందని, నష్టపోయిన రైతులకు ఆయా విత్తన కంపెనీల ద్వారా నష్టపరిహారం అందించే విధంగా చర్యలు తీసుకున్నామని వివరించారు. నష్టపోయిన రైతుల వివరాలను మండల వ్యవసాయ కార్యాలయంలో రెవెన్యూ కార్యాలయంలో సూచిక బోర్లపై పేర్లను ఏర్పాటు చేయడం జరిగిందని, నష్టపోయిన రైతు పేరు లేని పక్షంలో గురువారం లోగా పేరు నమోదు చేయించుకోవాలన్నారు. అనంతరం ప్రజల నుండి విజ్ఞప్తులను స్వీకరించారు. జిల్లాస్థాయి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ఎక్స్పైరీ మందులు లేకుండా చూసుకోవాలి

**విశాలాంధ్ర- జిల్లా బ్యూరో మహబూబాబాద్ :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేస్తున్న ఫార్మసిస్టులు మందులు ఎక్స్పైరి లేకుండా చూసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మురళీధర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఐఎంఏ సమావేశ మందిరంలో జిల్లాలో పనిచేస్తున్న ఫార్మసిస్టులందరికీ, మందుల పంపిణీ, అవగాహన కార్యక్రమములో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ జి మురళీధర్ మాట్లాడుతూ, మందులు ఎక్స్పైరీ కాకుండా చూసుకోవాలని, మందుల ఇండెంట్, మూడు నెలల ముందుగానే సెంట్రల్ డ్రగ్ స్టోర్స్‌కి లెటర్ పెట్టాలని, మందుల డోసుల వివరాలను, ఆరోగ్య కార్యకర్తలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఎనీమియా ఉన్న గర్భిణీ స్త్రీలకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ టాబ్లెట్లను పంపిణీ చేయాలని తెలిపారు. ఆరు నెలల నుండి 59 నెలల పిల్లలకు ఐఎఫ్ఏ సిరప్, ఐదు సంవత్సరాల నుండి 9 సంవత్సరాల పిల్లలకు ఐఎఫ్ఏ పింక్ కలర్ టాబ్లెట్లని, అదేవిధంగా 10 సంవత్సరాల నుండి 19 సంవత్సరాల పిల్లలకు ఐఎఫ్ఏ నీలం రంగు టాబ్లెట్స్‌ని ఏడాది పొడవునా అందుబాటులో ఉంచుకోవాలన్నారు. మెటర్నల్ చైల్డ్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సారంగం, హెల్త్ ఎడ్యుకేటర్ కె.వి.రాజు, శిక్షకులు ఇన్చార్జి డిపిహెచ్ఎన్ఓ మంగమ్మ, ఫార్మసిస్ట్ రామారావు, సబ్ యూనిట్ ఆఫీసర్ రామకృష్ణ, డి.ఈ.ఓ అరుణ్, జిల్లాలోని ఫార్మసిస్టులు పాల్గొన్నారు.

## కుల గణన చేపట్టడం చారిత్రాత్మకం

**విశాలాంధ్ర బ్యూరో - పెద్దపల్లి :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కుల గణన చేపట్టడం చారిత్రాత్మకమని విశ్వబ్రాహ్మణ-విశ్వకర్మ ఐక్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోజు భిక్షపతి అన్నారు.మంగళవారం పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు భిక్షపతి మాట్లాడుతూ 'మేము ఎంతో మాకు అంతా' అనే నినాదంతో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ముఖ్యమంత్రి నిర్ణయించడం హర్షణీయమన్నారు. గత నాలుగు రోజుల క్రితం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. టీపీసీసీ అధ్యక్షుడు సానుకూలంగా స్పందించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారని చెప్పారు. జిల్లా అధ్యక్షుడు భీమోజు సురేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెల్లోజు రాజు, జిల్లా గౌరవ అధ్యక్షులు ముల్కల గోవర్ధన్ శాస్త్రి,జిల్లా ప్రధాన కార్యదర్శి రామగిరి రాజమౌళి, వరంగల్ జిల్లా అధ్యక్షుడు శృంగారపు వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు నాగులమల్యాల ప్రసాద్, అబ్బోజు కోటయ్య, నూతి రవిందర్ చారీ, గర్రెపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రబీ సాగుకు నీరందేలా చర్యలు తీసుకోవాలి : కలెక్టర్

**విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో :** ఎట్టి పరిస్థితులలో సాగునీరు వృధా కాకుండా, రబి సాగులో ఉన్న పంటలన్నింటికీ నీరందే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. బుధవారం ఆమె నల్గొండ జిల్లా, పెద్దవూర మండలం, కుంకుడు చెట్టు తండా వద్ద ఏ ఎంఆర్పి కింది డి- 8, 9 కాలువలను పరిశీలించారు. ఎక్కడా పంటలకు ఇబ్బంది కలగకుండా, ముఖ్యంగా పంటలు ఎండిపోకుండా ఎప్పటికప్పుడు సాగునీటిని అందించాలని ఇరిగేషన్ అధికారులతో పాటు, రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆమె ఆదేశాలు జారీ చేశారు. ఎక్కడైనా సాగునీరు వృధా అవుతున్నట్లయితే వెంటనే నియంత్రించాలని, అవసరమున్న చోట సాగునీరు అందించాలని చెప్పారు. కాగా డి 8,9 ద్వారా సుమారు 36 కిలోమీటర్ల పరిధి ఉండగా, 27వ కిలోమీటర్ల వరకు సాగునీరు ఎలా వస్తున్నదో కలెక్టర్ తిరిగి పరిశీలించారు. ఆయకట్టు చివరి భూములకు నీరు వెళుతున్న క్రమాన్ని ఆమె పరిశీలించడమే కాకుండా, రైతులతో ముఖాముఖి మాట్లాడారు. అయితే రానున్న 20, 25 రోజులు సాగునీటిని క్రమబద్ధీకరిస్తూ అందించినట్లయితే రైతుల పంటలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా బయట పడతారని, ఈ విషయంపై ఇంజనీరింగ్ అధికారులు దృష్టి సారించాలన్నారు. జిల్లా కలెక్టర్ వెంట స్పెషల్ ఆఫీసర్ గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ యాదన్ కుమార్, వ్యవసాయ అధికారి, ఇంజనీరింగ్, తదితర అధికారులు ఉన్నారు.

## ఎస్సీ మాదిగలకు 11 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

**విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో :** ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తూ, ఎస్సీ మాదిగ కులస్తుకు, 11 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని, యంఆర్పిఎస్ రాష్ట్ర నాయకులు వావిలాల స్వామి మాదిగ, రాష్ట్ర ప్రభుత్వాని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ వెంటనే అమలు చేసి, గ్రూప్ 1, 2 గ్రూప్ పోస్టులను భర్తీ చేయకుండా నిల్పి వేయాలని, కోరుతూ, అంబేద్కర్ విగ్రహం వద్ద, యంఆర్‌పిఎస్, యంఎస్‌పి, విహెచ్పిఎస్, అనుబంధ సంఘల అద్వరంలో నిరాహార దిక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, తదితరులు మాట్లాడారు. ఈ నిరాహార దిక్షలో రాజకీయ నాయకులు, కుల సంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

దేశంలోనే ఇంకుడు గుంతల నిర్మాణాల్లో

# జిల్లా అగ్రస్థానంలో ఉండాలి: కలెక్టర్

**విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్:** జలాలను పొదుపు చేసి భూగర్భ జల స్థిర శాతాన్ని మెరుగు చేయాల్సిన బాధ్యత అతనిపై ఉందని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ కోరారు. సంచయ్ జన్ భగీదారి క్యాచ్ ద రైన్ అమలులో భాగంగా దేశంలోనే జిల్లాను అగ్రస్థానంలో నిలపటమే లక్ష్యం ముందుకు సాగాలన్నారు. బుధవారం కొత్తగూడెం హమాలీ కాలనీలో జల సంచయ్ జన్ భాగీ దారి అమలులో భాగంగా కలెక్టర్ స్వయంగా ఇంకుడు గుంతలను అధికారులతో కలిసి తవ్వారు. నిర్మాణానికి ఎంత సమయం పడుతుంది, ఎలా నిర్మించాలి అని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్థానికంగా ఉన్న యువకులతో మమేకమై వారితో కలిసి ఇంకుడు గుంటల నిర్మాణాన్ని కలెక్టర్ చేపట్టడం అందరిని అశ్చర్య పరిచింది. ఈ సందర్భంగా ఆయన భూగర్భ జలాలను అభివృద్ధి పరచడానికి ఇంకుడు గుంతల ఆవశ్యకతను యువకులకు వివరించారు. సామాన్య పరిధి ఇంకుడు గుంత తవ్వకానికి గంటన్నర సమయం మాత్రమే పట్టిందన్నారు. ఈ మిషన్లో యువకులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని కోరారు. భవిష్యత్తు కాలంలో నీటి ఎద్దడి లేకుండా ప్రతి నీటి బొట్టు వృధా కాకుండా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విద్యా చందన, ఎంపీడీవో, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## గార్ల కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులుగా నరసయ్య

**విశాలాంధ్ర - గార్ల :** కాంగ్రెస్ పార్టీ గార్ల పట్టణ అధ్యక్షులుగా స్థానిక నాయకులు పల్లా నరసయ్య నియమితులయ్యారు. ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యులు కోరం కనకయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు భరత్ చంద్ర రెడ్డి తమ క్యాంపు కార్యాలయాల్లో ఆయన నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరసయ్య మాట్లాడుతూ తలపై నమ్మకంతో పార్టీ మండల బాధ్యతలు ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యే కోరం కనకయ్య, గార్ల సొసైటీ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, గుండా వెంకట్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్యా నాగేశ్వరావు, సొసైటీ డైరెక్టర్ శీలంశెట్టి ప్రవీణ్ కుమార్, ఎం.డి మోహిన్, కత్తుల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## అఖిలపక్షం ధర్నా విజయవంతం

### దిగొచ్చిన టోల్ గేట్ యాజమాన్యం

**విశాలాంధ్ర - నేరేడుచర్ల :** గత నెల రోజులుగా నేరేడుచర్ల మండల ఫోర్ వీలర్ యాజమాన్యా లను ఇబ్బందుల గురిచేస్తున్న చిల్లేపల్లి టోల్ గేట్ యాజమాన్యం బుధవారం నిర్వహించిన అఖిలపక్ష ధర్నాతో దిగివచ్చి నేరేడుచర్ల పట్టణ ఫోర్ వీలర్ యాజమాన్యులకు టోల్ గేట్ రుసుము నుండి మినహాయింపు ఇస్తానని హామీ ఇచ్చింది. దీంతో సమ్మె విరమింపచేశారు. నేరేడుచర్ల పట్టణ అఖిలపక్ష నాయకులు టోల్ గేట్ యాజమాన్య నిర్లక్ష్య వైఖరికి నిరసనగా నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి గ్రామంలో గల వ్యవసాయ చెక్ పోస్ట్ సమీపంలో ఆర్ అండ్ బి రోడ్డుపై బుధవారం ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ టోల్ గేట్ పరిధిలోని 20 కిలోమీటర్ల పరిధిలో గల ఫోర్ వీలర్స్ యాజమాన్యులకు టోల్ గేట్ ఫీజు నుండి విముక్తి కలిగించాలని కోరుతూ ధర్నా నిర్వహించి నిరసన ర్యాలీ చేపట్టారు. దాదాపు 5 కిలోమీటర్ల పరిధిలో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. స్పందించిన పోలీసులు అఖిలపక్ష నాయకులతో చర్చలు జరిపారు. టోల్ ఫీజు నుండి విముక్తి కల్పించే వరకు ధర్నా ఆపేది లేదని అఖిలపక్ష నాయకులు తెగేసి చెప్పారు. దీంతో టోల్ గేట్ యాజమాన్యం దిగివచ్చి నేరేడుచర్ల పట్టణ ఫోర్ వీలర్ వాహనదారులకు టోల్ గేట్ ఫీజు నుండి విముక్తి కల్పిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. వారు ఇచ్చిన హామీతో అఖిలపక్ష నాయకులు ధర్నాను విరమించారు. గురువారం నుండి నేరేడుచర్ల పట్టణ ఫోర్ వీలర్ యాజమాన్యులు ఆధార్ కార్డుతో పాటు ఫోర్ వీలర్ ఆర్సీబుక్కు తీసుకొని వచ్చి టోల్‌గేట్ కంప్యూటర్ వద్ద నమోదు చేయించుకోవాలని కోరారు. ఈ ధర్నా కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ బిజెపి, సిపిఐ, జనసేన తదితర పార్టీ నాయకులు కొనతం చిన్న వెంకటరెడ్డి, బచ్చలకూరి ప్రకాష్, దొండపాటి అప్పి రెడ్డి, ధనుంజయ నాయుడు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి దృష్టికి కిష్టారం సమస్య

**విశాలాంధ్ర - సత్తుపల్లి :** శైలో బంకర్ కారణంగా వాయు కాలుష్యంతో తీవ్ర అనారోగ్యం పాలవుతున్న కిష్టారం గ్రామ ప్రజల సమస్యలను కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లినట్లు మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నాయకుడు పొంగులేటి సుధాకర్ రెడ్డి తెలిపారు. కిష్టారం గ్రామ ప్రజలు చేస్తున్న అభ్యర్థనను రాష్ట్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టిన కారణంగా బొగ్గు లోడింగ్‌ను అడ్డుకుని రైళ్లను నిలిపివేయడం ద్వారా ఏర్పడ్డ ఉద్రిక్త పరిస్థితుల గురించి భాజపా నాయకుడు డా. పొంగులేటి సుధాకర్ రెడ్డి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డికి వివరించారు. ఈ అంశంపై కిషన్ రెడ్డి వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడతానని హామీ ఇచ్చినట్టు తెలిపారు. సింగరేణి యాజమాన్యం పర్యావరణం పునరావాస అంశాలపై తగు చర్యలు తీసుకునేలా కృషిచేస్తానన్నారని తెలిపారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా తగు చర్యలు తీసుకోవాలని సుధాకర్ రెడ్డి అన్నారు.

## విరబూసిన మోదుగు చెట్టు...



**విశాలాంధ్ర - కారేపల్లి :** ఖమ్మం జిల్లా కారేపల్లి మండలంలో గల శివారు గ్రామాలలో ప్రకృతి అందాలు చూపరులను కట్టిపడేస్తున్నాయి. వేసవికాలం కావడంతో ఆకులు రాలిన చెట్లతో పలు ప్రాంతాలలో మోడుబారిపోయింది. ఓ రకమైన చెట్లు మాత్రం ఆకులు రాలినా ఎరుపు, కాషాయ రంగుల పూలతో ఆ ప్రాంతానికి అందాలు తెస్తున్నాయి. కారేపల్లి మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులకు ఇరువైపులా ఉన్న మోదుగు చెట్లకు పూసిన పువ్వులు ప్రయాణికులకు కనువిందు చేస్తూ ఆకర్షిస్తున్నాయి. అగ్ని జ్వాలల వలే ఎర్రని ఈ మోదుగుపూలు సూర్యకాంతికి ధగ ధగా మెరిసిపోతూ ఉన్నాయి. రోడ్లకు ఇరువైపులా ఎర్రని పూలతో ఉన్న మోదుగు చెట్లు వాహనదారులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. శివరాత్రి, హోలీ పండుగలకు ఈ పూలు అత్యంత ప్రాధాన్యం. ఈ మోదుగుపూలను గోగు పూలు, అగ్గిపూలు, ఎర్రని పూలుగా గ్రామాలలో పిలుస్తుంటారు. గ్రామీణ ప్రాంతాలలో హోలీ పండుగకు పిల్లలు మోదుగు పువ్వులు సేకరించి ఉడకబెట్టి రంగు తయారు చేస్తారు. మోదుగు ఆకులతో విస్తరాకులు తయారు చేస్తారు. చెట్టు వేర్ల దాని నారను తొలిచి తాళ్లు వివిధ వస్తువులను తయారు చేస్తారు. మోదుగు పసరును ఆయుర్వేద మందుల తయారీలో కూడా ఉపయోగిస్తారు. ఈ మోదుగ పూలు జనవరి నెల ప్రారంభం నుండి ఏప్రిల్ నెల ఆఖరి వరకు దొరుకుతాయి. ప్రస్తుతం మార్కెట్లో దొరికే రసాయన రంగులతో చర్మ సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. అలాగే కళ్ళు, చెవులు, ముక్కుకి సంబంధించిన అనేక రకాల ఇబ్బందులు తలెత్తే అవకాశాలు ఉన్నాయని చర్మ వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

## నకిలీ విత్తనాలు సరఫరా చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి : జీఎస్పీ

**విశాలాంధ్ర - చర్ల :** నకిలీ మొక్కజొన్న బ్రాండ్ పేరుతో విత్తనాలతో మోసపోయిన రైతులకు నష్టపరహారం ఇవ్వాలని ఇతర వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని గోండ్వాన సంక్షేమ పరిషత్తు రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ డిమాండ్ చేశారు. చర్ల మండలంలో బుధవారం జీఎస్పీ బృందం బృందం తిప్పాపురం, రాళ్లపురం, చిన్న మిసిలేరు, గీసరెల్లి, శనమల, ఉయ్యాలమడుగు, కొత్తూరు గ్రామాల్లో నష్టపోయిన రైతులతో మాట్లాడారు. అనంతరం సత్యనారాయణ మాట్లాడుతూ ఏజెన్సీ లో పుట్టగొడుగుల్లా ఎలాంటి అనుమతులు లేకుండా నకిలీ విత్తనాల షాపులు ఏర్పాటు చేసుకొని ఆదివాసుల అమాయకత్వాన్ని ఆసరా చేసు కొని దోపిడీ చేస్తూ నష్టం చేస్తున్నారని ఆరోపించారు. బ్రాండ్ పేరుతో మొక్కజొన్న విత్తనాలు అమ్మి అడవి ప్రాంత ఆదివాసులకు ఎకరానికి మూడు టన్నులు దిగుమతి వస్తుందని మాయమాటలు చెప్పి అమ్మకాలు చేసినట్లు తెలిపారు. టన్ను రూ. 36 వేలు ఉంటుందని అబద్ధపు ప్రచా రం చేసి నకిలీలను అంట కట్టిన వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేసారు. మోసం చేసిన వ్యాపారులపై వ్యవసాయ శాఖ అధికారులు తక్షణమే విచారించి కఠిన చర్యలు తీసుకోవాలని, డీలర్, ఏజెంట్ నిర్వహణ చేస్తున్న షాపులను సీజ్ క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. గోండ్వానా సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివాసుల ఐక్యం చేసి న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు. చర్ల మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పూనం వరప్రసాద్, రైతులు జీవనవాసం, కన్నారావు, రాజశేఖర్, శ్యామల, లక్ష్మణరావు, శేఖరు, శ్రీను, నాగేశ్వరరావు, వెంకటేష్, సర్వేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

## ఎల్ఆర్ఎస్ ఫీజు వసూలుకు పటిష్ట కార్యాచరణ : కలెక్టర్

**విశాలాంధ్ర బ్యూరో - పెద్దపల్లి:** పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ పట్టణంలో మార్చి 31 లోపు ఎల్ఆర్ఎస్ ఫీజు వసూలు పూర్తి చేసేలా పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సుల్తానాబాద్ పట్టణంలో విస్తృతంగా పర్యటించారు.పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ పట్టణంలో మున్సిపల్ కార్యాలయం, ప్రభుత్వ ఆసుపత్రి, జిల్లా పరిషత్ హై స్కూల్, ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలోని ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, సుల్తానాబాద్ పట్టణంలో 1036 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను నిబంధనల ప్రకారం ఆమోదించడం జరిగిందని, వీరిని ఫాలో అప్ చేస్తూ మార్చి 31 లోగా ఫీజు చెల్లించేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. మార్చి 31 లోపు పూర్తి స్థాయిలో ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించినట్లయితే 25% రీబెట్ లభిస్తుందని అన్నారు. సుల్తానాబాద్ మండల హెడ్ క్వార్టర్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్ అక్కడ విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. జడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో జరుగుతున్న అదనపు తరగతుల నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించి వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో అందిస్తున్న సేవలను కలెక్టర్ పరిశీలించారు. జిల్లా కలెక్టర్ వెంట సుల్తానాబాద్ మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ నియాజ్, మండల విద్యాశాఖ అధికారి రాజయ్య, హెడ్మాస్టర్ శారద, ఆర్.ఎం.ఓ డాక్టర్ మహేందర్, వైద్యాధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## బాధితులకు అండగా భరోసా

**విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో :** తెలంగాణ ప్రభుత్వం పోలీస్ మహిళా భద్రతా విభాగంలో భాగంగా మహిళలలో ఆత్మవిశ్వసాన్ని పెంపొంధించేందుకు భరోసా సెంటర్ లను ఏర్పాటు చేశారు. మహిళలు, పిల్లలూ, వృద్ధులు వారు ఎదుర్కుంటు న్న లైంగిక అత్యాచారహింసలు వంటి వేధింపులకు గురవుతున్న వారికి సహాయాన్ని అందించడమే లక్ష్యంగా పెట్టుకొని భాదితులకు వన్ స్టాప్ సొల్యూషన్‌గా పనిచేస్తున్నాయి. మహిళలు సమాజంలో ఎదుర్కొంటున్న సమస్యలపై వారికి కౌన్సిలింగ్ నిర్వహించి వారీలో భరోసా కల్పించే దిశగా ములుగులో ఏర్పాటు చేసిన ఈ భరోసా కేంద్రం విజయవంతంగా పనిచేస్తుంది. సంబంధిత కేసులను త్వరగా సమర్థవంతంగా నిర్వహిం చేలా ఒకే పైకప్పు కింద వివిధ సేవలను అందించడంతో పాటు మానసిక చికిత్స, కౌన్సిలింగ్, మెడికల్, లీగల్, ప్రాసిక్యూషన్ సేవలు భరోసా కేంద్రం అందిస్తుంది. ఇటీవల వెంకటాపూర్ (ములుగు) పోలీస్‌స్టేషన్ పరిధిలో, మంగపేట వెంకటాపురమ్ (వాజేడు) పోలీస్‌స్టేషన్‌ల పరిధిలలో జరిగినటువంటి వివిధ సంఘటనలలో భాదితులకు భరోసా అసిస్టెంట్ ఫండ్ నుండి ములుగుజిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ డా. శబరీష్, ఆదేశాల మేరకు, డి.ఎస్.పి డిసిఆర్బి కిషోర్ కుమార్ సూచనల మేరకు భరోసా ఇంచార్జ్ ఎస్ఐ యం.స్రవంతి సెంటర్ కో ఆర్డినేటర్, భరోసా సిబ్బంది భాదితులకి ఆర్థిక సహాయం అంధించడం జరిగింది. ఈ సందర్భంగా భరోసా సెంటర్ ఇంచార్జ్ ఎస్ఐయం. స్రవంతి మాట్లాడుతూ ములుగు జిల్లా నంద భరోసా సిబ్బంది వివిధ అవగాహన సదస్సులు, హోమ్ విసిట్స్ (భాదితుల) నిర్వహిస్తున్నారు అని తెలయజేయడం జరిగిందన్నారు.

## సామాన్య ప్రజలను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు : ఎస్పీ

**విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్:** సామాన్య ప్రజలను ఇబ్బందులు గురి చేసే వారిని ఎట్టి పరిస్థితుల్లో వదలకుండా శిక్షించాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పోలీసులను ఆదేశించారు. బుధవారం ఆయన జిల్లాలోని పోలీసు అధికారులతో నేర సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. ముందుగా గత నెలలో వర్టికల్స్ వారీగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ ప్రశంసా పత్రాలను అందజేశారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో అధికంగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి అక్కడ నివారణా చర్యలను చేపట్టాలన్నారు. సూచించారు. పోలీస్ స్టేషన్లలో నమోదైన పెండింగ్లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసుల సత్వర పరిష్కారం చేయాలని ఆదేశించారు. పోక్సో, గంజాయి అక్రమ రవాణా, మట్కా క్రికెట్ బెట్టింగులు లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ వాహనాలతో నిత్యం రోడ్లపై సంచరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, డిఎస్పీ లు చంద్రభాను, రెహమాన్, రవీందర్ రెడ్డి, సతీష్ కుమార్, డీసిఆర్బీ డిఎస్పీ మల్లయ్య స్వామీ, డీసిఆర్బీ సీఐ శ్రీనివాస్, సిసిఎస్ ఇన్స్పెక్టర్ రమాకాంత్, ఐటీ సెల్ సీఐ నాగరాజు రెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వెంగళరావు ప్రాజెక్టు అలుగు తెగిపోవడం బాధాకరం

**విశాలాంధ్ర బ్యూరో-కొత్తగూడెం :** కొత్తగూడెం జిల్లాలోని చాలా ప్రాముఖ్యత కలిగిన, దివంగత ముఖ్యమంత్రి జలగం వెంగళరావు సీతాయిగూడెం గిరిజన గ్రామంలో నిర్మించిన వెంగళరాయ సాగునీటి ప్రాజెక్టును మాజీ మంత్రి జలగం ప్రసాద్‌రావు బుధవారం సందర్శించారు. చంద్రుగొండ మండలంలో ఉన్న ఈ ప్రాజెక్ట్‌కు గడచిన వర్షాకాలంలో భారీ ఎత్తున గడ్డిపండింది. దీంతో వందనాలు ఎకరాలకు వీళ్ల లేక ఆయకట్టు రైతాంగం ఈ ఏడాది చాలా నష్టపోయింది. తన తండ్రి వెంగలరావు సుమారు 45 ఏళ్ల క్రితం చాలా తక్కువ బడ్జెట్‌తో ఎక్కువ సాగుకు ఉపయోగపడే విధంగా నిర్మించిన ఈ ప్రాజెక్టుకు జిల్లాలోని ప్రత్యేకత వుంది. గండి పడి నీళ్లు అందక రైతులు నేతపోయిన విషయంపై తనకు చాలా అనుబంధమున్న ఈ ప్రాంతాన్ని జలగం ప్రసాద్ ప్రాజెక్టు పరిశీలనకు రావడంతో స్థానిక నాయకులు కూడా ఆయనతో పాల్గొన్నారు. సీతాగూడెం గ్రామ శివారులోని అలుగు తెగిన ఈ ప్రాజెక్ట్ పరిస్థితి కళ్లారా చూసి జలగం ఆవేదన వ్యక్తం చేశారు. తెగిన అలుగును వెంటనే నిర్మించాలని కోరారు. ఈనెల 17వ తేదీన కమిషన్ బాద్యులు హుస్సేన్ నాయక్ ఇక్కడి ప్రాజెక్టుతోపాటు అశ్వరావుపేటలోని పెద్దవాగు ప్రాజెక్టులను పరిశీలించను న్నట్లు తెలిపారు. ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు రాజకీయ పార్టీలకు అతీతంగా తెగిన ప్రాజెక్టుల నిర్మాణం కోసం కృషి చేయాలని జలగం కోరారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ కొనకండ్ల వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దారా వెంకటేశ్వరరావు, సంగోడి రాఘవులు, గుంపెన సొసైటీ వైస్ చైర్మన్ నల్లమోతు వెంకటనారాయణ, నాయకులు మేడ మోహన్‌రావు, గాదె లింగయ్య, పాండ్ల అంజన్ రావు, సిపిఐ మండల కార్యదర్శి బొర్ర కేశవులు, ఆయకట్టు రైతులు, గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## సింగరేణి లైబ్రరీకి పుస్తకాల బహుకరణ

**విశాలాంధ్ర - కొత్తగూడెం :** అన్నదానం కంటే విద్యాదానం చాలా గొప్పదని సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి గుండా శ్రీనివాస్ అన్నారు. సింగరేణి విద్యాసంస్థల గ్రంథాలయానికి రిటైర్డ్ ఏజీఎం బాల భాస్కర్ బుధవారం విలువైన పుస్తకాలు అందించారని ఆయన చెప్పారు. భాస్కర్ సింగరేణి స్టోర్స్ విభాగంలో విధులు నిర్వహిస్తూ ఫిబ్రవరి 28న రిటైర్డ్ అయ్యారని తెలిపారు. ఎంతోవిలువైన అంతర్జాతీయ పబ్లికేషన్స్‌కి చెందిన ప్రమాణిక పుస్తకాలు మెకానికల్ ఇంజనీరింగ్, మెంటల్ ఎబిలిటీ, లాజికల్ రీజనింగ్, బిజినెస్ మేనేజ్మెంట్, కామర్స్ కి సంబంధించిన పుస్తకాలను తమ గ్రంథాలయానికి బహుకరించడం అభినందనీయమన్నారు. ఈ పుస్తకాలును సింగరేణి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాస్ అందించడం జరిగిందన్నారు. పుస్తకాల దాత బాల భాస్కర్‌ను స్ఫూర్తిగా తీసుకొని మిగతా ఉద్యోగులు, అధికారులు తమ వద్ద ఉపయోగపడని పుస్తకాలను విద్యాసంస్థలు, గ్రంథాలయాలు, పేద విద్యార్థులకు బహుకరించాలని గుండా శ్రీనివాస్ కోరారు.

## 23న కొత్తగూడెంలో ప్రకృతి- ఆరోగ్య మహాసభ



**విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ :** ఈనెల 23న కొత్తగూడెంలో ప్రకృతి ఆరోగ్య మహాసభలు నిర్వహించనున్నారు. ఈ ప్రకృతి ఆరోగ్య సభలకు హాజరు కావాలని నిర్వాహకులు బుధవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజును కలిసి ఆహ్వానపరిచారు. ప్రకృతి ఆశ్రమం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సభల లక్ష్యాలు, ఉద్దేశలను ఎస్పీకి ఈ సందర్భంగా వివరించారు. ఈ సభలలో శారీరక, మానసిక ఆరోగ్యం, సామాజిక ఆరోగ్య బాధ్యతలతో పాటు ప్రకృతి పర్యావరణ పరిరక్షణపై ప్రముఖ ప్రకృతి కవి డా.జి.జయరాజు, ప్రముఖ సైకాలజిస్ట్, మోటివేషనల్ స్పీకర్, డా. ప్రత్యూష సుబ్బారావు, జాతీయ బాలోత్సవ్ కన్వీనర్ డా. వాసిరెడ్డి రమేష్ బాబు, జాతీయ జలసాధన సమితి అధ్యక్షుడు, నల్లగొండలో సహజ అడవి సృష్టికర్త, దుశర్ల సత్యనారాయణలు పాల్గొని ప్రసంగిస్తారని నిర్వాహకులు తెలిపారు. ఈ సభలలో పాల్గొని తమ సందేశం అందించాల్సిందిగా ఎస్పీని నిర్వాహకులు కోరారు. దీనికి ఎస్పీ స్పందిస్తూ నేడు ఇలాంటి కార్యక్రమాలు చాలా అవసరమని నిర్వాహకులని అభినందించారు. ఎస్పీని కలిసిన వారిలో కొత్తగూడెం మున్సిపల్ గ్రీన్ అంబాసిడర్ మొక్కల వెంకటయ్య, కో-ఆర్డినేటర్ జి. సుగుణారావు, బంగారి శంకర్‌లు ఉన్నారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

**విశాలాంధ్ర - తొర్రూర్ :** విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి సహచర విద్యార్థులకు పాఠాలు బోధించి ఆకట్టుకున్నారు. బుధవారం మండలంలోని మడిపల్లి ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. హెచ్ఎంగా వి.అన్వేష్, ఉపాధ్యాయులుగా సాత్విక్, రాము, లక్ష్మణ్, సుస్మిత, తేజస్విని, అక్షిత, సాయికిరణ్, సురేష్, సాయి ప్రసాద్‌లు వ్యవహరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను హెచ్ఎం తాటికాయల సురేందర్‌అ భినందించారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేం దుకు స్వయం పరిపాల దినోత్సవం దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.సోమేశ్వర్, జి.బాలు నాయక్, బ్రహ్మచారి, ఏ.సంధ్యా, మనోజ్ కుమార్, ఐ.కృష్ణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

# రాహుల్ ప్రక్షాళనా పథం

రాహుల్ గాంధీ ప్రతిపక్ష నాయకుడు కాక ముందు కూడా తనది సైద్ధాంతిక పోరాటం అంటూనే ఉన్నారు. బీజేపీతో గానీ, బీజేపీ అగ్రనేతలతో గానీ తనకు వ్యక్తిగత విభేదాలు, ద్వేష భావాలేమీ లేవు కానీ తనది సైద్ధాంతిక పోరాటం అని రాహుల్ ఎప్పటి నుంచో చెప్తున్నారు. కాంగ్రెస్‌లో సిద్ధాంత రాహిత్యం పెరిగిపోతోంది అన్న ఆరోపణలు పెరిగినందువల్ల రాహుల్ గాంధీ రాజకీయాల సిద్ధాంతాలు ప్రస్తావించడం పార్టీలో కొత్త రక్తం ఎక్కించడానికి ప్రయత్నిస్తున్నారనిపించింది. భారత్ జోడో యాత్రలో కూడా సైద్ధాంతిక పోరాటం గురించి ప్రస్తావించక పోలేదు. మూడు రోజుల కింద రాహుల్ గాంధీ గుజరాత్ వెళ్లారు. అదే సమయంలో ప్రధానమంత్రి మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా గుజరాత్‌లోనే పర్యటిస్తున్నారు. గుజరాత్ సందర్శన సందర్భంగా రాహుల్ సైద్ధాంతిక పోరాటాన్ని మరో అడుగు ముందుకు తీసుకెళ్లారు. కాంగ్రెస్ కార్యకర్తల్లోనూ, నాయకుల్లోనూ ఛద్మ వేషంలో ఉన్న బీజేపీ వారు ఉన్నారని రాహుల్ అన్నారు. ఇది చాలా తీవ్రమైన ఆత్మ విమర్శే. కాంగ్రెస్‌లో ఉన్న అలాంటి బీజేపీ వారిని వారు ఎంతమందైనా సరే ఏరివేయాలని రాహుల్ భావిస్తున్నారు. ఈ ప్రక్షాళన ఎప్పుడు జరుగుతుందో తెలియదు కానీ రాహుల్ దృష్టిలో కాంగ్రెస్‌లో ఉన్న బీజేపీ వారు అంటే ఏమిటో పరిశీలించాలి. హిందూ మతం హిందుత్వ ఒక్కటి కాదు. రాహుల్ ప్రస్తావిస్తోంది హిందుత్వ వాదులు కావొచ్చు. కాంగ్రెస్‌లో అలాంటి వారు ఉండడంలో ఆశ్చర్యం లేదు. కాంగ్రెస్ మొదటి నుంచి ఓ మహాసముద్రం లాంటి పార్టీ. భిన్న సైద్ధాంతిక కోణాలు ఉన్న వారు ఆ పార్టీలో మొదటి నుంచి ఉన్నారు. మొదట్లో అతివాదులు అన్న విభజన ఉండనే ఉంది. గోపాల కృష్ణ గోఖలే లాంటి వారు మితవాద పక్ష నాయకులైతే బాల గంగాధర్ తిలక్ మొదలైన వారిని అతివాదులు అనేవారు. గాంధీజీ విదేశాల నుంచి తిరిగి వచ్చిన తరవాత మితవాది అయిన గోపాల కృష్ణ గోఖలే వర్గంలో చేరారు. స్వాతంత్ర్యం వచ్చిన తరవాత మొట్టమొదట కాంగ్రెస్ నుంచి విడిపోయి వేరు కుంపట్లు పెట్టుకున్నది ఈ మితవాదులే. ఇందిరా గాంధీ హయాంలో బ్యాంకుల జాతీయకరణ, రాజభరణాల రద్దు లాంటి నిర్ణయాలు తీసుకున్నప్పుడు తీవ్రంగా వ్యతిరేకించింది కూడా కాంగ్రెస్‌లోని మితవాద వర్గమే. మితవాద భావాలు కలిగి హిందూ మతాభిమానం మెండుగా ఉన్న పండిత మదన్ మోహన్ మాలవీయ 1909, 1918,1932లో కాంగ్రెస్ అధ్యక్షులుగా పని చేశారు. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయ వ్యవస్థాపకుడిగా ఆయన ప్రసిద్ధుడు. హిందూమతం మీద ఒకింత ఎక్కువ మోతాదులో అభిమానం ఉన్న వారు కాంగ్రెస్‌లో అనేక మంది ఉండేవారు. మదన్ మోహన్‌మాలవీయా 1915లో ఏకంగా హిందూ మహాసభనే స్థాపించారు. ఆ హిందూ మహాసభతో సన్నిహిత సంబంధం ఉన్న నాథూరాం గాడ్సేనే మహాత్మా గాంధీని హతమార్చారు. డా. రాజేంద్ర ప్రసాద్ రాష్ట్రపతిగా ఎన్నికైన తరవాత కూడా హిందూ మతఅనుకూల నడవడిక చూపిన సందర్భాలు ఎక్కువగానే ఉన్నాయి. హిందూ మహాసభ మొదట్లో హిందువుల హక్కుల పరిరక్షణ కోసం ఏర్పడిన పార్టీయే కావచ్చు. వీర సావర్కర్ హిందూ మహాసభ అధ్యక్షుడు అయిన దగ్గరనుంచి ఆ పార్టీ హిందుత్వ ఛాయలు బహిరంగంగా వెల్లడి కావడం మొదలైంది. కాంగ్రెస్ ఆది నుంచి తమది సెక్యులర్ విధానం అని చెప్పుకుంటున్నా అసలైన సెక్యులర్ విధానాలు అనుసరించిన, అనుసరిస్తున్న వారిని వేళ్ల మీద లెక్కపెట్టవలసిందే. భారత రాజ్యాంగం మనది సెక్యులర్ వ్యవస్థ అని చెప్తుంది. కానీ ఆచరణలో శుద్ధ సెక్యులర్ వారి సంఖ్య బహు స్వల్పం. బాధ్యతాయుతమైన స్థానాలలో ఉన్న వారు తమ ఇష్టాయిష్టాలను అనుమానించగలిగిన రీతిలో బయట పడనీయకూడదు.

అంతెందుకు రాహుల్ గాంధీ తాను హిందువునని, అందునా బ్రాహ్మణుడినని చెప్పుకోవడానికి ఏ మాత్రం వెనుకాడరు. ఆయనకు హిందూ మతం మీద విశ్వాసం ఉండొచ్చు. ఎవరికైనా ఒక మతం మీద విశ్వాసం ఉండొచ్చు. ఇది అన్ని మతాల వారికీ వర్తిస్తుంది. కానీ మతం వ్యక్తిగత జీవితానికి పరిమితం అయితే ఏ సమస్యా ఉండదు. అయితే రాహుల్ గాంధీ, ముఖ్యంగా ఎన్నికల ప్రచార సందర్భంలో ఎక్కడికెళ్తే అక్కడ ఉన్న ప్రముఖ దేవాలయాలు సందర్శిస్తారు. దానికీ అభ్యంతర పెట్టవలసిన అవసరం లేదు. కానీ బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్నవారి ప్రతి కదలిక, ప్రతి ఆచరణ జనం దృష్టిలో పడ్తుంది. ఇది వారి సెక్యులర్ లక్షణాన్ని ప్రశ్నార్థకం చేస్తుంది. ఏ మతాభిమానం అయినా ఆయా మతానుయాయులు గుళ్లు, మసీదులు, గురుద్వారాలకు చర్చిలకు వెళ్లినా అభ్యంతరం ఉండకూడదు. కానీ సమాజంలో లేదా ప్రభుత్వంలో, వ్యవస్థలో పై స్థానంలో ఉన్న వారి నడవడికను ప్రజలు గమనిస్తారు. మొన్నామధ్యే డి.వై. చంద్రచూడ్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నప్పుడు ఏదో పండగ సందర్భంలో ప్రధానమంత్రిని ఇంటికి ఆహ్వానించడం పెద్ద రాద్ధాంతమైంది. ప్రధానమంత్రి మోదీకి హిందూ మతాభిమానమే కాదు, ఇతర మతాలను ద్వేషించే లక్షణమూ ఉంది. చంద్రచూడ్‌కు ఉన్నది కేవలం తన మతం మీద అనురక్తి మాత్రమే కావొచ్చు. కానీ రాజ్య వ్యవస్థలోని కార్యనిర్వాహక వర్గం, న్యాయ వ్యవస్థకు అగ్ర స్థానంలో ఉన్నవారు ప్రైవేటు వ్యవహారంలో అయినా తమ మతాభిమానాన్ని బహిరంగంగా చాటుకోవడంతో ఆగకుండా దాన్ని ప్రచారంలో పెట్టడం కచ్చితంగా వివాదాస్పదం అవుతుంది. నిజానికి ఇందిరా గాంధీ హయాం నుంచి ఉన్నత స్థానాల్లో ఉన్న వారు గుళ్లు గోపురాలు తిరగడం, ఏ రాష్ట్రానికి వెళ్తే ఆ రాష్ట్రానికి ప్రతీకగా నిలిచే వస్త్రధారణలో కనిపించడం అనివార్యంగా జనం దృష్టిని ఆకర్షిస్తోంది. అందువల్లే వివాదాలు, విమర్శలు తప్పడం లేదు. మనది సెక్యులర్ వ్యవస్థే అయినా బాధ్యతాయుతమైన స్థానాల్లో ఉన్న వారు తమ మత చిహ్నాలను, అభిమానాన్ని పరిమితి మీరి ప్రదర్శించడం వివాదాస్పదమవుతోంది. మతాభిమానాన్ని దాచుకోమని చెప్పడం ఇక్కడ ఎవరి ఉద్దేశమూ కాదు. అయితే అది ప్రదర్శనా మార్గం కాకూడదు. రాహుల్ సమస్య ఈ మేరకే పరిమితం కాలేదు. హిందుత్వ విధానాలను, బీజేపీని అభిమానించే వారు కాంగ్రెస్‌లో చేరిపోవడం రాహుల్‌ను కలవర పరుస్తోంది. కాంగ్రెస్ హిందుత్వ పార్టీ కాకపోయినా అగ్ర నాయకుల నడవడిక అనవసర వివాదాలకు తావిస్తోంది. వివిధ పార్టీల నాయకులు ఎన్నికల ప్రచార క్రమంలో గుళ్లు గోపురాల చుట్టూ తిరగడం అది వారి భక్తి ప్రపత్తులకు ప్రతీకగా కాకుండా మత దురభిమానానికి ప్రతీకగా కనిపిస్తోంది. గుళ్ల చుట్టూ తిరిగే వారందరూ విగ్రహారాధకులై ఉంటారు. భారతీయ జనతా పార్టీని హిందుత్వ పార్టీ అనొచ్చునేమో కానీ ఆ పార్టీని దశాబ్దాల పాటు నడిపిన అటల్ బిహారీ వాజపేయి, లాల్ కృష్ణ అద్వాణీ విగ్రహారాధకులు కారు. అందువల్లే వారు దేవాలయాలు, ప్రార్థనా మందిరాలకు వెళ్లిన సందర్భాలు అరుదాతి అరుదు. రాహుల్ గాంధీ ప్రక్షాళనా ప్రక్రియలో ఈ విషయాన్ని గమనించాలి. కాంగ్రెస్ పూర్తిగా నిర్దిష్ట సిద్ధాంతానికి కట్టబడిన పార్టీ అని నిరూపించుకోగలిగితే బీజేపీ అభిమానులు పిలిచినా కాంగ్రెస్‌లో చేరరు.

# టారిఫ్ యుద్ధం

అసద్‌మీర్జా

అమెరికా అధ్యక్షుడిగా రెండవసారి ఎన్నికయి అధికారం చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ యుద్ధం ప్రారంభించాడు. దేశాన్ని సుసంపన్నం చేయటం కోసం వివిధ దేశాల నుంచి దిగుమతి అవుతున్న వస్తువులు, సరుకులపై భారీగా టారిఫ్‌లను (సుంకాలు) విధించాడు. చైనా, మెక్సికో, కెనడా, భారత్‌పై భారీగా సుంకాలు విధించగా కొన్ని దేశాలు అమెరికాపైన సవాలు విసిరినట్టుగా తగిన విధంగా సుంకాలు విధించాయి. ట్రంప్‌తో సమంగా సుంకాలు విధించటానికి చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ సిద్ధమయ్యారు. ఒకరిపై ఒకరు సుంకాలు విధించుకునేందుకు సిద్ధపడుతున్నారు. ప్రపంచంలోని అనేక దేశాల అధిపతులు ట్రంప్‌ను వివిధ రకాలుగా విమర్శిస్తున్నారు. అమెరికా ప్రజాస్వామ్యం, దౌత్యాన్ని తీవ్రంగా విమర్శిస్తున్నారు. పరస్పరం విమర్శించుకోవటం ఒక విధంగా దూషించుకోవటం జరుగుతోంది. ట్రంప్‌కి వ్యతిరేకంగా అనేక దేశాలు పని చేస్తున్నాయి. చైనాకు వ్యతిరేకంగా టారిఫ్ యుద్ధాన్ని కొనసాగిస్తామని, ముఖ్యంగా ఔషధాల దిగుమతులపై అత్యధిక టారిఫ్‌లు విధిస్తున్నట్టు ట్రంప్ ప్రకటించారు. చైనా ప్రపంచ చిప్స్, సూపర్ కంప్యూటర్ సాంకేతికత ద్వారా ట్రంప్‌పై ఆధిపత్యం సాధించింది.

ఇటీవల చైనా నుంచి దిగుమతి అయ్యే అన్ని వస్తువుల పైన ట్రంప్ 20 వ శాతం పన్ను విధించాడు. తద్వారా అనేక పదుల బిలియన్ల డాలర్లను చైనా దిగుమతులపై అమెరికా విధించింది. ట్రంప్ మొదటిసారి అధ్యక్షుడిగా పరిపాలించిన సమయంలో తక్కువ టారిఫ్‌లను చైనాపై విధించాడు. ప్రస్తుతం ట్రంప్‌పై ప్రతిఘటనాత్మక వ్యూహాన్ని చైనా రూపొందించింది. గతంలోనూ, ఇప్పుడు చైనా పన్నిన వ్యూహం ఫలించింది. 2024 నాటికే చైనా చిప్స్ తయారుచేసేందుకు ఉపయోగపడే అత్యంత కఠినమైన ఖనిజాలను అమెరికాకు ఎగుమతి చేయకుండా నిలిపివేసింది. అదే సమయంలో అమెరికా తయారుచేసే డ్రోన్లను చైనాకు సరఫరా చేయకుండా ఆపివేసింది. చైనా వస్త్రాల తయారీకి చెందిన ప్రముఖ కంపెనీని బ్లాక్ లిస్టులో పెడతానని ట్రంప్ బెదిరించాడు. అమెరికా ఒత్తిడిని అధిగమించేందుకు చైనా తన శక్తి సామర్థ్యాలను ఉపయోగించి అమెరికా ఒత్తిడి చేస్తోంది. ఎటువంటి యుద్ధాన్నైనా చేయడానికి సిద్ధమేనని జిన్‌పింగ్ అమెరికాను హెచ్చరించాడు. అమెరికా వాణిజ్య టారిఫ్‌లను తిప్పికొడతానని చైనా హెచ్చరించింది. అయితే ట్రంప్ తాజాగా చైనా వస్తువులపై విధించిన టారిఫ్‌లు సరైనవేనని సమర్థించుకున్నాడు. తాము విధించే టారిఫ్‌లకు సంబంధించి అమెరికా ఒత్తిడి చేస్తూ బ్లాక్ మెయిల్ చేస్తోందని చైనా పేర్కొన్నది. అమెరికా కాంగ్రెస్ సంయుక్త సమావేశంలో ట్రంప్ మాట్లాడుతూ అనేక దశాబ్దాలుగా ఇతర దేశాలు అమెరికాపైన ఎక్కువ టారిఫ్‌లు విధిస్తున్నాయని ఇప్పుడు మనం విధిస్తే తప్పేంటి అని అన్నాడు. సగటున యూరోపియన్ యూనియన్, చైనా, బ్రెజిల్, ఇండియా, మెక్సికో, కెనడా తదితర దేశాలు మనపైన చాలా ఎక్కువగా టారిఫ్‌లను విధించాయని, మనం విధించింది తక్కువగా, న్యాయంగా ఉందని ట్రంప్ అన్నాడు. మార్చి 4 వ తేదీన చైనా దిగుమతులపై మనం పది శాతం టారిఫ్‌లు విధించగా నిమిషాలలో అమలులోకి వచ్చిందని ట్రంప్ చెప్పాడు.

గతంలో పేర్కొన్నట్టుగా చైనా ఇంత క్రితమే నిరోధక చర్యలు తీసుకున్నది. 2023 నుంచి చైనా ద్రవ్య, డబ్బు పరమైన చర్యలు తీసుకోవడం ద్వారా వాణిజ్యాన్ని పెంచుకొన్నది. రియల్ ఎస్టేట్ వాణిజ్యం, భూముల వెంచర్లను పరిశ్రమల వైపు, నూతన కార్యక్రమాల వైపు మళ్లించడం ద్వారా చైనా ప్రయోజనం పొందింది. వాస్తవంగా చైనా దుస్తుల నుంచి పాదరక్షల ఉత్పత్తులతో పాటు ఆధునిక సాంకేతికతలను ఉదాహరణకు రోబోటిక్స్, మేధో సంపత్తి (ఎ.ఐ) వైపు ట్రంప్ రెండోసారి ఎన్నికకావడానికి కంటే చాలా ముందు చైనా అనేక కార్యక్రమాలను చేపట్టింది. ట్రంప్ అధ్యక్షుడు అవటానికి ముందే ఈ కార్యక్రమాలను చైనా చేపట్టింది. వాస్తవానికి చైనా ఫ్యాక్టరీలు తక్కువ వ్యయంతో అధిక సాంకేతికత గల వస్తువులను భారీగా వేగంగా తయారుచేయగలదు. అయితే తక్కువ వేతనాలతో మాత్రం కాదు. న్యాయమైన వేతనాలతోనే పని చేయించటం జరుగుతుంది. ఇటీవల కాలంలో చైనా ప్రపంచంలోనే అనేక దేశాలతో ఆర్థిక సంబంధాలను విస్తరించుకుంటోంది. ఇటీవల పెరూలో పర్యటించిన సందర్భంగా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ డీప్ వాటర్ పోర్ట్‌ను ప్రారంభించారు. దీంతో లాటిన్ అమెరికాతో వాణిజ్యాన్ని చైనా తిరిగి ఏర్పర్చుకుంటోంది. అమెరికా కాకుండా ఇతర దేశాలతో ఆహారం, ఇంధనం, ఖనిజాలు తదితర వస్తువులతో వాణిజ్యాన్ని చైనా ఏర్పాటు చేసుకుంటోంది. ఫిబ్రవరి నుంచి అమెరికా, చైనాలు పరస్పరం టారిఫ్‌లు విధించుకుంటున్నాయి. తాజాగా అమెరికాలో ముఖ్యమైన రైతులను లక్ష్యంగా చేసుకొని అమెరికాను కష్టాల పాలు చేస్తామని చైనా ట్రంప్‌ను హెచ్చరించారు.

# ఆయిల్ పామ్ కౌలురైతులను ముంచుతున్న దళారీలు

పి.జమలయ్య

దళారీ వ్యవస్థని రూపుమాపడంలో అన్ని ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. ప్రతి పంటలోనూ దళారీ వ్యవస్థ సైర్యవిహారం చేస్తున్నది. చివరికి ఆయిల్ పామ్ సాగు చేస్తున్న కౌలురైతులను కూడా దోపిడీ చేస్తున్నది. మాటలకు ఆచరణకు పొంతన లేనప్పుడు నష్టపోయేది ఎప్పుడూ పేద రైతులే. మంచి ధరలు వస్తున్నాయని, ఆయిల్ పామ్ సాగు చేయాలని, అనేక రకాల సబ్సిడీలు ఇస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నది. రైతు, కౌలురైతుల శ్రమ ప్రతిఫలం ఎవరు కాజేస్తున్నారో?

దేశంలోనే ఆయిల్ ఫామ్ సాగు, ఉత్పత్తి, ఉత్పాదకతలో ఏపీ ప్రథమ స్థానంలో ఉంది. ఏలూరు, తూర్పుగోదావరి, కాకినాడ, ఎన్టీఆర్, అనకాపల్లి ఉత్తరాంధ్ర తదితర జిల్లాల్లో ఆయిల్ పామ్ ఎక్కువగా సాగువుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా 5.66 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగవుతోంది. 1.74 లక్షల మంది రైతులు ఆయిల్ ఫామ్ సాగు చేస్తున్నారు. ఏటా 19 లక్షల టన్నుల గెలలు ఉత్పత్తి అవుతున్నాయి. ఎకరానికి సగటున 8 టన్నులు దిగుబడి వస్తుంది. గంటకు 461 టన్నులు క్రషింగ్ సామర్థ్యం కల్గిన 13 ప్రాసెసింగ్ యూనిట్లు ఉన్నాయి. అయితే ఆశించినంత ధరలు రైతాంగానికి రావటం లేదు.

మారిన వ్యవసాయ పరిస్థితులలో ఏ ప్రాంతంలోనూ, ఏ పంట లోను సొంత భూమి కలిగిన యాజమాన్యం పంట పండించడం లేదు. సొంతంగా సాగు చేసుకుంటే గిట్టుబాటు కావడం లేదని వ్యవసాయం నుంచి వైదొలుగుతున్నారు. ఆయిల్ ఫామ్ సాగులో కూడా పెద్ద సంఖ్యలో యాజమాన్యాలు సాగు నుంచి తప్పుకుంటున్నాయి. వాళ్లు ఇతర లాభసాటిగా ఉన్న వృత్తులు, వ్యాపారాలు చేపట్టి ఆయిల్ పామ్ తోటలను కౌలుకిస్తున్నారు. ఒక మాటలో చెప్పాలంటే ఆయిల్ పామ్ సాగులో 90% కౌలు రైతులే ఉన్నారు. వీళ్లంతా చిన్న, సన్న కారు కౌలురైతులే. మామిడి, జీడీ మామిడి తోటలు చీడపీడలు వల్ల దెబ్బ తినటం, పండిన మామిడి, జీడి మామిడి పంటలకు గిట్టుధరలు రావడం లేదు. పైగా ఈ ప్రాంతంలో వరి పంటలకు కనీసం మద్దతు ధరలు కూడా దక్కటం లేదు. అందువల్ల ఎక్కువమంది మామిడి, జీడిమామిడి తోటలను తొలగిస్తున్నారు. వరి పండించే రైతులు ఆయిల్ పామ్ సాగువైపు దృష్టి సారిస్తున్నారు. మరి కొంత మంది లాభసాటిగా ఉందని ఆయిల్ పామ్ వైపు మొగ్గుచూపుతున్నారు.

ఎకరా ఆయిల్ పామ్ సాగుకు రూ 85వేల నుంచి రూ 1.20 లక్షల వరకు కౌలు చెల్లిస్తున్నారు. ఆయా ప్రాంతాలను బట్టి, నీటి సౌకర్యంబట్టి, పంటల దిగుబడిని బట్టి ఏరోజుకు ఆ రోజు కౌలు రేట్లు పెరుగుతున్నాయి. కౌలు సుమారు లక్ష రూపాయలు ముందస్తుగానే చెల్లించాలి. మరొక రూ 50 వేలు పెట్టుబడి అవుతుంది. ఈ రెండిటికి కలిపి పెట్టుబడికి నూటికి రెండు రూపాయలు చొప్పున వడ్డీ లెక్కేసుకుంటే రూ 25,000 దాకా వడ్డీభారం పడుతుంది. అంటే ఒక ఎకరంలో ఆయిల్ ఫామ్ సాగు చేయడానికి రూ 1.75 లక్షల వరకు పెట్టుబడు అవుతుంది. సగటున ఎకరానికి 8 టన్నుల దిగుబడి వస్తుంది. ప్రస్తుతం ఆయిల్ గెలలు టన్ను రూ 20,750 ధర ఉంది. అంటే 8 టన్నులకు సుమారు రూ 1.66 లక్షల ఆదాయం వస్తుంది. ఒక్కొక్క సందర్భంలో చీడపీడల వల్ల దిగుబడి తగ్గిపోయి పెట్టిన ఖర్చులు కూడా రానటువంటి పరిస్థితి ఎదురవడంతో ఆయిల్ పామ్ సాగు చేసే కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఆయిల్ పామ్ ధరలు అంతర్జాతీయ మార్కెట్ ధరలు ఆధారంగా నిర్ణయిస్తున్నారు. మార్కెట్లో ఒడిదుడుకుల వల్ల ఆయిల్ ఫామ్ సాగు చేసే కౌలు రైతుల జీవితాలు కూడా ఎదుగుబొదుగు లేకుండా ఉన్నాయి.

పెద్దవేగిలోగల ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఆయిల్ పామ్ ఫ్యాక్టరీలో పాత యంత్రాల వల్ల రికవరీ 16 శాతం మించి రావడం లేదు. పెద్దవేగి ఆయిల్ ఫ్యాక్టరీలో వచ్చిన రికవరీ శాతాన్ని ప్రైవేట్ కంపెనీలు కూడా ప్రామాణికంగా తీసుకొని అమలు చేయడంతో రైతులకు గిట్టుబాటు కావడం లేదు. తెలంగాణ ప్రాంతంలో ఉన్న ఫ్యాక్టరీల్లో రికవరీ 19 శాతం వస్తోంది. అక్కడ ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు మంచి ధర లభిస్తుంది. తెలంగాణ ప్రాంతంలో చెల్లిస్తున్న మాదిరిగానే ఆంధ్ర ప్రాంతంలో కూడా చెల్లించాలని ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ సక్రమంగా అమలు జరగటం లేదు. రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్లే ఆయిల్ పామ్ రైతులు ఎక్కువగా నష్టపోతున్నారని దీన్ని బట్టి అర్థమవుతుంది. అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వం దిగుమతి చేసుకుంటున్న పామ్ ఆయిల్ దిగుమతి సుంకాలు 45శాతం ఉంటే దానిని పూర్తిగా రద్దు చేశారు. ఇటీవల కాలంలో దిగుమతులపై కొంతమేరకు సుంకాలు విధించినా ఆశించిన ఫలితాలు లేవు. దిగుమతి విధానాల వల్ల ఆయిల్ పామ్ ధరలు తగ్గిపోవడంతో స్థానిక రైతులు, కౌలురైతులు తమ ఆదాయాన్ని కోల్పోతున్నారు. 2022, 2023 సంవత్సరాలలో టన్ను ఆయిల్ ఫామ్ గెలలు రూ 23 వేల దాకా ధర పలికితే ఇప్పుడు రూ 20,750 వరకు తగ్గిపోయింది. ఆరుగాలం శ్రమించి పంట పండించి ఫ్యాక్టరీలకు తీసుకెళ్తే తూకం వేసిన నాటి ధరను బట్టి డబ్బులు ఇవ్వడం లేదు. 15 రోజులు దాకా గడువు పొడిగించి ఆ తర్వాత ఇస్తున్నారు. ఆయిల్ పామ్ ధరలు నెలకొకసారి నిర్ణయిస్తున్నారు. దీనివల్ల మార్కెట్‌లో హెచ్చుతగ్గులు చూసుకొని కాటా వేసే నాటికి ఉన్న రేటు ప్రకారం కాకుండా ఏది తక్కువ ఉంటే దాన్ని బట్టి డబ్బులు రైతులు ఖాతాలో జమ చేస్తున్నారు. ఒకవేళ ఆయిల్ పామ్ ధరలు ఎక్కువుంటే పెరిగిన మేరకు జమ చేస్తున్నారు. కాటా వేసే నాటికి ఉన్న ధరకు, ధరలు నిర్ణయించే సమయానికి ఉన్న ధరకు తక్కువ ఉంటే ధరల్లో కోత పెడుతున్నారని అర్థం అవుతున్నది. ఎక్కువగా చెల్లించిన సందర్భాలు చాలా తక్కువ. కోతలు పెట్టి రైతులకు నష్టం చేసిన సందర్భాలే ఎక్కువ కాబట్టి కాటా వేసే సమయానికి ఉన్న ధరల ప్రకారం వెంటనే రైతుల ఖాతాలో డబ్బులు జమ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. 15 రోజులు గడువు పెట్టడంతో ఆయిల్‌పామ్ సాగులో ఉన్నది ఎక్కువ మంది కౌలురైతులే కాబట్టి సాగుకోసం తెచ్చిన అప్పుపై వడ్డీ భారం పెరుగుతుంది. దీనివల్ల వడ్డీ భారం నుంచి తప్పుకోవటానికి దళారులను ఆశ్రయించే పరిస్థితి వస్తున్నది. రైతులు తమ పంటను ఫ్యాక్టరీ వద్దకు తీసుకొచ్చే సమయంలో గేటు దగ్గర కొంతమంది దళారులు డబ్బు సంచులను సిద్ధంగా చేసుకొని టన్నుకు అప్పటి ధర కన్నా రూ 450లు తగ్గించి స్పాట్ పేమెంట్ చేస్తున్నారు. దీంతో కౌలు రైతులు ఎక్కువమంది దళారులకు అమ్ముకుని నష్టపోతున్నారు.

సుమారు ఎకరానికి ప్రతి ఏడాది రూ 3,600 నష్టం జరుగుతుంది. ప్రభుత్వం ఆలస్యం చేయకుండా తక్షణమే డబ్బులు ఇస్తే దళారులను ఆశ్రయించే పరిస్థితి ఎదురయ్యే అవకాశాలు తక్కువ ఉంటాయి. రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతుల ఖాతాలో డబ్బులు జమ చేస్తున్నారు. కానీ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీల్లో కూడా అలా చేయాలి. కౌలురైతులు ఎందుకు నష్టపోతున్నారో ప్రభుత్వం ఆలోచన చేయక పోవడం విచారకరం. ప్రభుత్వం జోక్యం చేసుకొని ఆయిల్ పామ్ ఫ్యాక్టరీల యాజమాన్యాల నుంచి రైతులు ఖాతాలో ఎప్పటికప్పుడే డబ్బులు జమ చేసే విధంగా చర్యలు చేపట్టవలసిన అవసరం ఉంది.

ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం
ప్రధాన కార్యదర్శి

# భారత స్వాతంత్ర్య పతాకం ఎరుపు

ఆర్వీ రామారావ్

భారత జాతీయ పతాకం రూపు రేఖలు ఏమిటో కొత్తగా చెప్పక్కర్లేదు. కానీ చరిత్రలో మరుగున పడిపోయిన ప్రధానమైన అంశం ఒకటుంది. 1929వ సంవత్సరం ముగిసి 1930 ఆరంభం అవుతున్న అర్థ రాత్రి భారత స్వాతంత్ర్య పతాకం ఆవిష్కృతం అయింది. అదీ మువ్వన్నెల పతాకమే. ఆ పతాకంలో పైన ఎరుపు, మధ్యలో తెలుపు, అడుగున ఆకుపచ్చ రంగులు ఉండేవి. ఈ అంశాన్ని చరిత్రకారులు కూడా విస్మరించినట్టున్నారు. ఆ తరవాత జాతీయ పతాకాన్ని ఖరారు చేసినప్పుడు ఎరుపు స్థానంలో కాషాయ రంగు చేరింది. 1930 జనవరి 26న స్వాతంత్ర్య దినంగా భావించే వారు. 1930 జనవరి 26న స్వాతంత్ర దినోత్సవం జరుపుకుంటున్న సమయంలో బొంబాయిలో ప్రదర్శనకారులు పైన ఎరుపు రంగు ఉన్న పతాకంతో పాటు కమ్యూనిజానికి చిహ్నమైన ఎర్ర జెండా కూడా ఎగురవేయాలనుకున్నారు.

వామపక్ష భావాల వైపు జవహర్‌లాల్ నెహ్రూ లాంటి కాంగ్రెస్ నాయకులకు ఇది సంతోషదాయకమే అయినా మితవాదులు మాత్రం వణికి పోయారు. నెహ్రూకు కార్మికోద్యమ మీద ప్రగాఢమైన సానుభూతి ఉండేది. త్రివర్ణ పతాకానికి, కార్మికుల ఎర్ర జెండాకు మధ్య స్పర్థ ఉండక్కర్లేదు అని నెహ్రూ అన్నారు. ఎర్రజెండా కార్మికులు చిందించే నెత్తురుకు, పడే బాధలకు చిహ్నం అని నెహ్రూ ఆ దశలో వ్యాఖ్యానించారు. సీపీఐ ప్రస్థానంలో అనేక మలుపులు ఉన్న మాట వాస్తవం. హింసాత్మక పోరాటం వల్లే విప్లవం సాధ్యం అని ఒకప్పుడు భావించిన సీపీఐ క్రమంగా పార్లమెంటరీ ప్రజాస్వామ్యం వేపు మొగ్గు చూపింది. ఈ మార్గం వల్ల కమ్యూనిస్టులు కాంక్షించే సోషలిస్టు సమాజం ఏర్పడి ఉండకపోవచ్చు కానీ కమ్యూనిస్టుల పోరాటాలవల్లే మెరుగైన కార్మిక చట్టాలు, పరిమితులతో అయినా భూ సంస్కరణలు, సంక్షేమ పథకాలకు దారి సుగమమైంది. అయినా సోషలిజం స్థాపన అన్న కమ్యూనిస్టుల లక్ష్యం నెరవేరలేదు కనక కార్మికుల, రైతుల హక్కుల కోసం నిరంతర పోరాటం కొనసాగిస్తూనే ఉంది. సంఘటితమైన కార్మికులే ఉమ్మడిగా తమ హక్కులు సాధించుకో గలుగుతారని సీపీఐ విశ్వసిస్తుంది. పరిశ్రమల పాల్పడుతున్నప్పుడు కార్మికులకు అండగా నిలబడేది కమ్యూనిస్టులే. భారీ పరిశ్రమలన్నీ ప్రభుత్వ రంగంలోనే ఉండాలన్నది సీపీఐ భావన. గనుల తవ్వకం, వస్త్రోత్పత్తి, బ్యాంకింగ్, బీమావంటివి ప్రభుత్వ రంగాలలోనే ఉండాలని సీపీఐ కృషి చేస్తోంది. ప్రభుత్వ రంగ సంస్థలనుంచి వచ్చే లాభాలను సంక్షేమ పథకాలకు, అభివృద్ధికి వినియోగించాలన్నది సీపీఐ ఆకాంక్ష. ఆదాయాన్నిబట్టి పన్నులు వసూలు చేయాలని, సంపన్నులపై ఎక్కువ పన్ను విధించాలని సీపీఐ మొదటి నుంచీ భావిస్తోంది. పన్నుల ద్వారా వచ్చే రాబడిని సామాజిక భద్రతా

యాజమాన్యంలో కార్మికుల భాగస్వామ్యం ఉండాలంటుంది. సిబ్బందిని ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నప్పుడు, లే ఆఫ్‌లకు కార్యక్రమాలకు, అవకాశాలు అందని ప్రజల సంక్షేమానికి వాడాలని సీపీఐ భావిస్తోంది. విదేశీ పెట్టుబడులని, బహుళజాతి గుత్త కంపెనీలను సీపీఐ వ్యతిరేకిస్తుంది.

1940 నుంచి స్వాతంత్ర్యం వచ్చే దాకా అంతర్జాతీయ స్థాయిలో ఫాసిజం, దేశంలో మతతత్వం ప్రధాన సమస్యలుగా ఉన్నప్పుడు కాంగ్రెస్ నాయకుల్లో ఎక్కువ మంది జైళ్లల్లో ఉన్నారు. ఆ సమయంలో సీపీఐ కార్మికులను సమీకరించింది. అహమదాబాద్‌లో, జెంషెడ్‌పూర్‌లో కార్మికుల సమీకరణ జోరుగా సాగింది. 1942 సెప్టెంబర్ 25న అణచివేత వ్యతిరేక దినంగా పాటించాలని సీపీఐ పిలుపు ఇచ్చింది. బెంగాల్ కరవు సమయంలో కమ్యూనిస్టులు చేపట్టిన సహాయ కార్యక్రమాలు అపురూపమైనవి. నిజానికి పంటలు పండకపోవడం బెంగాల్ కరవుకు కారణం కాదు. అప్పటి చర్చిల్ ప్రభుత్వం యుద్ధ ప్రాంతానికి ధాన్యం తరలించి కృత్రిమంగా కరవు ఏర్పడడానికి కారకులైనది. బెంగాల్ కరవు విజృంభించినప్పుడు ఆహార ధాన్యాల దొంగ నిల్వలు వెలికి తీయడానికి సీపీఐ అనేక ప్రదర్శనలు నిర్వహించింది. ఉమ్మడి వంట గదులు ఏర్పాటు చేసి ప్రజలను ఆదుకుంది. అదే సమయంలో కొన్ని చోట్ల వ్యవసాయ రుణాల వసూలు రద్దు చేయాలని గట్టిగా కోరింది. సీపీఐ చొరవవల్ల కలకత్తా శాసనసభ ఎదుట మహిళలు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ కీలక దశలో సీపీఐ అత్యంత క్రియాశీలంగా పని చేసినందువల్లే సీపీఐ మీద ఆదరణ విపరీతంగా పెరిగింది. 1942 జులై నాటికి సీపీఐ సభ్యత్వం కేవలం 4,000. 1943 నాటికి అది 15,000 చేరింది. 1946 వేసవి నాటికి 53,000 అయింది.

# అంతర్జాతీయ సరిహద్దులో ఇంధన ప్రాజెక్టులా?

- కేంద్రం వైఖరితో జాతీయభద్రతకు విఘాతం
- లోక్‌సభలో కాంగ్రెస్, డీఎంకే నిరసన

న్యూఢిల్లీ: గుజరాత్‌లోని భారత్-పాకిస్థాన్ సరిహద్దు సమీపంలో పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుకు కేంద్రం అనుమతి ఇవ్వడాన్ని లోక్‌సభలో ప్రతిపక్షాలు తీవ్రంగా నిరసించాయి. జాతీయ భద్రత విషయంలో ప్రభుత్వం రాజీపడిందని విమర్శించాయి. ప్రధానంగా కాంగ్రెస్, డీఎంకే ప్రభుత్వాన్ని తప్పుబట్టాయి. కాంగ్రెస్‌కు ఎంపీ మనీష్ తివారీ ప్రశ్నోత్తరాల సమయంలో అనుబంధ ప్రశ్న వేస్తూ జాతీయ భద్రత, ఇంధన భద్రత కలిసి ఉండాల్సిందేనని అన్నారు. ప్రతిపాదిత మిశ్రమ పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టు అంతర్జాతీయ సరిహద్దు (ఐబీ) నుండి ఒక కిలోమీటరు దూరంలో ఉందని ఆయన పేర్కొన్నారు. భద్రతా ప్రోటోకాల్ ప్రకారం ఏదైనా పెద్ద మౌలిక సదుపాయాల ప్రాజెక్టు ఐబీ నుండి కనీసం 10 కి.మీ దూరంలో ఉండాలని ఆయన పేర్కొన్నారు. ప్రతిపాదిత ప్రాజెక్టుకు ప్రభుత్వం ఏదైనా సడలింపు మంజూరు చేసిందా అని ఆయన ప్రశ్నించారు. కాగా కేంద్రం, రాష్ట్రం, సంబంధిత సంస్థల నుండి అనుమతులు పొందిన తర్వాత ఏదైనా ప్రతిపాదనకు ఆమోదాలు, లైసెన్సులు మంజూరు చేయబడతాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. దేశంలో పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిపై ప్రభుత్వం ఆసక్తిగా ఉందని పునరుత్పాదక ఇంధన మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. లైసెన్సులు జారీ చేసి, ఆమోదం తెలిపే ముందు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత సంస్థల నుండి అనుమతులు తీసుకుంటామని ఆయన అన్నారు. ఆ సమాధానంతో సంతృప్తి చెందని కాంగ్రెస్ సభ్యులు జాతీయ భద్రతపై నినాదాలు చేస్తూ సభ వెల్‌లోకి దూసుకెళ్లారు. వారిని డీఎంకే సభ్యులు అనుసరించారు. అనంతరం సభనుంచి వాకౌట్ చేశారు. ఒక వ్యాపార సంస్థ ఎనర్జీ పార్క్ ఏర్పాటు చేయడానికి సరిహద్దు భద్రతా నియమాలను సడలించారన్న వార్తల్ని ఉటంకిస్తూ... ప్రైవేట్ బిలియనీర్లకు ప్రయోజనం చేకూర్చేందుకు జాతీయ భద్రతను ప్రమాదంలో పడేస్తున్నారని ఆరోపిస్తూ కాంగ్రెస్ ఇటీవల కేంద్రంపై విరుచుకుపడింది.

**డీలిమిటేషన్‌తో తమిళనాడుకు అన్యాయం**

జనాభా పెరుగుదలను నియంత్రించిన తమిళనాడు వంటి ప్రగతిశీల రాష్ట్రాలను నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) దెబ్బతీస్తుందని డీఎంకే ఎంపీ కతిర్ ఆనంద్ లోక్‌సభలో ఆందోళన వ్యక్తం చేశారు. పార్లమెంటు, రాష్ట్ర అసెంబ్లీలలో అన్ని రాష్ట్రాలకు సమాన ప్రాతినిధ్యం ఉండేలా చూడాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. డిలిమిటేషన్ కసరత్తు చేస్తున్నప్పుడు ప్రభుత్వం కేవలం జనాభా సంఖ్య మాత్రమే కాకుండా ఆర్థిక పనితీరు, జీఎస్‌డీపీ, తలసరి ఆదాయం, మౌలిక సదుపాయాల మెరుగుదల వంటి కీలక సూచికలను పరిగణనలోకి తీసుకోవాలని ఆనంద్ పేర్కొన్నారు. జనాభా నియంత్రణ చర్యల కారణంగా తమిళనాడులో లోక్‌సభ సీట్ల సంఖ్య తగ్గుతుందన్నారు. ఉత్తర భారత రాష్ట్రాలతో పోలిస్తే తమిళనాడు జనాభా గణనీయంగా తక్కువగా ఉందని, డీలిమిటేషన్ కోసం జనాభా గణాంకాలను పరిగణలోకి తీసుకోవడం తమిళనాడుకు పూర్తి అన్యాయం చేయడమేనని ఆనంద్ ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, పశ్చిమ బెంగాల్ రాష్ట్ర సరిహద్దుల ద్వారా భారతదేశంలోకి ప్రవేశించే బంగ్లాదేశ్ చొరబాటుదారుల సమస్యను బీజేపీకి చెందిన నిషికాంత్ దూబే జీరో అవర్‌లో లేవనెత్తారు.

డీలిమిటేషన్ నిర్వహించేటప్పుడు కేంద్రం వారిని మినహాయించాలని సూచించారు. 1951 జనాభా లెక్కలతో పోలిస్తే 2011 జనాభా లెక్కల్లో జార్ఖండ్‌లో గిరిజనుల జనాభా తగ్గిందని, ముస్లిం జనాభా గణనీయంగా పెరిగిందని దూబే అన్నారు. బంగ్లాదేశ్ చొరబాటుదారులు జార్ఖండ్‌లోని గిరిజన బాలికలను బలవంతంగా వివాహం చేసుకుని, వారి మతం మారుస్తున్నారని... డీలిమిటేషన్ ప్రక్రియ నిర్వహించేటప్పుడు, బంగ్లాదేశ్ చొరబాటుదారులను మినహాయించాలని ప్రభుత్వాన్ని దూబే కోరారు.

## భవిష్యత్ సవాళ్లకు సర్వసన్నద్ధం

### భావి సైన్యాధికారులకు ఐఏఎఫ్ చీఫ్ పిలుపు

న్యూఢిల్లీ: నేటి పరిస్థితుల్లో ఎదురవుతున్న భద్రతాపరమైన సవాళ్లను అధిగమించాలంటే సామర్థ్యాన్ని వేగంగా పెంచుకోవడం అవసరమని చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్ (సీఏఎస్) ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ వెల్లడించారు. 80వ స్టాఫ్ కోర్సు ఐఏఎఫ్ స్టూడెంట్ ఆఫీసర్స్, వెల్లింగ్టన్ డిఫెన్స్ సర్వీస్ స్టాఫ్ కాలేజ్ (డీఎస్ఎస్‌ఎస్) ఫ్యాకల్టీని ఉద్దేశించి సింగ్ మాట్లాడుతూ రేపటి సవాళ్లకు సర్వ సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. భావి సైన్యాధికారుల నుద్దేశించి సింగ్ మాట్లాడినట్లు రక్షణశాఖ బుధవారం ఓ ప్రకటన చేసింది. మార్పును స్వీకరించాలని అధికారులకు సింగ్ హితవు పలికారు. భవిష్యత్ ఘర్షణలు-యుద్ధాల కోసం ఆచరణీయమైన వ్యూహాలు సిద్ధం చేసుకోవాలని, ఐకంగా ముందుకెళ్లాలని సూచించారు. త్రివిధ దళాల పోరాట పటిమను పెంచడం కోసం సమగ్ర శిక్షణ, ఆపరేషనల్ సినర్జీ అవసరమని సింగ్ తెలిపారు. ఐఏఎఫ్ ప్రస్తుత ఆపరేషన్లను ప్రస్తావించారు. ఆధునిక యుద్ధక్షేత్రంలో ఏకీకృత ఆపరేషన్లు కీలకమని చెప్పారు. క్లిష్టమైన అకడమిక్, ప్రొఫెషనల్ ట్రైనింగ్ ద్వారా భావి సైన్యాధికారులను తీర్చిదిద్దడంలో సంస్థ పాత్రను కొనియాడారు. సంయుక్త ఆపరేషన్‌ల సామర్థ్యాలను, అంతర్గత సేవల సహకారాన్ని పెంపొందించాలని ఐఏఎఫ్ చీఫ్ వెల్లడించారు.

## బీజేపీ కుట్రలు సాగనివ్వను

### అసెంబ్లీలో నిప్పులు చెరిగిన మమత

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో మతచిచ్చు పెట్టేందుకు బీజేపీ చేస్తున్న కుట్రలను సాగనివ్వబోనని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతాబెనర్జీ స్పష్టం చేశారు. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాష్ట్రంలో మతతత్వ మంటలు రేపడానికి బీజేపీ యత్నిస్తోందని ఆమె మండిపడ్డారు. 'ఏ మతాన్ని అవమానించడాన్ని నేను సహించను' అని అసెంబ్లీలో నిరసనకు దిగిన బీజేపీ శాసనసభ్యులను ఉద్దేశించి మమత హెచ్చరించారు. 'ప్రతిపక్ష నాయకుడి కుర్చీని గౌరవించడం నేర్చుకోండి. మీరు మతతత్వ కార్డును ప్లే చేయడానికి ప్రయత్నిస్తున్నారు. మానవత్వం మతానికి అతీతం' అని గుర్తెరగండని మమత అన్నారు. పార్లమెంటరీ కార్యకలాపాల్లో పాల్గొనడపై మాట్లాడుతూ... రెండు సభలు సాధారణంగా జరిగేలా చూసుకోవాలని తాను ఎల్లప్పుడూ తన పార్టీ ఎంపీలకు చెబుతానని మమత అన్నారు. 'మాకు 42 మంది ఎంపీలు ఉన్నారు. సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగించవద్దని నేను వారికి చెబుతున్నాను. కుర్చీ శాశ్వతం కాదు. మన దేశం మర్యాద, సార్వభౌమత్వానికి ప్రసిద్ధి చెందింది. ప్రతి ఒక్కరికీ వారి స్వంత జీవితాలను గడపడానికి హక్కు ఉంది' అని ఆమె అన్నారు. బుధవారం అసెంబ్లీలో ముఖ్యమంత్రి మమతాబెనర్జీ ప్రసంగిస్తున్న సమయంలో సిలిగురి బీజేపీ ఎమ్మెల్యే శంకర్ ఘోష్ జోక్యం చేసుకున్నారు. "మీరు చెప్పింది మేము విన్నాము. మీరు సభలో లేని ప్రతిపక్ష నాయకుడి గురించి మాట్లాడుతున్నారు. మీ మంత్రి ఫిర్హాద్ హకీమ్ హిందువులను చంపడం గురించి మాట్లాడారు" అన్నారు. దీనిపై మమత ఘోష్‌ను తన సీటులో కూర్చోమని హెచ్చరిస్తూ... ఆయన వాస్తవాలు చెప్పడం లేదని అన్నారు. 'మా పార్టీ ఈ విషయాలపై చాలా కఠినంగా ఉంది. అలాంటి ప్రకటనలు చేయవద్దని మంత్రి ఫిర్హాద్ హకీమ్‌ను నేనే హెచ్చరించాను. ముస్లిం శాసనసభ్యులను అసెంబ్లీ నుండి బహిష్కరిస్తామని మీ నాయకుడు ఎలా చెప్పగలరు? రాష్ట్రంలోని 33 శాతం జనాభాను ఆయన ఎలా తిరస్కరించగలరు? మీరు మణిపూర్‌ను పరిపాలించలేరు. మీరు బెంగాల్‌ను పరిపాలించాలని కలలు కంటున్నారని మమత ఎద్దేవా చేశారు. శాసనసభ సమావేశాలకు హాజరుకాకుండా సస్పెన్షన్‌కు గురైన రాష్ట్ర ప్రతిపక్ష నాయకుడు సువేందు అధికారి మంగళవారం అసెంబ్లీ వెలుపల విలేకరులతోమాట్లాడుతూ... బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముస్లిం శాసనసభ్యులను అసెంబ్లీ నుండి భౌతికంగా బహిష్కరిస్తామని బెదిరించారు. మమతా బెనర్జీ ప్రభుత్వం ఒక మత పరిపాలన అని... ఇది ముస్లిం లీగ్ రెండవ వెర్షన్ లాగా ప్రవర్తిస్తోందని ఆరోపించారు. బెంగాల్ ప్రజలు ఈసారి వారిని అధికారం నుంచి కూలదోస్తారన్నారు. మమత ప్రసంగిస్తున్నంత సేపు బీజేపీ శాసనసభ్యులు నినాదాలు చేస్తూనే ఉన్నారు. ఆ తరువాత సభ నుంచి వాకౌట్ చేశారు. కాగా, కాంగ్రెస్ నాయకుడు ఇమ్రాన్ అలీ రాంజ్ అధికారి వ్యాఖ్యలపై ఉత్తర దినాజ్‌పూర్‌లోని చకులియా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

## వాస్తవాల వక్రీకరణ

### ధర్మేంద్ర ప్రధాన్‌పై కనిమొళి ఆగ్రహం

చెన్నై: కొన్నిరోజులుగా త్రిభాషా విధానంపై కేంద్ర ప్రభుత్వానికి, తమిళనాడు ప్రభుత్వానికి మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో కేంద్ర విద్యాశాఖామంత్రి ధర్మేంద్ర ప్రధాన్...డీఎంకే ఎంపీలు అనాగరికులు, అప్రజాస్వామికులని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అలాగే పీఎం శ్రీ పథకం విషయంలో తమిళనాడు అంగీకరించి ఆపై వెనక్కి తగ్గిందని ఆయన వ్యాఖ్యానించారు. దీనికి సంబంధించి తమిళనాడు సమ్మతించినట్లు గతేడాది మార్చి 15వ తేదీ నాటి లేఖను ధర్మేంద్ర విడుదల చేశారు. ధర్మేంద్ర లేఖపై బుధవారం డీఎంకే ఎంపీ కనిమొళి స్పందించారు. పీఎం శ్రీ పథకానికి సంబంధించి తమిళనాడు ప్రభుత్వం లేఖను ఆమె ఎక్స్ పోస్టులో షేర్ చేశారు. ఈ లేఖలో జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ)లో భాగంగా కేంద్ర ప్రభుత్వం తెచ్చిన పీఎం శ్రీ పథకం అమలుకు సంబంధించి తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వ నేతృత్వంలోని కమిటీ సిఫార్సుల ఆధారంగా మాత్రమే అంగీకరిస్తుందని, కేంద్ర ప్రభుత్వ సిఫార్సుల ఆధారంగా కాదని ఈ లేఖ స్పష్టంగా పేర్కొందని కనిమొళి తెలిపారు. త్రిభాషా విధానం, ఎన్‌ఈపీని పూర్తిగా అంగీకరించినట్లు తాము ఎక్కడా ఈ లేఖలో ప్రస్తావించలేదన్నారు. తమిళనాడుకు ఏది ఆమోదయోగ్యమో తాము దాన్నే అంగీకరిస్తామని, ఈ విషయంలో ఎక్కువ కాదు... తక్కువ కాదని, ధర్మేంద్ర ప్రధాన్ వాస్తవాలను వక్రీకరించడం ఆపాలని ఆమె ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.

## పునర్విభజన పోరుకు కర్నాటక మద్దతు

బెంగళూరు: పునర్విభజన కారణంగా పార్లమెంటులో దక్షిణాది రాష్ట్రాలకు స్థానాలు తగ్గుతాయన్న క్రమంలో తమిళనాడు నాయకత్వంలో సాగుతున్న బహుళ రాష్ట్ర పోరు బరిలోకి కర్నాటక ప్రవేశించింది. తమిళనాడు నేతృత్వ సంకీర్ణంలో భాగస్వామ్యం అయ్యేందుకు కర్నాటక సీఎం సిద్దరామయ్య అంగీకారం తెలిపారు. తమిళనాడు అటవీ మంత్రి కె.పొన్ముడి, రాజ్యసభ సభ్యుడు ఎంఎం అబ్దుల్లాతో భేటీ సందర్భంగా ఆయన ఈ పోరాటానికి మద్దతు ప్రకటించారు. కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పశ్చిమ బెంగాల్, ఒడిశా, పంజాబ్‌తో కలిసి తమిళనాడు ఏర్పాటు చేసిన సంయుక్త కార్యాచరణ కమిటీ (జేఏసీ)లో భాగస్వామ్యం కావాలని సిద్దరామయ్యను ప్రతినిధులు కోరగా ఆయన అంగీకరించారు. ఆపై ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తోనూ ప్రతినిధులు భేటీ అయ్యారు. సిద్దరాయమ్య కార్యాలయం విడుదల చేసిన ప్రకటన ప్రకారం తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌తో ఈ విషయంపై సిద్దరామయ్య చర్చించారు. రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగించేలా కేంద్రం తీసుకునే ఎలంటి చర్యనైనా మరో ఆలోచన లేకుండా కర్నాటక ఖండిస్తుందని సీఎం చెప్పారని ప్రకటన తెలిపింది. ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తూ, ఫెడరలిజం స్ఫూర్తికి భంగం కలిగిస్తే ప్రతిఘటిస్తామని ఆయన చెప్పినట్లు వెల్లడించింది. ఈనెల 22న తమిళనాడు రాజధాని చెన్నైలో స్టాలిన్ అధ్యక్షతన జేఏసీ తొలి సమావేశం జరగనుంది. ఇదే క్రమంలో సిద్దరామయ్యకు స్టాలిన్ ఓ లేఖ పంపారు. అందులో పునర్విభజనపై తమ వైఖరిని స్పష్టం చేస్తూ... రాష్ట్రాల ఆందోళనలను కేంద్రం ఏ మాత్రం పట్టించుకోవడం లేదని, వారికి స్పష్టత ఇచ్చే చిత్తశుద్ధి సర్కార్‌కు లేదన్నారు. జనభా నియంత్రణ, జాతీయ అభివృద్ధి లక్ష్యాలకు కట్టుబడిన మనం ఇందుకోసం మూల్యం చెల్లించుకోవాల్సి రావడం చాలా అన్యాయమన్నారు. దీనిని ప్రతిఘటించాలని స్టాలిన్ పిలుపునిచ్చారు. సిద్దరామయ్య కూడా ఏకీభవిస్తూ పోరాటంలో కలిసి వస్తామని స్టాలిన్‌తో చెప్పారని ప్రకటన వెల్లడించారు.

## నేరస్తులకు నితీశ్ రక్షణ: తేజస్వి

పాట్నా : బీహార్ రాష్ట్రంలో నేరస్తులకు ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ రక్షణ కల్పిస్తున్నారని ఆర్‌జేడీ నేత, మాజీ ఉపముఖ్యమంత్రి తేజస్వీయాదవ్ విమర్శించారు. నితీశ్ హయాంలో రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని, నేరాలు పెరిగిపోతున్నాయని తేజస్వి ఆరోపించారు. ఇటీవల బీహార్‌లో తనిష్క్ షోరూమ్‌లో దొంతనం జరిగింది. సుమారు 25 కోట్ల రూపాయల బంగారు నగల్ని దోచుకున్నారు. తేజస్వి బుధవారం మీడియాతో మాట్లాడుతూ 'రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని మీరందరూ గమనించే ఉంటారు. నేరస్తులకు అడ్డుఅదుపు లేకుండా పోయింది. దొంగలు రాత్రిపూట మాత్రమే దొంగతనం చేయడం లేదు. పట్టపగలే... అందరూ చూస్తుండగానే వారు దొంగతనాలకి పాల్పడుతున్నారు' అని అన్నారు. ఇటీవల రాష్ట్రంలోని భోజ్‌పూర్, హాజిపూర్ స్కూళ్లకు బాంబు బెదిరింపులు వచ్చాయి. రాష్ట్రంలో నేరాలు పెరిగిపోతున్నాయి. ఇటీవల నితీశ్ కుమార్ సొంత జిల్లా నలందాలో ఒక బాలికను అమానుషంగా హింసించారు. ఆమె పాదాలకు మేకులు దిగగొట్టి పొలాల్లో పడేశారు. ఈ ఘటనపై ప్రభుత్వం స్పందించలేదు. బీహార్‌లో నేరాల రేటు పెరిగిపోతుందని జాతీయ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో గణాంకాలే చెబుతున్నాయని తేజస్వీయాదవ్ వివరించారు. కొన్ని జిల్లా జైళ్లల్లో హింస కారణంగా ఖైదీలు చనిపోతున్నారు. ఈ ఘటనలపై ప్రభుత్వం ఏవిధంగా స్పందించడం లేదు. దీన్నిబట్టి చూస్తే సీఎం నేరస్తుల్ని రక్షిస్తున్నారు. ఆయన హయాంలో చాలామంది నేరస్తులు జైళ్లనుంచి విడుదలయ్యారు. నితీశ్ కుమార్ నేరస్తులకు అనుకూలంగా చట్టాన్ని మారుస్తున్నారని తేజస్వి విమర్శించారు.

## త్రిభాషా సూత్రానికి ఎంపీ సుధామూర్తి మద్దతు

న్యూఢిల్లీ: జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ)లో భాగమైన త్రిభాషా సూత్రం అమలుపై తమిళనాడు-కేంద్ర ప్రభుత్వాల మధ్య తీవ్ర వివాదం కొనసాగుతున్నది. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లోనూ దీనిపై ఎంపీల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. ఈ నేపథ్యంలో రాజ్యసభ ఎంపీ సుధామూర్తి దీనిపై మాట్లాడుతూ... త్రిభాషా సూత్రానికి మద్దతు పలికారు.

ఎక్కువ భాషలు నేర్చుకోవడం పిల్లలకే మంచిదన్నారు. 'ఒక వ్యక్తి అనేక భాషలు నేర్చుకోవాలని సూచిస్తాను. నాకు 7-8 భాషలు వచ్చు. నేర్చుకోవడాన్ని నేను చాలా ఇష్టపడతా. పిల్లలు కూడా దీనివల్ల మంచి ప్రయోజనాలు పొందుతారు' అని సుధామూర్తి అభిప్రాయపడ్డారు. హిందీ వివాదం వేళ ఆమె చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## ఇస్లాం పుట్టక ముందే సంభాల్ ఉంది: యోగి

లక్నో: ఇస్లాం పుట్టకముందే సంభాల్ పట్టణం ఉందని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ చెప్పుకొచ్చారు. సంభాల్ 5 వేల ఏళ్ల క్రితం నాటిదని, హరి విష్ణు ఆలయాన్ని 1526లో ధ్వంసం చేసినట్టు మత గ్రంథాలు చెబుతున్నాయని తెలిపారు. చారిత్రక సత్యానికి ప్రతీక సంభాల్ అని పేర్కొన్నారు. అనేకసార్లు ఈ విషయాన్ని బహిరంగంగానే తాను ప్రకటించానన్నారు. లక్నోలో బుధవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని చూసి తాము గర్విస్తున్నామన్నారు. యావత్ ప్రపంచం ఒకనాటికి సనాతన ధర్మాన్ని అక్కున చేర్చుకుంటుందని చెప్పుకొచ్చారు. 'నేను ఒక యోగిని. అన్ని శాఖలు, మతాలను గౌరవిస్తాను. కానీ ఒకరి ఆరాధనా స్థలాన్ని మరొకరు బలవంతంగా ఆక్రమించుకోవడం, ఇతర విశ్వాసాలను ధ్వంసం చేయడం ఆమోదయోగ్యం కాదు. సంభాల్‌లో 68 యాత్రా ప్రాంతాలు ఉన్నాయి. ఇప్పటి వరకూ 18 ప్రాంతాలను మాత్రమే గుర్తించాం. సంభాల్‌లో శివాలయానికి 56 ఏళ్ల తర్వాత జలాభిషేకం నిర్వహించాం' అని యోగి తెలిపారు. ప్రయాగ్‌రాజ్‌లో ఇటీవల జరిగిన మహాకుంభ్‌ను కాంగ్రెస్ పార్టీ విమర్శించడాన్ని యోగి తప్పుపట్టారు. ఏ మంచి జరిగినా దానిని వ్యతిరేకించడం కాంగ్రెస్‌కు అలవాటేనని అన్నారు. కాంగ్రెస్ అటు కేంద్రంలో ఇటు రాష్ట్రంలో అధికారంలో ఉన్నప్పుడు 1954లో తొలి కుంభమేళా జరిగిందన్నారు. అప్పట్లో 100 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. ఆ తర్వాత ప్రతి కుంభమేళాలోనూ ఇది జరుగుతూనే వచ్చిందన్నారు. అవినీతి, అరాచకాలు చోటుచేసుకున్నాయన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగాలకు తమిళం తప్పనిసరి: మద్రాస్ హైకోర్టు

చెన్నై: కేంద్రం, తమిళనాడు మధ్య జాతీయ విద్యావిధానం అమలుపై వివాదం నెలకొన్న వేళ మద్రాస్ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. తమిళనాడు రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రయత్నించే అభ్యర్థులు తప్పనిసరిగా తమిళం రాయడం, చదవడం నేర్చుకోవాలని మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్ స్పష్టంచేసింది. త్రిభాషా సూత్రం అమలును రాష్ట్రంలోని రాజకీయ, సినీ ప్రముఖులు, ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. తమిళ భాషలో నిర్వహించిన పరీక్షలో విఫలమైనందుకు తనను తమిళనాడు ఎలక్ట్రిసిటీ బోర్డు ఉద్యోగం నుంచి తొలగించిందని ఆరోపిస్తూ ఎం.జయకుమార్ అనే వ్యక్తి మద్రాసు హైకోర్టును ఆశ్రయించాడు. తన తండ్రి నావికాదళంలో పని చేస్తుండడం వల్ల తాను సీబీఎస్‌ఈ పాఠశాలల్లో చదివానని, అందువల్ల తమిళం నేర్చుకోవడానికి వీలుపడలేదని పేర్కొన్నాడు. కాగా న్యాయస్థానం అతడి పిటిషన్‌ను తోసిపుచ్చింది. ప్రభుత్వ ఉద్యోగాలకు తమిళం తప్పనిసరి అని న్యాయస్థానం పేర్కొంది. నిత్యం ప్రజల మధ్య ఉండి పని చేయాల్సిన ప్రభుత్వ ఉద్యోగులకు మాతృభాష అయిన తమిళం తెలియకపోతే రోజూవారీ పనులు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించింది. ఏ రాష్ట్రంలో అయినా ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర భాష వచ్చి ఉండాలని, లేకపోతే వారు తమ విధులు సమర్థవంతంగా నిర్వహించలేరని ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ కేసును ఆరు నెలలపాటు వాయిదా వేస్తున్నట్లు పేర్కొంది. రాష్ట్రంలో భాషా యుద్ధం తీవ్రమవుతున్న సమయంలో కోర్టు ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. జాతీయ విద్యావిధానం(ఎన్‌ఈపీ)లో భాగమైన త్రిభాషా సూత్రంలో భాగంగా దేశవ్యాప్తంగా విద్యార్థులు హిందీ, ఇంగ్లీషు, ఒక స్థానిక భాష నేర్చుకోవాలని కేంద్రం పేర్కొంది. అయితే తాము ద్విభాషా సూత్రానికే కట్టుబడి ఉంటామని, హిందీని బలవంతంగా రుద్దితే ఊరుకోబోమని డీఎంకే ప్రభుత్వం స్పష్టంచేస్తోంది. తమిళభాషకు, రాష్ట్రానికి, ప్రజలకు నష్టం కలిగించే చర్యలను అనుమతించబోమని స్టాలిన్ పేర్కొన్నారు. దీనిపై కొన్ని రోజులుగా కేంద్రం, తమిళనాడు రాష్ట్రానికి మధ్య మాటల యుద్ధం నడుస్తోంది.

## వేగంగా పిల్లల్ని కనండి: ఉదయనిధి స్టాలిన్

చెన్నై: లోక్‌సభ నియోజకవర్గ పునర్విభజన విషయంలో తమిళనాడు కొంతకాలంగా కేంద్రంపై యుద్ధం చేస్తోంది. జనాభా ప్రాతిపదికన మాత్రమే నియోజకవర్గాలను నిర్ణయిస్తే... రాష్ట్రంలో లోక్‌సభ స్థానాలు తగ్గుతాయని నాయకులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ నేపథ్యంలో తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పుట్టిన రోజు (మార్చి 1న) వేడుకల్లో భాగంగా ఉదయనిధి 72 మంది జంటలకు సామూహిక వివాహాలు జరిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొత్తగా పెళ్లయిన జంటలు అత్యవసరంగా పిల్లల్ని కనాలని కోరారు. అయితే ఎక్కువ మందిని మాత్రం కనొద్దని సూచించారు. '2026 తర్వాత అమల్లోకి వచ్చే డీలిమిటేషన్ ప్రక్రియ జనాభా ఆధారంగా పార్లమెంటరీ నియోజకవర్గాలను తిరిగి రూపొందిస్తుంది. రాష్ట్రాల్లోని జనాభాకు సరైన ప్రాతినిధ్యం లభించేలా పార్లమెంటులో, అసెంబ్లీల్లో సీట్లుండేలా చూసే ప్రక్రియలో ఎక్కువ సీట్లు ఇవ్వాలంటే... కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు జనాభా సంఖ్యను పర్యవేక్షిస్తోంది. తమిళనాడు సహా దక్షిణాది రాష్ట్రాలు దశాబ్దాలుగా జననాల రేటును నియంత్రిస్తూ వస్తున్నాయి. దీని మూలంగా పార్లమెంటరీ ప్రాతినిధ్యంలో వాటి వాటా తగ్గే అవకాశం ఉంది' అని స్టాలిన్ ఆందోళన వ్యక్తం చేశారు. తమిళనాడు నుంచి 39 మంది ఎంపీలు ఉన్నారని, రాష్ట్ర జనాభా ఏడు కోట్లు కాబట్టి... డీలిమిటేషన్ ప్రక్రియ అమల్లోకి వస్తే ఆ సంఖ్య 31కి తగ్గుతుందని ఆయన అన్నారు. అయితే ఎక్కువ జనాభా ఉన్న ఉత్తరాది రాష్ట్రాలు మాత్రం 100కు పైగా సీట్లు పొందే అవకాశం ఉందని పేర్కొన్నారు. దీని ప్రకారం చూస్తే రాష్ట్ర జనాభా కూడా అధికంగా ఉండాలని ఉపముఖ్యమంత్రి పేర్కొన్నారు.

### జాబితా వివాదం వేళ...

# ఓటరు ఐడీతో ఆధార్ అనుసంధానం

**కేంద్ర ఎన్నికల సంఘం యోచన**

న్యూఢిల్లీ: ఓటర్లను సక్రమంగా గుర్తించేందుకు ఓటర్ల జాబితాతో ఆధార్ నంబర్లను అనుసంధానం చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం అధికారులను ఆదేశించింది. ఓటర్ల జాబితా డేటాతో ఆధార్ నంబర్లను అనుసంధానం చేయడానికి అన్ని ప్రయత్నాలు చేయాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని ప్రధాన ఎన్నికల అధికారులకు (సీఈఓ) పంపిన నోట్లో పేర్కొంది. మార్చి 4న జరిగిన సీఈఓల సదస్సులో సీఈసీ ప్రారంభ వ్యాఖ్యలు అనే శీర్షికతో రూపొందించిన పత్రాల్లో ఈ ఆదేశాలు పొందుపరిచారు.

ఓటర్లను సక్రమంగా గుర్తించడానికి, అవసరమైన కమ్యూనికేషన్ కోసం ఆధార్, మొబైల్ నంబర్లతో అనుసంధానం చేయడానికి అన్ని ప్రయత్నాలు చేయాలని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పేర్కొన్నారు. ఎన్నికలను జాతీయ సేవ దిశగా తొలి అడుగుగా అభివర్ణించిన జ్ఞానేశ్ కుమార్... ఈసీఐ తన రాజ్యాంగ బాధ్యతలు నిర్వర్తించడానికి ఏ మాత్రం వెనకడుగు వేయదని స్పష్టం చేశారు. జనన, మరణాల నమోదు అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఓటర్ల జాబితాను ఎప్పటికప్పుడు కొత్తగా రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఇంటింటి సర్వేలు నిర్వహించేటప్పుడు బూత్ లెవల్ అధికారులందరూ రాజ్యాంగం ప్రకారం 18 ఏళ్లు పైబడిన భారతీయ పౌరులను తప్పనిసరిగా ఓటర్లుగా నమోదు చేసుకునేలా చూడాలని సీఈసీ ఆదేశించింది.

అయితే ఆధార్ అనుసంధానం తప్పనిసరి కాదన్న ఈసీఐ గత వైఖరికి విరుద్ధంగా ఈ ఆదేశాలు కనిపిస్తున్నాయి. 1960 ఓటర్ల నమోదు నిబంధనలకు 2022 సవరణకు సంబంధించిన కేసును విచారిస్తున్న సుప్రీంకోర్టుకు ఆధార్ అనుసంధానం కాదని ఎన్నికల సంఘం నివేదించింది. ఓటర్ల నమోదు (సవరణ) నిబంధనలు 2022లోని రూల్ 26 బి ప్రకారం ఓటర్ల జాబితాలో జాబితా చేయబడిన వ్యక్తి ఫారం 6 బిని ఉపయోగించి 'తన ఆధార్ సంఖ్యను' రిజిస్ట్రేషన్ అధికారికి తెలియజేయవచ్చని న్యాయ శాఖమంత్రి కిరణ్ రిజిజు ఇంతకు ముందు పార్లమెంటుకు తెలిపారు. ఆధార్ ఇవ్వడం ఐచ్ఛికమని, ఆధార్ నంబర్ లేని ఓటర్లు ఫారం 6బిలో ఇచ్చిన విధంగా ఇతర ఐచ్ఛిక పత్రాలు

అందించవచ్చని రిజిజు స్పష్టం చేశారు. ఈసీఐ దరఖాస్తు ఫారంలో సవరణలు కోరుతూ తెలంగాణకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత జి.నిరంజన్ దాఖలు చేసిన పిటిషన్‌పై స్పందించిన అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీం కోర్టు ధర్మాసనం ఈ కేసును విచారించింది. ఆధార్ తప్పనిసరి కాదని, ఈ స్థితిని ప్రతిబింబించేలా ఓటర్ల జాబితా ఫారాల్లో తగిన మార్పులు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామని ఈసీఐ పేర్కొంది. అయితే 2022 సవరణలను నోటిఫై చేసినప్పటి నుండి ఫారాలు మారలేదు. ఓటరు జాబితాకు ఆధార్‌ను అనుసంధానం చేయడం వల్ల ఒకే ఓటరుతో బహుళ ఓటరు ఫోటో గుర్తింపు కార్డు (ఎపిక్) నంబర్లను తొలగించడానికి మార్గం సుగమం అవుతుందని అధికార వర్గాలు తెలిపాయి. ఈ సమస్య కొంతకాలంగా ఈసీఐని ఇబ్బంది పెడుతోందని పేర్కొన్నాయి. డూప్లికేట్ ఈపీఐసీల ద్వారా మోసం జరుగుతోందని పశ్చిమబెంగాల్ అధికార తృణమూల్ కాంగ్రెస్ ఆరోపించడంతో ఓటరు జాబితా పవిత్రత, నమోదు చర్చనీయాంశంగా మారింది. డూప్లికేషన్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సీఈఓలను ఎన్నికల సంఘం ఆదేశించింది. కాగా, ఓటర్ల జాబితా ప్రక్షాళనలో పారదర్శకత పాటించాలని, డూప్లికేట్ ఓటరు ఫోటో గుర్తింపు కార్డు నంబర్లను తొలగించాలని కోరుతూ మూడు రాజకీయ పార్టీలు ఈసీఐకి వినతిపత్రాలు సమర్పించాయి. వివిధ స్థాయిల్లో అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై ఏప్రిల్ 30లోగా సలహాలు ఇవ్వాలని ఈసీఐ అన్ని పార్టీలను కోరింది. పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ లేవనెత్తే వరకు ఏళ్ల తరబడి కమిషన్ పరిష్కరించని డూప్లికేట్ ఎపిక్ నంబర్ల అంశాన్ని టీఎంసీ తన వినతిపత్రంలో వెల్లడించింది.

## రన్యారావును నిద్ర పోనివ్వడం లేదు

### కోర్టులో న్యాయవాది వాదనలు

బెంగళూరు: బంగారం స్మగ్లింగ్ కేసులో అరెస్టయిన కన్నడ నటి రన్యారావు బెయిల్‌పై ప్రత్యేక కోర్టులో విచారణ జరిగింది. విచారణ సందర్భంగా నటి తరపు న్యాయవాది కీలక విషయాలను కోర్టుకు వెల్లడించారు. విచారణ పేరుతో డీఆర్ఐ అధికారులు ఆమెను నిద్ర పోనివ్వడం లేదని న్యాయవాది తెలిపారు. అరెస్టయిన సమయంలో తనకు ఉన్న హక్కుల గురించి ఆమెకు పూర్తిగా తెలియదని వాదించారు. విమానాశ్రయం వద్ద రన్యారావును డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు అదుపులోకి తీసుకునే సమయంలో ప్రొటోకాల్ ఉల్లంఘనలు జరిగాయని పేర్కొన్నారు. అధికారులకు ఆమె ఇచ్చిన వాంగ్మూలం తను స్వతహాగా ఇచ్చింది కాదన్నారు. విచారణ పేరుతో ఆమెను సరిగా నిద్రపోనివ్వడం లేదని తెలిపారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని తన క్లయింట్‌కు బెయిల్ మంజూరు చేయాల్సిందిగా కోర్టును కోరారు. ఇటీవల దుబాయ్ నుంచి బెంగళూరుకు 14.2 కిలోల బంగారంతో వచ్చిన ఆమెను విమానాశ్రయం నుంచి నిష్క్రమించే చివరి నిమిషంలో అధికారులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. తరచూ దుబాయ్‌కు వెళ్లడం.. వెళ్లిన ప్రతిసారీ ఒకే రకమైన దుస్తులు ధరించడంతో అనుమానం వచ్చి ఆమెపై నిఘా పెట్టగా ఈ స్మగ్లింగ్ వ్యవహారం బయటపడింది.

# విశాలాంధ్ర హైదరాబాద్

# వ్యవసాయ అభివృద్ధికి దిశానిర్దేశం : మంత్రి ఉత్తమ్

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణా రాష్ట్రంలో వ్యవసాయ అభివృద్ధికి గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ ప్రసంగం దిశా నిర్దేశం చేసిందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రైతాంగానికి వెన్నుదన్నుగా నిలబడిందనే విషయం గవర్నర్ ప్రసంగంలో స్పష్టం అయ్యిందని ఆయన చెప్పారు. గవర్నర్ ప్రసంగం ఆసాంతం రాష్ట్రంలో వ్యవసాయ రంగం, నీటిపారుదల రంగం రాష్ట్రంలో సాదించిన విజయాలను ప్రతిబింభిస్తోందని ఆయన గవర్నర్‌పై ప్రశంశల జల్లు కురిపించారు. బుధవారం ఉదయం రాష్ట్ర శాసనసభలో గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ ఉభయ సభలను ఉద్దేశించి చేసిన ప్రసంగంపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందిస్తూ యావత్ భారతదేశంలో ముందెన్నడూ లేని విదంగా ఏక కాలంలో రెండు లక్షల రుణమాఫీ చేయడం ప్రభుత్వం సాధించిన విజయంగా ఆయన అభివర్ణించారు. 25.35 లక్షల మందికి 20,616.89 కోట్ల రుణాలను మాఫీ చేయడం చారిత్రాత్మక మైన సందర్భమన్నారు. ఈ రుణమాఫీతో రైతులకు ఆర్థిక భద్రత కల్పించినట్లైందన్నారు. అదే సమయంలో ఇందిరమ్మ ఆత్మీయ రైతుభరోసా పథకం కింద సంవత్సరానికి ఎకరాకు రూ.12000 కు పెంచి ఆధునిక సాంకేతిక పద్ధతులను రైతులు వినియోగించుకునేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. అంతే గాకుండా 566 రైతు వేదికలను ఆధునికరించి ఆధునిక కమ్యూనికేషన్ వ్యవస్థతో రైతులతో నేరుగా మాట్లాడేలా రైతునేస్తం డిజిటల్ వేదికను రూపొందించిందన్న విషయాన్ని గవర్నర్ ప్రస్తావించడం వ్యవసాయ రంగంలో రాష్ట్ర ప్రభుత్వం సాధించిన విజయాలకు అద్దం పడుతుందన్నారు. అన్నింటికీ మించి యవత్ భారతదేశానికే అన్నం పెట్టే రాష్ట్రంగా రికార్డు స్థాయిలో 153 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి సంవత్సరం వ్యవధిలో రాష్ట్ర ప్రభుత్వం సాధించిన విజయాలను గవర్నర్ తన ప్రసంగంలో ఉటంకించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. అంతకు మించి సన్నాలను ప్రోత్సాహించేందుకు గాను క్వింటాలు ధాన్యానికి 500 రూపాయల బోనస్ అందించిన తీరును బోనస్ కింద రైతులకు నాలుగు లక్షల 48 వేల మంది రైతులకు 894.88 కోట్లు అందించడంతో పాటు రాష్ట్రంలో ముందెన్నడూ లేని రీతిలో ఖరీఫ్ సీజన్‌లో 8,332 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 10,35,484 లక్షల మంది రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యానికి 12511.76 కోట్లు చెల్లించిన సందర్భాన్ని గవర్నర్ ప్రసంగంలో పేర్కొనడం రైతాంగం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని రుజువు పరుస్తుందన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని మరింత పటిష్టవంతం చేయడానికి గాను రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తెలంగాణా వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ను ఏర్పాటు చేసి రైతాంగానికి ఆధునిక సాంకేతిక పద్ధతులతో సాగు వంటి శాస్త్రీయ పరిశోధనలను అందించడాన్ని గవర్నర్ పేర్కొనడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ధాన్యం దిగుబడిలో సృష్టించిన రికార్డ్ వెనుక ఉన్న నీటిపారుదల రంగం కృషిని ప్రశంశించడంతో పాటు తెలంగాణాకు కాంగ్రెస్ ప్రభుత్వం నదీ జలాల వాటాను సాధించడం పట్ల ఆయన తన ప్రసంగంలో చెప్పడం రాష్ట్ర ప్రభుత్వ సమర్థతకు అద్దం పడుతుందన్నారు. నీటి వివాదాల్లో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తంగా ఉండడంతో పాటు కృష్ణా జలాల వివాదాన్ని ట్రిబ్యునల్-2 ద్వారా పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వ నిరంతరం కృషిని వివరించడం ప్రజా పరిపాలన సాధించిన విజయాలు ప్రతిధ్వనిస్తున్నాయన్నారు. భవిష్యత్ ప్రణాళికల గురించి నీటి సంరక్షణ, పెండింగ్ నీటి పారుదల ప్రాజెక్టుల వేగవంతమైన అమలు, వ్యవసాయ సాంకేతికత ప్రోత్సాహంపై దృష్టి పెట్టినట్లు తెలిపారు. ముఖ్యమైన నీటి పారుదల పథకాలను వేగంగా పూర్తి చేసి, చివరి తీరంలోని రైతులకూ నీటిని అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. అదే సమయంలో, గ్రామీణ చెరువుల పునరుద్ధరణ, డ్రిప్ స్ప్రింక్లర్ నీటి పారుదల విస్తరణ వంటి నీటి నిర్వహణ చర్యల ద్వారా నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన వివరించారు. సాంకేతిక ఆధారిత వ్యవసాయాన్ని ప్రోత్సహించడమూ ప్రభుత్వ ప్రణాళికలో ముఖ్యమైన భాగమని ఆయన తెలిపారు. రిమోట్ సెన్సింగ్, జిఐఎస్ ఆధారిత పంట పర్యవేక్షణ, మరియు మొబైల్ ద్వారా ప్రత్యక్ష వ్యవసాయ సలహా సేవలు రైతులకు ఖచ్చితమైన వ్యవసాయ పద్ధతులను అవలంబించడానికి సహాయపడతాయని పేర్కొన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన రైతు సంక్షేమ కమిషన్ ఈ ఆవిష్కరణలకు నేతృత్వం వహించనుందని, పరిశోధన మరియు అమలుకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించనుందని తెలిపారు. మట్టిశక్తి యాప్‌లు, ఖచ్చితమైన నీటి పారుదల, వాతావరణ అనుకూల వ్యవసాయ విధానాలను సమగ్రంగా అమలు చేయడం ద్వారా, వ్యవసాయాన్ని మరింత సమర్థవంతం, స్థిరమైనది, లాభదాయకమైనదిగా మార్చడం ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. గవర్నర్ ప్రసంగంలో ప్రస్తావించిన కార్యక్రమాలు తెలంగాణ వ్యవసాయ అభివృద్ధికి సమగ్ర రూపకల్పనని ఉత్తమ్ కుమార్ రెడ్డి పునరుద్ఘాటించారు. ఆర్థిక సహాయం, నీటి పారుదల ప్రాజెక్టులు, నీటి నిర్వహణ మరియు ఆధునిక వ్యవసాయ పద్ధతుల ద్వారా ప్రభుత్వం ప్రతి రైతు సంక్షేమాన్ని నిర్ధారించేందుకు కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. రైతుల అభివృద్ధి, స్థిరమైన వ్యవసాయాన్ని తెలంగాణ ప్రగతిలో ప్రధానంగా కొనసాగించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన చెప్పారు.

## మోజాం జాహీ మార్కెట్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : రానున్న మామిడి పండ్ల సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నతాధికారుల సూచనల మేరకు మోజాం జాహీ మార్కెట్‌లో బుధవారం పండ్ల విక్రయదారులు పండ్ల పక్వానికి నిషేధిత కార్బైన్‌ను ఉపయోగిస్తున్నారా అన్న అంశాన్ని పరిశీలించేందుకు ఫుడ్ సేఫ్టీ అధికారులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు, డిజిగ్నేటెడ్ అధికారులు, ఫుడ్ సేఫ్టీ వాహనం, ల్యాబ్ టెక్నీషియన్‌లు, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్, పోలీసు టాస్క్ ఫోర్స్ బృందం పాల్గొన్నారు. ఎం.జె మార్కెట్‌లోని బాలాజీ ఫ్రూట్ మర్చెంట్, కాశ్మీర్ ఫ్రూట్ హౌస్, ఎన్.ఎస్.బి ఫ్రూట్ హౌస్, మదీనా ఫ్రూట్ హౌస్, క్రిస్పీ ఫ్రూట్ హౌస్‌లను తనిఖీ చేశారు. తనిఖీల అనంతరం మోజాం జాహీ మార్కెట్‌లోని పండ్ల వ్యాపారులకు కార్బైడ్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని, పండ్ల పక్వానికి తెలంగాణ ఆహార భద్రత కమిషనర్ సూచనలను పాటించాలని, అదేవిధంగా అనుమతించిన పదార్థాలను మాత్రమే పండ్ల పక్వానికి వినియోగించాలని అవగాహన కల్పించారు. ఆహార భద్రత, ప్రమాణాల చట్టం 2006 ప్రకారం పండ్లను పండించే పద్ధతులను అనుసరించాలని అవగాహన కల్పించారు.

## ఘనంగా ఐద్వా ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర - మల్కాజిగిరి : అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి ఎం. వినోద జెండా ఆవిష్కరణ చేశారు. ఆమె మహిళలను ఉద్దేశించి మాట్లాడుతూ ఆధునిక యుగంలో స్త్రీ ఇప్పటికీ అవస్థలకు గురవుతుందని, దీన్ని మహిళలు తిప్పి కొట్టాలని ఆమె చెప్పారు. మహిళల సౌకర్యాలు అంటే నీళ్లు, ఇల్లు, పిల్లల్లు మాత్రమే కాదని, ఆహార పదార్థాలు చదువు వైద్యం రేషన్ కార్డులు మొదలైన అన్నీ కూడా ప్రభుత్వం మహిళలకు సౌకర్యం కల్పించాలని ఆమె కోరారు. అట్లాగే మల్కాజిగిరి కార్యదర్శి మంగ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల్ని ఓటు బ్యాంకుగా చూస్తుందని, ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పడమే కానీ అమలు చేయడం లేదని, అందుకు ప్రజలు పోరాటాలు చేసి ఆ హక్కులు సాధించుకునే రోజు వచ్చేసిందని ఆమె తెలిపారు. చల్లా లీలావతి సభ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు వంటింటి కుందేళ్లు కారని, హక్కులకై పోరాడే ధీరలని ఆమె తెలిపారు. 1981 మార్చి 12న అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఏర్పడిందని, ఆ సందర్భంగా శ్రామిక నగర్‌లో జండా ఆవిష్కరణ చేసుకొని, మహిళలు గౌరవంగా బ్రతకడం మా హక్కు అని ఇల్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలి, ఆరు గ్యారంటీలు అమలు చేయాలని నినాదాలు ఇచ్చారు. ఈ సమావేశంలో విజయలక్ష్మి, అన్నపూర్ణ, తాహెరా, సత్తెమ్మ, శారద పాల్గొన్నారు.

## ప్రమాదాలు జరగకుండా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని ఉత్తమ నగర్‌లో జనవాసాల మధ్య ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ బుధవారం పరిశీలించారు. గత కొంత కాలంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా షార్ట్ సర్క్యూట్ అవుతుందని, దీంతో భయాందోళన గురవుతున్నామని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు స్పందించిన కార్పొరేటర్ సంఘటన స్థలానికి వెళ్లి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పరిస్థితిని పరిశీలించారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను పక్కకు జరపాలని విద్యుత్ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్, బైరు అనిల్, నర్సింగ్ రావు, మర్రి శీను, నందు, కాలనీవాసులు రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## యువత ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: మార్చ్ 16వ తేదీ అదివారం ఉదయం 6 గంటలకు అల్విన్ కాలనీ 124 డివిజన్ పరిధిలోని తులసి వనం నందు అవని ట్రస్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 5కే రన్ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, గ్రేటర్ హైదరాబాద్ స్టాండింగ్ కమిటీ సభ్యులు వి.జగదీశ్వర్ గౌడ్‌ని, హఫీజ్‌పేట్ కార్పొరేటర్ పూజిత గౌడ్‌ని కలిసి ట్రస్ట్ చైర్మన్ శిరీష సత్తూర్ ఆహ్వానించారు. అలాగే అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఈ నెల 16న అవని ఫౌండేషన్ ఆధ్వర్యంలో తులసి నగర్ నుండి నిర్వహించనున్న 5కే రన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రావలసిందిగా కోరుతూ ఫౌండర్ శిరీష సత్తూర్ బుధవారం బాలనగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కూకట్పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్‌ని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాగిరెడ్డి, తూము వేణు, రాఘవేందర్, సతీష్ గౌడ్, శివ చౌదరి, అజాజ్ తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్టు ఉద్యోగులందరికీ జీవో ఒకటే... అమలులో మాత్రం వ్యత్యాసం

విశాలాంధ్ర - హైదరాబాద్ : గత ప్రభుత్వ హయాంలో తెలంగాణ రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరికీ జీతభత్యాల చెల్లింపుకై తెచ్చిన పిఆర్సి జీవో నెంబర్ 60 ఒక్కటే అయినా ప్రభుత్వ వైద్య రంగంలో మాత్రం అమలులో భారీ వ్యత్యాసంతో జీవో 60 అమలు లోపభూయిష్టంగా మారిపోయిందని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి సురేష్ ఆరోపించారు. బుధవారం జడ్చర్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య,పేషెంట్ కేర్, సెక్యూరిటీ విభాగాల కార్మికుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పి.సురేష్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వ వైద్య రంగంలో కాంట్రాక్టు అవుట్సోర్సింగ్ ఉద్యోగులకు జీవో నెంబర్ 60 ప్రకారం పిఎఫ్ ఈఎస్ఐ కటింగ్స్ పోను 13600 నేరుగా ఉద్యోగుల ఖాతాలో జమవుతున్నాయని కానీ ఇదే రంగంలో పనిచేస్తున్న పారిశుద్ధ్య సెక్యూరిటీ పేషెంట్ కేర్ సూపర్ వైజర్ కార్మికులకు మాత్రం పిఎఫ్ ఈఎస్ఐ కటింగ్స్ పోను కేవలం 12093 రూపాయలు అమలు చేయాలని తప్పుడు ఆదేశాలు జారీ నేపథ్యంలో దాదాపు మూడు సంవత్సరాలుగా నిర్ణయించిన వేతనాల కంటే మరి దారుణంగా పదివేల నుండి 11 వేల వరకు మాత్రమే సంబంధిత ఏజెన్సీలు జీతాలు చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనుక లోపభూయిష్టంగా అమలవుతున్న జీవో 60ని పూర్తిస్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. తాజా కాంగ్రెస్ ప్రభుత్వం ఆసుపత్రి కార్మికులకు కనీస వేతనం 24 వేలకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్మికులకు పెండింగ్లో ఉన్న ఏడు నెలల వేతన బడ్జెట్ విడుదల చేయాలని కార్మికుల దశలవారీగా పోరాటం చేసిన నేపథ్యంలో ప్రభుత్వం ఆరు నెలలకు సరిపడిన వేతన బడ్జెట్ ను విడుదల చేసి నెల పూర్తి కావస్తున్న ఇప్పటివరకు జడ్చర్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి కార్మికులకు మాత్రం వేతనాలు అందకపోవడం బాధాకరమని అన్నారు. బాలనగర్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో కేవలం 9000 రూపాయలు మాత్రమే వేతనాలు చెల్లిస్తున్నారని ఆరు నెలల వేతన బడ్జెట్ తీసుకొని కేవలం కార్మికులకు మూడు నెలల వేతనాలు మాత్రమే సంబంధిత ఏజెన్సీ కాంట్రాక్టర్ చెల్లించడం విడ్డూరంగ ఉందని అన్నారు. జడ్చర్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి శ్రీ శాంతి ఏజెన్సీ, బాలనగర్ సామాజికారిక కేంద్ర వెంకటయ్య ఏజెన్సీ నిర్వాహకులు కార్మికుల పిఎఫ్ ఈఎస్ఐల్ వేతనాల చెల్లింపుల్లో పారదర్శకత లోపించిందని వీరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు వేతనాలు తక్షణమే అందించే విధంగా కృషి చేయాలని లేకపోతే ఆందోళనలకు సిద్ధమవుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి కార్మికులు నరసింహ, పేర్మల్, రాజేష్, మల్లేష్, మన్నెమ్మ, అలివేల, శివ లీల, మంగమ్మ, బాల్ నర్సమ్మ, స్వాతి, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

## విద్యా కమీషన్ చైర్మన్ ప్రభుత్వానికి ఇచ్చిన రిపోర్ట్‌లో వంట కార్మికుల వేతనాల అంశం లేకపోవడం అన్యాయం : ఐటియుసి

విశాలాంధ్ర - హైదరాబాద్ : పాఠశాలలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహిస్తున్న విధానంపై అధ్యయనం చేసే విషయంలో ఆకునూరి మురళి విశ్రాంత ఐఎఎస్ అధికారిని చైర్మన్‌గా వేసిన సందర్భంలో వారు పాఠశాలలను వంట కార్మికుల పరిస్థితులను అధ్యయనం చేసి ప్రభుత్వానికి ఒక రిపోర్టు అందచేయడం జరిగిందనే విషయాన్ని పత్రికల ద్వారా తెలుసుకున్న సందర్భంలో అందులో వంట కార్మికుల వేతనాల విషయం లేకపోవడం వల్ల వంట కార్మికులు ఆందోళన చెందుతున్నారు. తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. కనుక విద్యా కమీషన్ చైర్మన్ మరొక సారి పరిశీలన చేసి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రూ.10 వేల వేతనం విషయంతో పాటు మెనూ చార్జీల విషయంలో కూడా మరొక సారి పరిశీలన చేసి ప్రతీ విద్యార్థికి రూ.25 చెల్లించే విధంగా, వంట బిల్లుల కూడా సకాలంలో అందించే విధంగా ప్రభుత్వానికి సూచనలు సలహాలు అందచేయాలని కోరారు. ప్రస్తుతం అందచేసిన రిపోర్ట్‌లో మెనూ చార్జీల పెంపు విషయం కూడా సరిపోయే విధంగా లేదన్నారు. కనుక చైర్మన్ కమీషన్ సభ్యులు అందరూ వంట కార్మికులకు న్యాయం జరిగే విధంగా కృషి చేయాలని కోరారు.

## జ్ఞానం లేకుండా మాట్లాడుతున్న కేటీఆర్ : మహేష్ గౌడ్

విశాలాంధ్ర - హైదరాబాద్ : శాసనసభలో రాష్ట్ర గవర్నర్ ప్రసంగంపై కేటీఆర్ ఇంగిత జ్ఞానం లేకుండా మాట్లాడారని, గవర్నర్ ప్రసంగంపై కేటీఆర్ వ్యాఖ్యలు శోచనీయమని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. తెలంగాణ తల్లి, రాజీవ్‌గాంధీ విగ్రహాలను టచ్ చేసి చూడండి కేటీఆర్ కాంగ్రెస్ కార్యకర్తలు బట్టలూడదీసి కొడతారని హెచ్చరించారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద విలేకరులతో మాట్లాడుతూ బిఆర్ఎస్ హయాంలో అప్పటి గవర్నర్ తమిళిసై ని అవమానపరిచే విధంగా కేసిఆర్ వ్యవహరించారని, వెంటనే గవర్నర్‌కు కేటీఆర్ తక్షణమే క్షమాపణ చెప్పాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని చూసి కేటీఆర్ ఓర్వలేక దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. ఫాంహౌస్‌లో పడుకుంటే కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధి ఎలా కనిపిస్తుందని ప్రశ్నించారు. ఇంటిగ్రేటెడ్ యూనివర్సిటీ, స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ తీసుకొచ్చామని గుర్తు చేశారు. గవర్నర్ ప్రసంగం ఆసాంతం కాంగ్రెస్ ప్రభుత్వంలో పేద ప్రజలకు అందుతున్న సంక్షేమ ఫలాలను ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. చారిత్రాత్మక కుల సర్వేలో పాల్గొననని కేటీఆర్‌కు సర్వేపై మాట్లాడే అర్హత లేదని తెలిపారు. తెలంగాణ ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టిన కేటీఆర్‌కు బుద్ధి రాలేదని, యువతను మత్తు బానిసలు చేసిన ఘనత బిఆర్ ఎస్ పార్టీకే దక్కుతుందన్నారు. ఇటీవల దుబాయ్‌లో చని పోయిన వ్యక్తి మీకు సన్నిహితుడు కదా కేటీఆర్ అని నిలదీశారు. అధికారం పోయిన కేటీఆర్‌లో ఇసుమంతైనా అహంకారం తగ్గలేదని విమర్శించారు. కేటీఆర్ క్షేత్రస్థాయిలో పర్యటిస్తే కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు తెలుస్తుందన్నారు. కాంగ్రెస్ తల్లి, రాహుల్ గాంధీ తండ్రి విగ్రహాలను ప్యాక్ చేస్తామంటూ కేటీఆర్ అహంకారంతో మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. 15 ఏళ్ల తర్వాత తెలంగాణలో గ్రూప్ 1 పరీక్షలు నిర్వహించిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందని స్పష్టం చేశారు. కాళేశ్వరం, మేడిగడ్డతో కేసిఆర్ కుటుంబం లక్షల కోట్లు దోచుకుందని, కులగణన లలో తప్పుడు లెక్కలు చెబుతున్నామని అంటున్న మీరు సమగ్ర కుటుంబ సర్వే వివరాలను ఎందుకు టేబుల్ చేయలేకపోయారని నిలదీశారు. కేసిఆర్ ఇప్పటికైనా ప్రతి పక్షనేతగా అసెంబ్లీకి రావడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. చారిత్రాత్మక నిర్ణయాలైన కుల గణన, ఎస్సీ వర్గీకరణ చేసినందుకు అభినందించాల్సింది పోయి విమర్శలు చేయడానికి సిగ్గుండాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ ముందుకు సాగుతోందని, మీరు చేసిన అప్పులకే వడ్డీలు చెల్లించడానికి మళ్లీ అప్పులు చేయాల్సిన దుస్థితి దాపురించిందని ధ్వజమెత్తారు. వరంగల్, కామారెడ్డి డిక్లరేషన్ కట్టుబడి హామీలను అమలు చేస్తున్నామని, ఏడాదిలో చరిత్రలో నిలిచిపోయే కుల గణన, ఎస్సీ వర్గీకరణ చేశాం. ఏడాదిలో 55 వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చామన్నారు.

## మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఇన్‌ఛార్జిగా వెలిమినేటి సురేష్

విశాలాంధ్ర - మేడిపల్లి: యువజన కాంగ్రెస్ ఎన్నికలలో మూడోసారి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన వెలిమినేటి సురేష్‌ని యువజన కాంగ్రెస్ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఇన్చార్జిగా నియమించినట్లుగా యువజన కాంగ్రెస్ అఖిల భారత అధ్యక్షులు ఉదయభాను చిబ్ ఆదేశాల మేరకు రాష్ట్ర ఇంచార్జ్ సురభి దివేది, సయ్యద్ ఖలీద్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి నియామక పత్రాన్ని విడుదల చేశారు. వారు మాట్లాడుతూ తనకు ఇచ్చిన ఇంచార్జి బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి బూతు స్థాయిలో కార్యకర్తలను నాయకులను సమన్వయం చేస్తూ కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన ప్రభుత్వ చేపట్టే సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరే విధంగా వారధి లాగా యువజన కాంగ్రెస్ కార్యకర్తలు పనిచేపించడంలో క్రమశిక్షణ కలిగిన కార్యకర్తలను తీర్చిదిద్దడంలో కీలకపాత్ర పోషిస్తానని నా మీద పెట్టిన నమ్మకాన్ని నిర్వర్తిస్తానని తెలియజేశారు. గతంలో కూడా కాంగ్రెస్ పార్టీలో 15 సంవత్సరాల నుండి యువజన కాంగ్రెస్ క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా, నాయకునిగా మండల స్థాయి నుండి నియోజకవర్గ స్థాయిలో పార్లమెంట్ స్థాయిల్లో, రాష్ట్రస్థాయిలో పలు పదవులలో పనిచేసిన అనుభవం ఉంది. గత 2023 శాసనసభ ఎన్నికల్లో భువనగిరి నియోజకవర్గం ఇన్చార్జిగా, 2024 భువనగిరి పార్లమెంట్ ఎన్నికల ఇన్చార్జిగా పనిచేసి ఎన్నికల్లో కీలకపాత్ర పోషించి కాంగ్రెస్ పార్టీ గెలుపుకు కార్యకర్తలను నాయకులను సమన్వయపరిచి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో హామీలను ఇంటింటి ప్రచార కార్యక్రమమును నడిపించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపుకు కృషి చేశారు. డోర్ టు డోర్ ప్రచార కార్యక్రమంలో రాష్ట్రంలో రెండవ స్థానంలోకి రావడం జరిగింది అని తెలియజేశారు.

## ప్రభుత్వ వైఫల్యాలకు గాంధీ కుటుంబం బాధ్యత వహించాలి : కవిత

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలకు గాంధీ కుటుంబం బాధ్యత వహించాలని, హామీల అమలుపై బాధ్యత తీసుకోని సమాధానం చెప్పాలని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. గాంధీ కుటుంబానికి కేవలం ఎన్నికల సమయంలోనే తెలంగాణ గుర్తొస్తుందా? అని నిలదీశారు. గాంధీ కుటుంబం సంతకాలు చేసిన గ్యారెంటీలను చూసే ప్రజలు ఓట్లు వేశారని, స్థానిక కాంగ్రెస్ నాయకులను చూసి ప్రజలు ఓట్లు వేయలేదని, కాబట్టి బాధ్యత తీసుకొని గాంధీ కుటుంబం తెలంగాణ ప్రజలకు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. గరవ్నర్ ప్రసంగంపై స్పందిస్తూ ఎమ్మెల్సీ కవిత విలేకరులతో మాట్లాడారు. గవర్నర్ ప్రసంగంలో కొత్తదనమేమీ లేదని, ఎన్నికల సమయంలో గాంధీ కుటుంబం వచ్చి ఇచ్చిన హామీల అమలుపై ప్రస్తావనే లేదని విమర్శించారు. అబద్ధాలనే మళ్లీ అందమైన భాషలో చెప్పే ప్రయత్నం చేశారని ధ్వజమెత్తారు. ఈ సమావేశాల్లో ప్రభుత్వాన్ని ఎండగడుతామని స్పష్టం చేశారు. రూ. లక్షా 50 వేల కోట్ల అప్పులు చేసినా ఒక్క హామీని కూడా సంపూర్ణంగా అమలు చేయలేదని, దీని మీద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు నెలకు రూ 2500 ఇస్తామన్న హామీని కాంగ్రెస్ పార్టీ విస్మరించిందని, ఈ హామీని అమలు చేయకుండానే మహాలక్ష్మీ పథకం గేమ్ చెంజర్ అని ప్రభుత్వం చెప్పుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. రాష్ట్రాన్ని వెనక్కి నడిపిస్తూ పురోగమిస్తుందని శుద్ధ అబద్ధాలు చెప్పుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వ దివాళాకోరు తనానికి అద్దంపడుతోందని తీవ్రంగా విమర్శించారు. రైతులకు సంపూర్ణంగా రుణ మాఫీ, రైతు భరోసా అమలు చేయకుండానే గొప్పగా అమలు చేశామని చెప్పుకోవడం దారుణమని, ఇది ప్రభుత్వ అసమర్థతను తేటతెల్లం చేస్తున్నదని తెలిపారు.

## విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్స్ ప్రకటించడం అభినందనీయం

విశాలాంధ్ర-బషీర్ బాగ్: విద్య, ఉద్యోగ, రాజకీయల్లో 42 శాతం రిజర్వేషన్స్ కల్పించబోతున్నామని ప్రభుత్వం ప్రకటిండం అభినందనీయ మని ఓబీసీ ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షులు ఆళ్ల రామకృష్ణ అన్నారు. బుధవారం గాంధీభవన్‌లో రాహుల్ గాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా ఓబీసీ ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షులు ఆళ్ల రామకృష్ణ మాట్లాడుతూ రాహుల్ గాంధీ ఆదేశానుసారంగా కులగణన విజయవంతంగా చేయడం హర్షణీయమన్నారు. తెలంగాణ కులగణన దేశానికి ఆదర్శమ న్నారు. ప్రతిపక్షాలు అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నాయని మండిపడ్డారు. దేశంలో జన గణనలో కులగణన చేయటానికి బిజెపి ప్రభుత్వానికి ఇష్టం లేదని గత ఐదు సంవత్సరాలుగా తాత్సారం చేస్తూ దేశానికి ఎంతో అన్యాయం చేస్తుందని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో స్థానిక ఎన్నికల్లో 34శాతం ఉన్న బీసీ రిజర్వేషన్లను 18 శాతానికి కుదించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారం పోయిన తర్వాత కెసిఆర్ కుటుంబం బీసీల జపం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ . రెండు లక్షల రుణమాఫీ, రైతు భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, దాదాపు 55 లక్షల మంది పేదవారికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, 500లకే గ్యాస్ సిలిండర్, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, డ్వాక్రా సంఘాలకు సబ్సిడీ లోన్లు ఇస్తుందని తెలిపారు. మురళీధర్ పోందర బుద్ధ శ్రీరాములు ఉదయపాత్రొ ఉమాపతి, బృందావన్ నాయక్, చిట్టూరి వేణు పాల్గొన్నారు.

## శోభా రాజుచే ఉచిత అన్నమయ్య కీర్తనల శిక్షణా శిబిరం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: అన్నమాచార్య భావనా వాహిని సంస్థ గత 46 సంవత్సరాలుగా అన్నమయ్య కీర్తనల ప్రచారానికి నిర్విరామంగా కృషి చేస్తూనే ఉంది. పద్మశ్రీ డా. శోభారాజు ఆధ్వర్యంలో ప్రతిసంవత్సరం ఎన్నో వినూత్న కార్యక్రమాలు చేస్తున్నారు. అన్నమాచార్య సంకీర్తనల ప్రచారమే లక్ష్యంగా తన ముందుకు సాగే శోభారాజు లాంటి వారి వద్ద కీర్తనలు నేర్చుకోవడం ఎంతో గొప్ప విషయం. నేర్చుకోవడం యోగం నేర్పించడమే భోగం అనే నినాదంతో సాగే వేసవి వెన్నెల ఎంత ఆదరణ పొందిందో అందరికీ తెలిసిందే. ఇపుడు అన్నమాచార్య సంకీర్తనలు నేర్పే మరో బృహత్తర కార్యక్రమం నిర్వహిస్తున్నారు. వయసుతో నిమిత్తం లేకుండా, సంగీత పరిజ్ఞానం లేకుండా, గాత్రం ఎలా ఉన్నా ఎవరైనా కీర్తనలు నేర్చుకోవచ్చు. ఈ సంవత్సరం మార్చి 19 నుండి మార్చి 25 వరకు ప్రతిరోజు సాయంత్రం 6 గం.ల నుండి 7:30 గం.ల వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. ఆసక్తి ఉన్నవారు, సౌజన్య - 9550129946/ రాజు రాజేశ్వరి - 9441276825 / రమణ - 9848024042 నంబర్లను సంప్రదించి తప్పని సరిగా తమ పేర్లు నమోదు చేసుకొనగలరు. ఈ విశేషాలను అందరికీ తెలియజేసి, మరింతమంది విద్యార్థుల రాకకు కారణ భూతులవ్వాలని కోరారు.

### కల్లుగీత ఆర్థిక సహకార సంస్థకు

# నీరా కేఫ్, ఆస్తులు బదిలీ

### మంత్రి పొన్నం ప్రభాకర్

**విశాలాంధ్ర - హైదరాబాద్ :** టూరిజం శాఖ పరిధిలో ఉన్న నీరా కేఫ్, దాని ఆస్తులను తెలంగాణ కల్లు గీత ఆర్థిక సహకార సంస్థకు బదిలీ చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. డా. బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో దీనికి సంబంధించిన ఒప్పందపత్రంపై పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సంతకాలు చేశారు. ఇప్పటి దాకా టూరిజం శాఖ పరిధిలో ఉన్న నీరాకేఫ్ ఇక నుండి కల్లు గీతా ఆర్థిక సహకార సంస్థ ఆధ్వర్యంలో నడవనుందన్నారు.

నీరాకేఫ్ ను టాడీ టాపర్ ఫెడరేషన్‌కు అప్పగించడంతో గౌడ సంఘాలు మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావుకు కృతజ్ఞతలు తెలిపారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఈ ప్రక్రియ పూర్తి కావడంతో వారు హర్షం వ్యక్తం చేశారు.

**విద్యావ్యవస్థలో గౌరవింపబడే వృత్తి ఆచార్య దేవోభవ...**

తల్లిదండ్రులతో సమానంగా మాతృదేవో భవన్ పితృదేవో భవన్ ఆచార్య దేవోభవ అని అధ్యాపక వృత్తిలో చేరుతున్న మీ అందరికీ తెలంగాణ ప్రభుత్వం పక్షాన అభినందనలు అంటూ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం రవీంద్ర భారతిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి తెలంగాణ ప్రజా పాలనకు నాయకత్వం వహించి ప్రభుత్వం ఏర్పడిన మొదటి రోజు నుంచి విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావడానికి అనేక రకాల చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. తాను ఓ విద్యార్థి నాయకుడిగా మీ ముందు మాట్లాడుతున్న గత పది సంవత్సరాలుగా విద్య వ్యవస్థ నిర్లక్ష్యానికి గురైందన్నారు. నియామకాలు లేక కనీసం యూనివర్సిటీలకు వైస్ ఛాన్సలర్‌లను నియమించలేని పరిస్థితి నుండి మీ అందరి ఆశీర్వాదంతో ఏర్పడిన ఈ ప్రభుత్వం అనేక సమస్యలను తొలగించిందని పేర్కొన్నారు. మొదటగా అధ్యాపక వర్గానికి అసహనాన్ని తొలగించి ప్రమోషన్లు, వారికి సంబంధించిన బదిలీలు చేపట్టి విద్యావ్యవస్థలో ప్రాథమిక స్థాయిలో నుండి మార్పులు చేపట్టామన్నారు. వైస్ ఛాన్సలర్‌లా నియామకం ప్రొఫెసర్‌ల వయస్సు పెంచడం, ప్రభుత్వ కాలేజీలను బలోపేతం చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యా వ్యవస్థ బాగుండాలని అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. హాస్టల్ విద్యార్థులకు కాస్మోటిక్ మెస్ ఛార్జీలు పెంచడంతో పాటు 55 యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్‌కి 200 కోట్ల చొప్పున నిధులు మంజూరు చేశారని గుర్తు చేశారు. ఈ పవిత్రమైన వస్తున్న అధ్యాపక వర్గానికి ప్రభుత్వ సంకల్పాన్ని ఆలోచించి భవిష్యత్తులో ప్రభుత్వ సంస్థల్లో చదువుకుంటే గౌరవం అనే విధంగా నియామక పత్రాలు పొందుతున్న అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

**విశాలాంధ్ర - శేరిలింగంపల్లి:** మాదాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్ ప్లాట్స్ కాలనీకి చెందిన షాహిద బేగంకి అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకొనగా ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన 2 లక్షల రూపాయల ఆర్థిక సహాయానికి సంబంధించిన మంజూరి పత్రాన్ని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ బాధిత కుటుంబానికి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరమన్నారు. ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని పునరుద్ఘాటించారు. అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదని, అనారోగ్యంకు గురై ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు, అభాగ్యులకు అండగా సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా నిస్తుందని తెలియచేశారు. ఈ సందర్భంగా వైద్య చికిత్సకి సహకారం అందించిన ఆరెకపూడి గాంధీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నాము అని బాధితుల కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎండీ ఇబ్రహీం, మహమ్మద్ బేగ్, పరుశరాం తదితరులు పాల్గొన్నారు.

### బోడుప్పల్ మున్సిపల్ కార్యాలయం ముందు

## జనసేన పార్టీ నాయకుల ధర్నా

**విశాలాంధ్ర - మేడిపల్లి:** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో తెలంగాణ జనసేన పార్టీ ఇంచార్జ్ శంకర్ గౌడ్, ఉపాధ్యక్షులు మహేందర్ రెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ ఇన్చార్జ్ రాజలింగం తెలంగాణ రాష్ట్ర నాయకులు దామోదర్ రెడ్డిల సూచనల మేరకు బుధవారం ఉదయం బోడుప్పల్ మున్సిపల్ కార్యాలయం ముందు జనసేన నాయకుడు వంగరి సాయికుమార్ ఆధ్వర్యంలో జనసేన నాయకుల ధర్నా చేపట్టారు. మార్చి 14 జనసేన ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఇందిరానగర్, అంబేద్కర్ నగర్ ప్రాంతంలో జనసేన పార్టీ బ్యానర్లు ఏర్పాటు చేసి ఆవిర్భావ వేడుకలు జరుగుతుంటే, రెండు రోజులకే జనసేన బ్యానర్లు కాంగ్రెస్ నాయకులు తొలగించాలని ఆందోళన చేపట్టిన జనసేన శ్రేణులు. ఇందిరానగర్ ప్రాంతం నుండి బోడుప్పల్ మున్సిపల్ కార్యాలయం వరకు జనసేన శ్రేణులు బైక్ ర్యాలీతో వచ్చి, మున్సిపల్ కార్పొరేషన్ ముందు నిరసన ధర్నా చేపట్టారు. తమ బ్యానర్లు యధావిధిగా ఏర్పాటు

చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బోడుప్పల్ జనసేన పార్టీ నాయకులు వంగరి సాయికుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు కక్షగట్టి బ్యానర్లు తొలగించారు, యధావిధిగా మా జనసేన పార్టీ బ్యానర్లు ఉండాలి. రాష్ట్రంలో కాంగ్రెస్ అరాచక పాలన కొనసాగుతుంది. జనసేన బ్యానర్ యధావిధిగా లేనట్లయితే అనేక నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఇదే విషయమై బోడుప్పల్ మున్సిపల్ కార్యాలయంలో అడిషనల్ కమిషనర్‌కు చెప్పడం జరిగిందన్నారు. దీనిపై ఆరా తీసి సమాచారం ఇస్తానని అధికారి, తెలిపినట్లు వంగరి సాయికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వీర మహిళ వెంకటలక్ష్మి, ఎస్ఆర్ వల్లి, వెంకట చారి, బిట్ల రమేష్, మల్లేష్, మధు, గిరి తదితర జనసేన కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

## జర్నలిస్టుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

**విశాలాంధ్ర - షాద్ నగర్,రూరల్:** జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని టీయూడబ్ల్యూజే ఐజేయు మఫీషియల్ వెల్ఫేర్ కమిటీ కన్వీనర్ గుడిపల్లి శ్రీనివాస్ అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్‌లో టీయూడబ్ల్యూజే (ఐజేయు) ముఖ్య నాయకుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. రంగారెడ్డి జిల్లా నూతన కార్యవర్గంలో షాద్‌నగర్ జర్నలిస్టులకు ఉన్నతమైన పదవులు రావడంతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు టీయూడబ్ల్యూజే నిరంతర పోరాటం చేస్తుందని వివరించారు. టీయూడబ్ల్యూజే యూనియన్‌లో ఉన్న జర్నలిస్టులందరికీ అండగా ఉంటుందని తెలిపారు. ఇక్కడ ఏ సమస్య వచ్చినా జర్నలిస్టులను ఆదుకునేందుకు టియుడబ్ల్యూజే యూనియన్ సిద్ధంగా ఉంటుందని పేర్కొన్నారు. త్వరలోనే మండల స్థాయిలో నూతన కమిటీలను ఏర్పాటు చేయడంతో పాటు షాద్‌నగర్ డివిజన్ స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసి నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. యూనియన్ పెద్దలతో ఈ అంశాలపై చర్చించి తగిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. టియుడబ్ల్యూజె యూనియన్ ప్రభుత్వంతో కలిసి పని చేస్తున్నప్పటికీ జర్నలిస్టుల సమస్యలపై పోరాటాలు చేసేందుకు ఎల్లప్పుడూ ముందుంటుందని వివరించారు. సభ్యత్వం చేసిన జర్నలిస్టులందరికీ ఐదు లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించడం ఎంతో అభినందనీయమని అన్నారు. ఇందుకు మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కుమారుడు కార్తీక్ రెడ్డి ముందుకు వచ్చి తోడ్పాటున అందించడం గర్వించదగ్గ విషయమని పేర్కొన్నారు.

**జిల్లా కార్యవర్గంలో షాద్‌నగర్‌కు మొదటి ప్రాధాన్యత...**

రంగారెడ్డి జిల్లా నూతన కార్యవర్గంలో షాద్ నగర్ కు మొదటి ప్రాధాన్యత లభించింది. రంగారెడ్డి జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులుగా చెక్కల శ్రీశైలం, సంయుక్త కార్యదర్శిగా రాఘవేందర్ యాదవ్, ప్రింట్ మీడియా ఉపాధ్యక్షులుగా కొనియాల భాస్కర్, కార్యదర్శిగా రమేష్, ఈసీ మెంబర్‌గా ఇలియాస్ ను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన సభ్యులను పూలమాలలు శాలువాలతో ఘనంగా సత్కరించారు.

జర్నలిస్టుల సమస్యలపై పోరాటాలు చేయడంతో పాటు హక్కుల సాధనకు కృషి చేసేందుకు తామందరం సిద్ధంగా ఉన్నట్లు నూతన సభ్యులు తెలిపారు. అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలతో పాటు హెల్త్ కార్డులను ఇప్పించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు ఫెరోస్ ఖాన్, నరసింహ, యాదగిరి, నూర్ ద్దీన్, అల్వాల దర్శన్, సవాల రాజు, శ్రీనివాస్, విష్ణు, శివకుమార్, సమీ, సలీం, సాబేర్, శ్రావణ్ గౌడ్, కుమార్, సత్యనారాయణ, కృష్ణయ్య, శంకర్, మల్లేష్, శేఖర్, బాలిశ్వర్, రాములు, గుర్రంపల్లి వెంకటేష్, రఘునందన్, శ్రీనివాస్, అనిల్, జనార్ధన్‌లు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

**విశాలాంధ్ర-బషీర్ బాగ్:** తెలంగాణ ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, 250 గజాల స్థలంలో 4 గదుల ఇంటిని నిర్మించి ఇవ్వాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి, సెక్రటరీ జనరల్ ప్రఫుల్‌లు రాంరెడ్డిలు డిమాండ్ చేశారు. చేసింది. గత ప్రభుత్వం ఉద్యమకారులను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉద్యమకారుల జేఏసీ నాయకులతో కలిసి వారు మాట్లాడుతూ అధికారంలో వచ్చిన కాంగ్రెస్ పార్టీ అయినా ఉద్యమకారులకు మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీలను నెరవేర్చాలని కోరారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి ఉద్యమకారులకు స్పష్టమైన ప్రకటన చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో తాము తదుపరి కార్యాచరణను ప్రకటిస్తామని వెల్లడించారు. తాము ఉద్యమాలు చేస్తే వాటి ఫలితాలను ఉద్యమ వ్యతిరేకులు అనుభవిస్తున్నారని ఆరోపించారు. కెసిఆర్ ఉద్యమకారులను అణగదొక్కారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శిలు బత్తుల సోమన్న, డోలక్ యాదగిరి, కోశాధికారి చంద్రన్న ప్రసాద్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కోతి మాధవి రెడ్డి, అధ్యక్షులు వేముల యాదగిరి, కే రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కేఎల్ మహేంద్ర సోషల్ స్టడీసర్కిల్‌కు పుస్తకాల వితరణ

**విశాలాంధ్ర - కాప్రా :** ఈసీఐఎల్ సీపీఐ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన కెఎల్. మహేంద్ర సోషల్ స్టడీ సర్కిల్ గ్రంథాలయానికి ఉస్మానియా విశ్వవిద్యాలయ మాజీ విద్యార్థి నాయకుడు, ఉద్యమ నేత స్టాలిన్ 100 సాహిత్య, పోటీ పరీక్షల మెటీరియల్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఉస్మానియా విశ్వవిద్యాలయ మాజీ విద్యార్థి నాయకుడు, ఉద్యమ నేత స్టాలిన్ మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగులు అన్ని అంశాలపై పఠనం చేయాలని అన్నారు. చరిత్ర పుస్తకాలను అధ్యయనం చేయడం ద్వారా వాస్తవిక విషయ పరిజ్ఞానం పెరుగుతుందన్నారు. నేడు చరిత్రను వక్రీకరించే కుట్రలు చేస్తున్నారని, దీనిని సాహిత్యపరులు తిప్పికొట్టాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కెఎల్. మహేంద్ర సోషల్ స్టడీ సర్కిల్ కార్యదర్శి జీ.దామోదర్ రెడ్డి, విఎస్. బోస్, సత్య ప్రసాద్, ధర్మేంద్ర, పోటీ పరీక్షల అభ్యర్థులు సాయి, అరుణ్, ప్రదీప్, నరహరి తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తీసుకురావాలి : శ్యామల

**విశాలాంధ్ర- కుత్బుల్లాపూర్ :** రాష్ట్రంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల అన్నారు. ఈ మేరకు బుధవారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 15వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ అల్వాల్ సైనిక్పురి ప్రాంతంలో జగదీష్ గుప్తా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరే శ్యామల పాల్గొని కేక్ కట్ చేయించి అభిమానులకు కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు త్వరలోనే శుభవార్త వింటారని, కార్యకర్తల కోరిక మేరకు రాష్ట్రంలో పరిస్థితులను మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రాష్ట్రంలో కమిటీ ఏర్పాటు చేసే దిశగా ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం వైఎస్ఆర్ పార్టీ నాయకులు సాతల గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టడాన్ని అడ్డుకోవాలి

**విశాలాంధ్ర-బషీర్ బాగ్ :** ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీ సమావేశాలలో ఆమోదిస్తే రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, కాంగ్రెస్ పార్టీని తెలంగాణలో బొంద పెడతామని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు ప్రొఫెసర్ డాక్టర్ బిఎల్.రాజు హెచ్చరించారు. బుదవారం హైదరాబాదులో జరిగిన మాల మహానాడు రాష్ట్ర ఆఫీస్ బేరర్ల సమావేశంలో డాక్టర్ వి.ఎల్.రాజు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం బిజెపి పార్టీలు ఓట్ బ్యాంకు రాజకీయాలు పాల్పడుతున్నారని ఆరోపిం చారు. ఈ అంశం మీద రాజ్యాంగ నిబంధనలు సుప్రీంకోర్టు వారు ఇచ్చిన తీర్పుని సైతం ఉల్లంఘిస్తున్నారని మండిపడ్డారు. అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టడం ద్వారా చట్టం చేసే ప్రభుత్వ ప్రయత్నాలను మాల సామాజిక వర్గానికి చెందిన మంత్రులు ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఇప్పటికైనా మాల ప్రజా ప్రతినిధులు చట్టసభల్లో బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. ఇప్పటికే ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా స్టే రావాలని తెలంగాణ రాష్ట్ర హైకోర్టులో పలు రిట్ పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయని అయినా రేవంత్ రెడ్డి ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తుందన్నారు. దళితుల భవిష్యత్తుని దెబ్బతీసే విధంగా పాలక ప్రభుత్వాలు ఎస్సీల రిజర్వేషన్లను సొంత రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవద్దని సుప్రీంకోర్టు గతంలోనే హితవు పలికిందన్నారు. నివేదిక మీద రాష్ట్ర మంత్రిమండలి ఆమోదించడంపైన చట్టసభల్లోని అధికార ప్రతిపక్ష పార్టీలు కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి, ఎంఐఎం కమ్యూనిస్టు పార్టీల ప్రజాప్రతినిధులు వర్గీకరణపై చర్చించాలని విజ్ఞప్తి చేశారు. వర్గీకరణ చేపట్టే ప్రయత్నాలను ప్రభుత్వం మానుకోవాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం అనుకూలంగా ఉండడం వల్ల ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఘోర ఓటమిని చవిచూసిందని డాక్టర్ బి.ఎల్. రాజు గుర్తు చేశారు. వర్గీకరణ ధ్యేయంగా రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళ్తే కాంగ్రెస్ పార్టీని రాజకీయంగా సమాధి చేస్తామని హెచ్చరించారు.

ఈ సమావేశంలో మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు జేఏస్ రావు, జాతీయ ఉపాధ్యక్షులు వల్లం సురేష్, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్, ఆర్ల రమేష్, అక్కి దాసు మహేశ్వరరావు, చిప్పరి సుబ్బారావు, ఎం. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## లీన్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీని ప్రారంభించిన ఆజాద్ ఇంజనీరింగ్

**విశాలాంధ్ర - శేరిలింగంపల్లి:** ప్రెసిషన్ ఇంజినీరింగ్‌లో అగ్రగామిగా ఉన్న ఆజాద్ ఇంజినీరింగ్ హైదరాబాద్ లోని తునికొల్లారంలో మిత్సుబిషి హెవీ ఇండస్ట్రీస్ (ఎంహెచ్ ఐ) ప్రత్యేక లీన్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీని ప్రారంభించింది. 7,200 చదరపు మీటర్ల అత్యాధునిక కేంద్రాన్ని జపాన్ లోని ఎంహెచ్ ఐ ఎనర్జీ సిస్టమ్ జీటీసీసీ బిజినెస్ డివిజన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మసాహిటో కటావోకా ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, ఆజాద్ ఇంజనీరింగ్ చైర్మన్, సీఈఓ రాకేష్ చోప్దార్ తదితరులు పాల్గొన్నారు. ఈ ప్రారంభోత్సవానికి ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ డైరెక్టర్, తెలంగాణ ప్రభుత్వ బీఎఫ్ఎస్ఐ డైరెక్టర్ ప్రవీణ్ పీఏ, జపాన్‌లోని ఎంహెచ్‌ఐలో టర్బైన్ ఇంజినీరింగ్ విభాగం ఇంజినీరింగ్ మేనేజర్ రాజా రాంరెడ్డి, జపాన్‌లోని ఎంహెచ్ఐ ప్రొక్యూర్ మెంట్ విభాగం డీజీఎం హిరోయుకి ఓకా, జపాన్‌లోని ఎంహెచ్ఐ సప్లై చైన్ మేనేజ్‌మెంట్ విభాగం డీజీఎం హితోషి మోరిమోటో, అమెరికాలోని ఎంహెచ్‌ఐలో నార్త్ అమెరికన్ మాన్యుఫ్యాక్చరింగ్ విభాగం సీనియర్ వైస్ ప్రెసిడెంట్ షేన్ మిక్కీ తదితరులు హాజరయ్యారు. ఎంహెచ్‌ఐతో ఆజాద్ ఇంజనీరింగ్ దశాబ్దకాల భాగస్వామ్యంలో ఈ లీన్ మాన్యుఫాక్చరింగ్ ఒక ప్రధాన మైలురాయిని సూచిస్తుంది. 2012లో కొన్ని యంత్రాలతో ప్రారంభమైన ప్రయాణం ఇప్పుడు ప్రపంచ స్థాయి తయారీ కేంద్రంగా అభివృద్ధి చెందింది, గొప్పతనం విషయంలో భాగస్వామ్య నిబద్ధతను ప్రదర్శిస్తుంది. 2024 నవంబర్ 3న ఆజాద్ జపాన్‌లోని మిత్సుబిషి హెవీ ఇండస్ట్రీస్ లిమిటెడ్ తో దీర్ఘకాలిక కాంట్రాక్ట్, ప్రైస్ అగ్రిమెంట్ (ఎల్టిసిపిఏ) పై సంతకం చేసిన తర్వాత ఈ పరిణామం జరిగింది.

## పెబ్బేరు ఎస్సై అరాచకాలపై డీజీపీకి ఫిర్యాదు

**విశాలాంధ్ర -బషీర్ బాగ్ :** వనపర్తి జిల్లా పెబ్బేరు ఎస్సై హరిప్రసాద్ రెడ్డి అవినీతి, అరాచకాలపై విచారణ జరిపి అతనిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ డీజీపీకి బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. బుధవారం హైదరాబాద్ లక్డికాపూల్‌లోని డీజీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన అనంతరం జేఏసీ స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ మాట్లాడుతూ పెబ్బేరు ఎస్సై హరిప్రసాద్‌రెడ్డి ల్యాండ్ మాఫియా, ఇసుక మాఫియా, రేషన్ మాఫియాలతో కుమ్మక్కై నెలకు దాదాపు రూ.10 లక్షల దాకా వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇటీవల ఓ మహిళ మెడలో నుంచి బంగారం చోరీకి గురైందని ఆ రికవరీ మొత్తాన్ని కోర్టులో డిపాజిట్ చేసి కోర్టు ద్వారా బాధితులకు ఇవ్వాలనీ, కానీ ఆయన దుర్బుద్ధితో కోర్టులో రూ.70 వేలు మాత్రమే డిపాజిట్ చేసి మిగతాది లంచంగా తీసుకొని బాధితులకు ఫోన్ పే ద్వారా రూ.50 వేలు ఒకసారి, రూ.30 వేలు మరొకసారి వేసి మమ అనిపించారని ఆరోపించారు. మరొక మహిళకు సైతం రూ.50 వేలు ఫోన్ పే చేసినట్లు తెలిపారు. ప్రధాన పత్రికలలో ఆధారాలతో సహా కథనాలు వచ్చినా జిల్లా ఎస్పీ, ఐజీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. అందుకే ఎస్సై అరాచకాలపై డీజీపీకి ఫిర్యాదు చేశామని అన్నారు. ఎస్సై అరాచకాలపై సాక్ష్యాధారాలు, బాధితులతో మాట్లాడిన కాల్ రికార్డింగులు, ఆయన మీద సేకరించిన అన్ని వివరాలను డీజీపీకి అందించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జెఏసి నాయకులు రాఘవేందర్ గౌడ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గోటూరి రవీందర్ గౌడ్, రేనట్ల మల్లేష్,ముత్యాల వినోద్ సాగర్, మ్యాదరి రాజు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు రక్షణ కల్పించాలి

**విశాలాంధ్ర - కాప్రా :** రోజురోజుకు మహిళలపై అగాయిత్యాలు, అత్యాచారాలు జరుగుతున్న ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ప్రధాన కార్యదర్శి ఏం వినోద, ఆఫీస్ బేరర్ ఆర్ లక్ష్మీదేవిలు అన్నారు. బుధవారం ఈసీఐఎల్ కమల నగర్‌లో ఐద్వా అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఐద్వా సీనియర్ నాయకురాలు బి అన్నపూర్ణమ్మ జెండా ఎగరవేశారు. అనంతరం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం వినోద, ఆఫీస్ బేరర్ ఆర్ లక్ష్మీదేవిలు మాట్లాడుతూ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం 1981 మార్చి 10, 11, 12 తేదీల్లో అప్పటి మద్రాసు నగరం ఇప్పటి చెన్నై నగరంలో మొట్టమొదటి మహాసభ జరిగింది. ఆ మహాసభలోనే ఐద్వా ఏర్పడింది. అంతకుముందు అనేక రాష్ట్రాల్లో వివిధ పేర్లతో సంఘం పనిచేస్తూ వచ్చింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సంఘంగా, పశ్చిమ బెంగాల్లో పశ్చిమబంగా గణతంత్ర మహిళా సమితిగా మహారాష్ట్రలో కామ్ మహిళ సమితిగా అలా కేరళ, తమిళనాడు పంజాబ్ వంటి అనేక రాష్ట్రాల్లో మహిళా సంఘం ఏర్పడి పనిచేస్తూ వచ్చిన 1981లో జరిగిన మొదటి మహాసభతో అఖిల భారతస్థాయి రూపం తీసుకుని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఏర్పడిందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు రక్షణ భద్రత కల్పించాల ఉపాధిని కల్పించాలని పని ప్రదేశాలలో వేధింపులను అరికట్టా అధిక ధరలను తగ్గించాలని, అత్యాచారాలను అరికట్టాలని వీటికి కారణం అవుతున్న మద్యం డ్రగ్స్, గంజాయి మాదకద్రవ్యాలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆఫీస్ బేరర్ సపియ సుల్తాన, కమిటీ సభ్యులు ఏ శారద, ది గాయత్రి, జి.సుభాషిణి, సిమ్రాణి, శోభ, గౌసియా తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ హయాంలోనే సంక్షేమ పథకాల అమలు భేష్

**విశాలాంధ్ర - ఆమనగల్లు :** తెలంగాణ రాష్ట్ర గత ప్రభుత్వ హయాంలో కేసీఆర్ సారథ్యంలో రాష్ట్రం సుభిక్షంగా అభివృద్ధి చెందిందని రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు గూడూరు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి అన్నారు. కడ్తాల్ మండల కేంద్రంలో మాజీ సర్పంచ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హోళీ వేడుకలలో కేసీఆర్ అభిమానులు, మహిళలు, పెద్ద ఎత్తున పాల్గొని కేసీఆర్ చిత్రపటానికి రంగులు చల్లి అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ మహిళా సంక్షేమ పథకాలు కెసిఆర్ హయాంలోనే బాగున్నాయని, కేసీఆర్ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మాట్లాడుతూ హోళీ వేడుకలలో కేసీఆర్ అభిమానులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని కెసిఆర్‌కి తమ అభిమానాన్ని చాటడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ లాయక్ అలీ, మాజీ ఉపసర్పంచ్ రామకృష్ణ, సురేష్, శివ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఇంజినీర్లపై కేసుల ఉపసంహరణ హర్షణీయం: ఆళ్ల

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : జల వనరుల శాఖలో 386 మంది ఇంజినీర్‌లపై గత వైసీపీ పెట్టిన అక్రమ కేసులు తొలగిస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయ మని టీడీపీ నీరు-చెట్టు ఫిర్యాదుల విభాగం బాధ్యులు, సాగునీటి వినియోగ దారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాల కృష్ణారావు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత టీడీపీ హయాంలో నీరు-చెట్టు కింద అన్ని అనుమతులు తీసుకుని రూ.2,036 కోట్లతో 32,040 పనులను చేయటం జరిగిందని, 2019 లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం బిల్లులను పెండింగ్‌లో పెట్టటమే కాకుండా రకరకాల మెమోలు, విజిలెన్స్ విచారణలు వేసి ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ పట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, అనంతపురం, కడప, కర్నూలు జిల్లాలలో వివిధ హోదాల్లో వున్న 386 మంది జల వనరుల శాఖ ఇంజినీర్ల మీద విజిలెన్స్ కేసులు పెట్టటం జరిగిందన్నారు. దీనిపై పూర్తి విచారణ చేసిన కూటమి ప్రభుత్వం సీఎం చంద్రబాబు దశ-దిశ నిర్దేశంతో మంత్రి నిమ్మల రామానాయుడు అధ్వర్యంలో ఇంజినీర్లపై అక్రమ కేసులను ఉపసంహరిస్తూ బుధవారం జీఓ జారీ చేసినట్టు చెప్పారు.

# ఓటేరు చెరువును కాపాడతాం

**కబ్జాదారులపై క్రిమినల్ కేసులు: నారాయణ**

**ఆక్రమణను పరిశీలించిన సీపీఐ, సీపీఎం, ఆర్‌పీఐ నేతలు**

విశాలాంధ్ర- తిరుపతి: భూ ఆక్రమణదారుల నుంచి ఓటేరు చెరువును కాపాడతామని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ స్పష్టంచేశారు. చెరువు ఆక్రమణను తొలగించే వరకు పోరాటం చేయనున్నట్లు చెప్పారు. ఓటేరు చెరువును నారాయణ బుధవారం పరిశీలించారు. చెరువు ఆక్రమణను చూసి ఆయన మండిపడ్డారు. పట్టపగలే అందరూ చూస్తుండగానే చెరువు పూడ్చేందుకు కబ్జాదారులు యత్నించిన వైనాన్ని నారాయణకు సీపీఐ, సీపీఎం, ఆర్‌పీఐ నాయకులు వివరించారు. నీటిని నదిలోకి మళ్లించి... ప్రణాళికాబద్ధంగా జాతీయ రహదారిపై గల ఆక్రమణకు యత్నించిన వైనాన్ని పరిశీలించారు. తొలి నుంచి వామపక్ష పార్టీల నిరసనలతో ఆక్రమణలు ఆగాయి. కబ్జాదారులు మళ్లీ ఆక్రమణలకు పాల్పడ్డారు. అనంతరం నారాయణ మీడియాతో మాట్లాడుతూ చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూముల కబ్జాకు పాల్పడటం దారుణమన్నారు. తిరుపతిలో అనేక చెరువులు ఇప్పటికే ఆక్రమణకు గురయ్యాయని, బ్రిటీష్ కాలం నాటి ఓటేరు చెరువు ఆక్రమణకు పాల్పడటం దుర్మార్గమైన చర్యగా ఆయన పేర్కొన్నారు. ఇంకుడు గుంతలకు ప్రాధాన్యత ఇచ్చే ముఖ్యమంత్రి చంద్రబాబు చెరువులు పూడ్చిజ... కబ్జా చేస్తుంటే చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని నారాయణ ప్రశ్నించారు. ఆక్రమణదారుల నుంచి చెరువుకు విముక్తి కలిగే వరకు పోరాటం కొనసాగిస్తామని నారాయణ తేల్చి చెప్పారు. ఈ పోరాటంలో జైలుకు వెళ్లేందుకైనా వామపక్ష పార్టీలుగా తామంతా సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. హెచ్చరిక బోర్డులను దౌర్జన్యంగా తొలగించడం ప్రభుత్వానికి అవమానం కాదా అని ప్రశ్నించారు. ఆక్రమణదారులు ఎంతటి వారైనా ఉపేక్షించవద్దని, ఓటేరు చెరువుపై ప్రభుత్వం స్పందించాలన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రామానాయుడు, జిల్లా కార్యదర్శి పి.మురళి, జిల్లా నాయకులు చిన్నం పెంచలయ్య, కె.రాధాకృష్ణ, జె.విశ్వనాథ్, బి.నదియా, కత్తి రవి, ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి కె.శివారెడ్డి, ఓటేరు చెరువు పరిరక్షణ వేదిక కన్వీనర్ కె.పద్మనాభ రెడ్డి, సీపీఎం నాయకులు హేమలత, జయచంద్ర, వేణు బుజ్జమ్మ, ఆర్పీఐ నాయకులు పి.అంజయ్య, గొడుగుచింత గోవిందయ్య, ప్రజా సంఘాల నాయకులు ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి, ఎన్‌డీ రవి, ఎస్.శ్రీరాములు, వైయస్ మణి, మహేంద్రా, అల్లాభక్షు, జె.నాగరాజు, మంజుల, రత్నమ్మ, విజయ, అలివేలు పాల్గొన్నారు.

## పరిశీలిస్తున్నాం

**జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలపై మంత్రి అనగాని**

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపుపై శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ, కాల్వ శ్రీనివాసులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. ఏ మండలంలో రేషన్ కార్డు ఉంటే ఆ మండలంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలం ఇచ్చే విషయాన్ని పరిశీలిస్తున్నామని అన్నారు. భూ సంబంధిత అంశాలపై ఏర్పాటైన మంత్రివర్గ ఉప సంఘం దీనిపై అధ్యయనం చేస్తుందని తెలిపారు. జర్నలిస్టులను ప్రత్యేక వర్గంగా భావించి ఇళ్ల స్థలాలను తక్కువ రేటుకు ఇవ్వడం సరైంది కాదని సుప్రీంకోర్టు తీర్పునిచ్చిందని గుర్తుచేశారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ఇళ్ల పట్టాలు ఎలా ఇవ్వాలా అనే దానిపై కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం జర్నలిస్టులను మోసం చేసిందని, ఎన్నికలకు కొన్ని నెలల ముందు ఇళ్ల పట్టాలు ఇస్తామంటూ జీవో జారీ చేసిందన్నారు. అలాగే అనేక కఠిన షరతులు పెట్టిందని, ఒక్క జర్నలిస్టుకు పట్టా ఇచ్చిన దాఖలా లేదని విమర్శించారు.

## విద్యుత్ చార్జీలు పెంచం: గొట్టిపాటి రవి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాబోయే రోజుల్లో విద్యుత్ చార్జీలు పెరగబోవని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ఆయన బుధవారం శాసనసభలో మాట్లాడుతూ, గత ప్రభుత్వం తొమ్మిది సార్లు విద్యుత్ చార్జీలు పెంచిందని, పీపీఏలన్ని రద్దు చేసిందన్నారు. కృష్ణపట్నం, వీటీపీఎస్ థర్మల్ ప్లాంట్ విస్తరణను నిలిపివేసిందని, ఇలాంటి వాటివల్ల విద్యుత్ వ్యవస్థకు రూ.1.29 లక్షల కోట్ల నష్టం కలిగిందన్నారు. ఏపీ జెన్‌కో రికార్డు స్థాయిలో ఉత్పత్తిని సాధించిందన్నారు. గత ప్రభుత్వం విపరీతంగా విద్యుత్ కొనుగోలు చేపడితే దాన్ని 60 శాతానికి తగ్గించామని చెప్పారు. రానున్న రోజుల్లో విద్యుత్ చార్జీలు పెంచమని మంత్రి తెలిపారు. రైతులకు తొమ్మిది గంటల నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామని గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. లైన్‌మెన్లు, ఏఈల కొరతను అధిగమించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. టెక్స్‌టైల్స్‌కు పవర్ సబ్సిడీ ఇవ్వడంపై సీఎంతో సంప్రదించిన తర్వాత తగు చర్యలు తీసుకుంటామని గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.

## గ్రానైట్ వ్యాపారుల సమస్యలు పరిష్కరిస్తాం: మంత్రి కొండపల్లి

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: తాడిపత్రి నియోజకవర్గ ఎమ్మెల్యే జేసీ అశ్మిత్ రెడ్డి నేతృత్వంలో గ్రానైట్ వ్యాపారుల బృందం బుధవారం సచివాలయంలోని తన కార్యాలయంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ను కలిసి పరిశ్రమల నిర్వాహకులు ఎదుర్కొంటున్న సమస్యలపై విన్నవించారు. విద్యుత్ ఛార్జీల తగ్గింపు, రాయల్టీ ఫీజు, సహా వివిధ రకాల పన్నులను తగ్గించాలని లేదంటే రాష్ట్రంలో ఈ రంగం మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని మంత్రికి విజ్ఞప్తి చేశారు. సీఎం చంద్రబాబు, కేబినెట్ దృష్టికి తీసుకువెళ్లి తమను ఆదుకోవాలని మంత్రిని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి కొండపల్లి... గ్రానైట్ వ్యాపారులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

# మోడల్ విద్యా కేంద్రంగా ఏపీ

**దశలవారీగా ఫీజు రీయింబర్స్‌మెంట్**

**మండలిలో మంత్రి లోకేశ్**

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్‌ను మోడల్ విద్యా కేంద్రంగా తీర్చిదిద్దుతామని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను దశలవారీగా చెల్లిస్తామన్నారు. విద్యాశాఖలో సంస్కరణలపై శాసన మండలిలో స్వల్ప వ్యవధి చర్చలో లోకేశ్ మాట్లాడుతూ జీవో 117 వల్ల గత ఐదేళ్లలో 12 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు దూరమయ్యారని తెలిపారు. గతంలో టీచర్లపై పెట్టిన కేసుల మాఫీ బాధ్యతను తమ ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. టీచర్లకు యాప్‌ల భారం తగ్గిస్తున్నామని, నోట్ బుక్‌లు, పుస్తకాలు, బెల్టులు, బ్యాగ్‌లు, చిక్కీలపై ఇక నుంచి ప్రభుత్వ ముద్ర మాత్రమే ఉంటుందని చెప్పారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుతో విద్యాకిట్లు ఇస్తామన్నారు. విద్యార్థులకు పుస్తకాల భారాన్ని తగ్గించినట్లు తెలిపారు. పుస్తకాలు, బ్యాగ్‌లపై ప్రభుత్వ లోగో మాత్రమే ఉంటుందని... నాయకుల ఫొటోలు కాదన్నారు. టీచర్ల బదిలీకి చట్టం తెస్తామని లోకేశ్ చెప్పారు. ప్రతి గ్రామానికి మోడల్ ప్రైమరీ స్కూల్‌ను, అమరావతిలో ప్రపంచ స్థాయి టీచర్ ట్రైనింగ్ అకాడమీ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. డీఎస్సీ నోటిఫికేషన్ తప్పక విడుదల చేస్తామన్నారు. వైసీపీ సభ్యులు సీబీఎస్‌ఈ, టోఫెల్, ఐబీ గురించి మాట్లాడారని గుర్తుచేస్తూ ఎలాంటి సన్నద్ధత లేకుండా వెయ్యి పాఠశాలల్లో సీబీఎస్‌ఈని గత ప్రభుత్వం ప్రవేశపెట్టిందని లోకేశ్ అన్నారు. వైసీపీ హయాంలో గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో పడిపోయిందని, కేజీ నుంచి పీజీ వరకు బోధనాంశాలను బలోపేతం చేస్తామన్నారు. తిరుపతిలోని ఎస్వీ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో మూడు రోడ్లకు ప్రతిపాదనలు ఉన్నాయని మున్సిపల్ మంత్రి పి.నారాయణ తెలిపారు. ఈ మేరకు బి.తిరుమలనాయుడు, పర్చూరి అశోక్‌బాబు, భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. విశాఖ ఓడరేవు నుంచి మాదకద్రవ్యాల దిగుమతికి సంబంధించిన కేసు సీబీఐ పరిధిలో ఉందని కుంభా రవిబాబు, వరుదు కల్యాణి, చంద్రగిరి ఏసురత్నం అడిగిన ప్రశ్నకు హోం మంత్రి వంగలపూడి అనిత బదులిచ్చారు. మదనపల్లె సబ్-కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన అగ్నిప్రమాదంపై సీఐడీ దర్యాప్తు చేస్తున్నదని తిరుమలనాయుడు, పర్చూరి అశోక్‌బాబు, దువ్వారపు రామారావు అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానం చెప్పారు. చేనేత పరిశ్రమలకు ప్రోత్సాహకాలపై మురుగుడు హనుమంతరావు ప్రశ్నకు... పట్టు, నూలు, ముడి సరుకుపై రాయితీలు ఇస్తున్నామని మంత్రి ఎస్.సవిత సమాధానమిచ్చారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని 9వ, 10వ షెడ్యూల్స్ కింద ఆస్తులపై చంద్రగిరి ఏసురత్నం అడిగిన ప్రశ్నకు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బదులిచ్చారు. పునర్వ్యవస్థీకరణ చట్టంలోని 9వ, 10వ షెడ్యూళ్ల కింద ఆస్తులు, సంస్థల వాటాల వివరాలను తెలిపారు. అవిభజిత ఆంధ్రప్రదేశ్ ఆస్తులు, అప్పులపై విచారణ కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించినట్లు పయ్యావుల కేశవ్ వెల్లడించారు.

## దక్షిణ భారత అఖిలపక్ష సమావేశానికి రండి

**జగన్‌కు డీఎంకే నేతల ఆహ్వానం**

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: చెన్నైలో ఈ నెల 22న డీఎంకే నేతృత్వంలో జరగనున్న దక్షిణ భారత అఖిలపక్ష నాయకుల సమావేశానికి హాజరుకావాలంటూ వైసీపీ అధినేత వైఎస్ జగన్‌కు ఆహ్వానం అందింది. ఈ మేరకు తమిళనాడు పీడబ్ల్యూడీ శాఖ మంత్రి ఈవీ వేలు, రాజ్యసభ సభ్యుడు విల్సన్ బుధవారం తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో జగన్‌ను కలిశారు. తమిళనాడు సీఎం, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ రాసిన లేఖను అందజేసి... సమావేశానికి ఆహ్వానించారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై చర్చించేందుకు తమిళనాడు సీఎం స్టాలిన్ వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, వివిధ పార్టీల అధినేతలకు ఆహ్వానం పంపారు. ఇందులో భాగంగా తమిళనాడు డీఎంకే నేతలు జగన్‌ను కలిశారు.

## మందుల నాణ్యత, సరఫరాపై నియంత్రణ పటిష్టం

**డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లకు మంత్రి సత్యకుమార్ ఆదేశం**

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ప్రజా రోగ్యానికి కీలకమైన మందుల నాణ్యత, సరఫరాలపై నియంత్రణను మరింత పటిష్టం చేయాలని వైద్య,ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) అధికారులను ఆదేశించారు. వారి పనితీరు, సాధిస్తున్న ఫలితాలపై బుధవారం వెలగపూడిలోని సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు. డీసీఏ డైరెక్టర్ జనరల్ రవి పట్టణ్‌శెట్టి , డైరెక్టర్ ఎం.బి.ఆర్.ప్రసాద్, అధికారులు హాజరయ్యారు. డ్రగ్ ఇన్స్ పెక్టర్లు మొక్కుబడిగా తనిఖీలు చేపడుతున్నారని, ఈ వైఖరిలో మార్పు రావాలని మంత్రి సూచించారు. 2015-16లో ప్రతి డ్రగ్ ఇన్స్‌పెక్టర్ 538 తనిఖీలు చేయగా 2023-24లో అది 501కి పడిపోయిందని, సేకరించే మందుల నమూనాల విషయంలో కూడా చిత్తశుద్ధి కొరవడినట్లు వెల్లడయిందన్నారు. కంప్యూటర్ సాఫ్ట్ వేర్ ద్వారా తనిఖీలు చేపట్టాలని సూచించారు. రాష్ట్రంలోకి ఇతర ప్రాంతాల నుంచి కల్తీ మందులు వస్తున్నాయో, వాటిని ఎక్కడెక్కడ విక్రయిస్తున్నారో అన్న సమాచారాన్ని సేకరించే వ్యవస్థను ఏర్పరుచుకుని ప్రభావంతమైన తనిఖీలు చేపట్టాలని మంత్రి అన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలు చెల్లించండి

**రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ నిరసన ర్యాలీ**

**ఇది... చంద్రబాబు ప్రభుత్వానికి తొలి హెచ్చరిక: జగన్**

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలు తక్షణమే చెల్లించాలని, ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగా నెలకు రూ.మూడువేల నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ... రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం వైసీపీ 'యువత పోరు' కార్యక్రమం నిర్వహించింది. అన్ని జిల్లా కేంద్రాల్లో విద్యార్థులు, తల్లిదండ్రులు, నిరుద్యోగులతో కలిసి వైసీపీ నాయకులు ర్యాలీలు నిర్వహించారు. కలెక్టర్లకు వినతులు సమర్పించారు. కొత్త మెడికల్ కళాశాలల ప్రైవేటీక రణను ఉప సంహరించుకుని, పేదలకు వైద్య విద్యను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. మచిలీపట్నంలో పేర్ని వెంకట్రామయ్య(నాని), పేర్ని కిట్టు అధ్వర్యంలో నిరసనలు చేపట్టారు. విజయవాడ కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో వైసీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాశ్, మాజీ మంత్రులు జోగి రమేశ్, వెలంపల్లి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, మేయర్ భాగ్యలక్ష్మి, పి.గౌతమ్‌రెడ్డి, ఆసీఫ్ పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా యువత పోరు విజయవంతమైనట్లు వైసీపీ కేంద్ర కార్యాలయ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ప్రకటించారు. కాగా, యువత పోరులో పాల్గొన్న తల్లిదండ్రులు, విద్యార్థులు, నిరుద్యోగులపై పోలీసులు దౌర్జన్యం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు జగన్ ప్రకటించారు. ఇది చంద్రబాబు ప్రభుత్వానికి పంపిన తొలి హెచ్చరిక అని 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. చంద్రబాబు ప్రభుత్వం పెడుతున్న కష్టాలపై నిలదీశారని పేర్కొన్నారు. పేదరికం వల్ల పెద్ద చదువులకు ఎవరూ దూరం కాకూడదన్న దృఢ సంకల్పంతో తమ ప్రభుత్వం విద్యా దీవెన ద్వారా సంపూర్ణ ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన ద్వారా హాస్టల్, మెస్ చార్జీలను నేరుగా వారి తల్లులు, ఆ పిల్లల ఖాతాలకే జమ చేస్తూ,అమలు చేసిన పథకాలను చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా నీరుగార్చిందన్నారు.

# పది పరీక్షలకు సర్వం సిద్ధం

**రాష్ట్రంలో 3,450 పరీక్షా కేంద్రాల ఏర్పాటు**

**సన్నాహక చర్యలపై సీఎస్ సమీక్ష**

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధమైంది. ఈనెల 17 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 3,450 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. ఆయన బుధవారం పదో తరగతి పరీక్షల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, విద్యా తదితర శాఖల అధికారులతో రాష్ట్ర సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సీఎస్ సూచించారు. చీఫ్ సూపరింటెండెంట్ మినహా మొబైల్ ఫోన్‌ను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించరాదన్నారు. పరీక్షా కేంద్రాలకు 100 మీటర్ల వరకు 144వ సెక్షన్ అమలు చేయాలన్నారు. జిరాక్స్, నెట్ సెంటర్లన్నీ మూసివేయాలని, పేపర్ లీకులంటూ ఫేక్ న్యూస్‌ను అరి కట్టాలని ఆదేశిస్తూ... ఇటీవల బీఈడీ పరీక్షలప్పటి సంఘటనను సీఎస్ గుర్తు చేశారు. పరీక్షల నిర్వహణపై రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ సంచాలకులు వి.విజయ రామరాజు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రాష్ట్రంలో 3,450 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా, వాటిలో 163 సున్నిత ప్రాంతాల్లో ఉన్నట్లు తెలిపారు. ఆయా చోట్ల ప్రత్యేకంగా సీసీటీవీలతో నిఘా పెంచామన్నారు. పదో తరగతి పరీక్షలకు 6,19,275 మంది (3,15,697 మంది బాలురు, 3,03,578 మంది బాలికలు) హాజరవుతున్నారని తెలిపారు. కర్నూల్, అనంతపురం, ప్రకాశం జిల్లాల్లో టెన్త్ విద్యార్థులు ఎక్కువగా ఉన్నారని చెప్పారు. 56 ఫ్లైయింగ్ స్క్వాడ్స్, 682 సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను మోహరించామని, ప్రతి జిల్లాకు ప్రత్యేక నోడల్ అధికారులను నియమించామని సీఎస్ తెలిపారు. రాష్ట్ర స్థాయిలో 08662 974540 నంబరుతో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాల్లో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని కలెక్టర్లకు సూచించారు. పరీక్షల సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ శాఖను సీఎస్ ఆదేశించారు. ఈనెల 17 నుంచి 28 వరకు పదో తరగతి (ఓపెన్ స్కూల్ విభాగం) పరీక్షలు రోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరగనున్నాయి. సమావేశంలో సాధారణ పరిపాలన శాఖ ముఖ్యకార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా, సీసీఎల్ఏ జి.జయలక్ష్మీ, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

## అదానీకి మోదీ అండ

**మోగా స్కామ్ పరిష్కారంలో విఫలం: కాంగ్రెస్**

న్యూఢిల్లీ: ఆర్థిక అక్రమాలకు పాల్పడే తన మిత్రులను కాపాడుకోవడానికే ప్రధాని మోదీ మొగ్గు చూపుతున్నారని, మారిషస్‌లో అదానీ సంస్థకు ఉన్న షెల్ కంపెనీల వివరాలను సేకరించడం లేదని కాంగ్రెస్ విమర్శించింది. తన మిత్రులను కాపాడుకోవడానికి మోదీ దేనికైనా సిద్ధమేనని, సమాచారాన్ని గోప్యంగా ఉంచడానికి వెనుకాడబోరని దుయ్యబట్టింది. మోదీ రెండ్రోజుల మారిషస్ పర్యటన కాంగ్రెస్ అదానీ వ్యవహారాన్ని కాంగ్రెస్ తెరపైకి తెచ్చింది. మారిషస్‌లో అదానీతో ముడిపడ్డ డొల్ల సంస్థలు అనేకం ఉన్నాయన్న ఆరోపణలను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ బుధవారం ఎక్స్ మాధ్యమంగా గుర్తుచేశారు. 'భారత్‌కు దీర్ఘకాల మిత్రదేశం, కీలకమైన ఆర్థిక కేంద్రంగా ఉన్న మారిషస్‌లో ప్రధాని మోదీ పర్యటిస్తున్నారు కానీ అదానీ సంస్థకు సంబంధించిన షెల్ కంపెనీల వివరాలను సేకరించడంలేదు. అసలు ఆ విషయాన్నే లేవనెత్తడంలేదు. మనీలాండరింగ్ ఆరోపణలపై దర్యాప్తులో మోదీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది' అని జైరాం రమేశ్ విమర్శించారు. మనీలాండరింగ్, హవాలా, పన్ను ఎగవేతలను అదానీ, ఆయన సహచరులు సాగించడంతో మారిషస్‌తో భారత్‌కు ఉన్న విశ్వసనీయ బంధం బలహీనమైందని దుయ్యబట్టారు. అదానీ కుంభకోణంపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సెబీ నేతృత్వ దర్యాప్తు రెండు నెలల్లో పూర్తి కావాల్సి ఉండగా అది రెండేళ్లు సాగిందని జైరాం రమేశ్ గుర్తుచేశారు. అదానీ మెగా స్కామ్‌కు సంబంధించిన సమాచారాన్ని మారిషస్ నుంచి మోదీ రాబట్టడం లేదని, ఆర్థిక అవకతవకలపై డొల్ల కంపెనీలపై ఆరా తీయడం లేదని, తన మిత్రులను కాపాడటం కోసం ఆయా అంశాలను పూర్తిస్థాయిలో మోదీ యత్నిస్తున్నారని జైరాం రమేశ్ పేర్కొన్నారు. భారతీయ ఆర్థిక వ్యవస్థను, ప్రధాన వ్యవస్థలను హోల్‌సేల్‌గా స్వాధీనపర్చుకోవడాన్ని బట్టి భారత చరిత్రలోనే అతిపెద్ద కుంభకోణానికి ఎందుకు తెరపడటం లేదో అర్థమవుతోందని ఆయన వ్యాఖ్యానించారు. మహారాష్ట్రతో పాటు ఇతర రాష్ట్రాల్లో ఎన్నికల ట్యాంపరింగ్ గురించి వాస్తవాలు బహిర్గం కావాలంటే జేపీసీ ద్వారా సమగ్ర దర్యాప్తు జరపాల్సిందేనని జైరాం రమేశ్ నొక్కిచెప్పారు. కాగా, మోదీ తన మారిషస్ పర్యటనలో భాగంగా ఆ దేశంలో కొన్ని అవగాహన ఒప్పందాలు చేసుకున్నారు. 'గ్రాండ్ విజన్ ఫర్ సెక్యూరిటీ & గ్రోత్ ఫర్ ది గ్లోబల్ సౌత్'ను ప్రారంభించారు.

# కేంద్రం ముందస్తు నిధులతో పోలవరం పనులు పరుగులు

**2027 డిసెంబర్‌కి పూర్తిచేస్తాం: మంత్రి నిమ్మల**

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటి వరకు పోలవరం ప్రాజెక్టుకు రూ.5,052 వేల కోట్లు అడ్వాన్స్ నిధులు వచ్చాయని, వీటితో పట్టాలు తప్పిన పోలవరం పనులు నేడు పరుగులు పెడుతున్నాయని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఎన్డీఏ డబుల్ ఇంజన్ సర్కారు ఉండడంవల్ల అద్భుత ఫలితాలు సాధ్యమవుతున్నాయన్నారు. పోలవరం ప్రాజెక్టుకు అడ్వాన్స్ నిధులు మంజూరు చేయడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజల తరపున కేంద్ర ప్రభుత్వానికి, నిధుల సాధనకు కృషి చేసిన సీఎం చంద్రబాబుకు మంత్రి కృతజ్ఞతలు తెలియజేశారు. పోలవరం పనులకు టైం షెడ్యూల్ నిర్ణయించుకుని నిర్మాణ సంస్థలైన మేఘా ఇంజినీరింగ్, బావర్, అఫ్రిలతో సమన్వయం చేసుకుంటూ శరవేగంతో చేస్తున్నట్లు చెప్పారు. అంతర్జాతీయ నిపుణులు, పోలవరం ప్రాజెక్టు అథారిటీ, అధికారులు, కేంద్ర జలశక్తి సంఘు ప్రతినిధులు పూర్తి సహాయ సహకారాలతో పనులు షెడ్యూల్ టైం లో పూర్తి చేయడానికి కృషి చేస్తున్నట్లు మంత్రి వివరించారు. 2014 -19 కాలంలో 72 శాతం పోలవరం పనులు పూర్తి చేసి అప్ప చెబితే, జగన్ ధ్వంసరచనకు పూనుకొని, ఎక్కడ పనులు అక్కడే వదిలేసి డయాఫ్రం వాల్ ధ్వంసానికి కారకుడు అయ్యాడని విమర్శించారు. డయాఫ్రం వాల్ పనులకు ప్రస్తుతం రెండు కట్టర్లను ఉపయోగిస్తున్నామని, ఇప్పటి వరకు 136 మీటర్లు పొడవున, 6700 చదరపు మీటర్లు నిర్మాణం పూర్తయిందన్నారు. ఏప్రిల్ మొదటి వారం నుంచి మూడో కట్టర్ కూడా అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఎగువ కాఫర్ డ్యాంను బలోపేతం చేయడానికి, బట్రస్ డ్యాం పనులు శరవేగంగా జరుగుతున్నాయని, వీటితో పాటు క్లే రీచ్ లో డివాల్ నిర్మాణానికి సంబంధించి, వైబ్రో కాంపాక్షన్ పనులు కూడా ప్రారంభమయ్యాయన్నారు. ఈ ఏడాది డిసెంబరుకి డయాఫ్రం వాల్ నిర్మాణం పూర్తి చేస్తామని, డివాల్ కి సమాంతరంగా ఈసీఆర్ఎఫ్ డ్యాం, తదితర ప్రాజెక్టు పనులు చేస్తూ, 2027 డిసెంబర్ నాటికి ప్రాజెక్టు పూర్తి చేస్తామని మంత్రి నిమ్మల పునరుద్ఘాటించారు. అలాగే ప్రాజెక్టు నిర్మాణంలో అంతర్భాగమైన నిర్వాసితుల బాధలను తీర్చడానికి ఏడేళ్ల తరువాత, నేరుగా రూ.990 కోట్లు వారి ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు.

## విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిరసన ఉద్యమం రేపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు నిరసనగా ఈనెల 14న రాష్ట్రవ్యాప్తంగా అన్ని కార్మిక, రైతు సంఘాలు, రాజకీయ పార్టీలు, యువజన, విద్యార్థి, మహిళ, మైనార్టీ, దళిత గిరిజన మేధావి వ్యాపార సంఘాల అధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు, ఆందోళనలు నిర్వహించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం యూనియన్ నేతలు ఒక ప్రకటన విడుదల చేశారు. గత నెల 22 న విజయవాడలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిలపక్ష కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు, వివిధ సంఘాల నాయకులు కలిసి... ఈనెల 14న ఆందోళనకు పిలుపునిచ్చాయని గుర్తుచేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసనలు చేపట్టాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పొమ్మనకుండా పొగ పెట్టినట్లు ఒకపక్క మేం ప్రైవేటీకరణ చేయబోమంటూనే, మరోపక్క నాలుగు వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను తగ్గించారని తెలిపారు. శాసనసభ బడ్జెట్ సమావేశాలలో అసెంబ్లీలో తీర్మానం చేయాలని కోరినప్పటికీ ప్రభుత్వానికి సీమ కుట్టినట్లు లేదన్నారు. పరిశ్రమను నిలబెట్టుకోవడానికి ఎంతటి పోరాటాల కైనా కార్మిక వర్గం సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

## మద్యం మత్తులో నితీశ్ వ్యాఖ్యలు

**రాబ్డీదేవి ఆగ్రహం... మండలి నుంచి వాకౌట్**

పాట్నా: బీహార్ శాసనమండలిలో ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, మాజీ సీఎం రాబ్డీదేవి మధ్య బుధవారం తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటుచేసుకొంది. నితీశ్ వ్యాఖ్యలపై విరుచుకుపడిన రాబ్డీదేవి... ప్రతిపక్షాలతో కలిసి సభ నుంచి వాకౌట్ చేశారు. ప్రశ్నోత్తరాల సమయంలో ఆర్జేడీ మిత్రపక్షమైన సీపీఐ(ఎంఎల్) నేత ఎమ్మెల్సీ శశి యాదవ్ అడిగిన ఓ ప్రశ్నకు ప్రభుత్వం సమాధానం చెప్పింది. దీనిపై స్పందించిన రాబ్డీ దేవి... ప్రభుత్వ సమాధానం సంతృప్తికరంగా లేదని మండిపడ్డారు. వెంటనే నితీశ్ కుమార్ మాట్లాడుతూ 'మా ప్రభుత్వం రాష్ట్రం కోసం ఎంతో చేసింది. గతంలోని ప్రభుత్వం ఎలాంటి మేలు చేయలేదు' అని ఆరోపించారు. రాష్ట్ర మహిళలకు ఇప్పుడున్నంత గౌరవం గత ప్రభుత్వాల హయాంలో లేదని అన్నారు. 'వారు మహిళల కోసం ఏం చేశారు? తన భర్త సమస్యల్లో ఉన్నప్పుడు ఆమెను సీఎం కుర్చీలో కూర్చోబెట్టారు' అని సీఎం వ్యాఖ్యానించారు. ఆయన వ్యాఖ్యలపై రాబ్డీదేవి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. నితీశ్‌కుమార్ మద్యం మత్తులో ఇష్టానుసారం మాట్లాడుతున్నారని రాబ్డీదేవి ఆరోపించారు. 'నాడు ఎలాంటి పనులు జరగలేదని వ్యాఖ్యానించడం కాదు. వాటి రికార్డులు సభకు చూపించగలరా?' అని ప్రశ్నించారు. అనంతరం సభ నుంచి ప్రతిపక్షాలతో కలిసి వాకౌట్ చేశారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.